

'అన్నం పెట్టే రైతన్నను
రుణ విముక్తుణ్ని చేయడమే
నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 163

శనివారం 2-9-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సేవాపథం

ధైర్యం పలికిన పేరు... దేవాన్షి

పద్నాలుగు సంవత్సరాల వయసులో యాసిడ్ దాడికి గురైంది ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దేవాన్షీ యాదవ్. తాను బాధితురాలిగా ఉన్నప్పుడు ఒంటరి. ఇప్పుడు మాత్రం తానే ఒక సైన్యం. 'షాహీద్ రామాశ్రయ్ వెల్ఫేర్ సోసైటీ' అనే స్వచ్ఛంద సంస్థను మొదలుపెట్టి న్యాయసహాయం అందించడం నుంచి ఉపాధి అవకాశాలు కల్పించడం వరకు బాధితుల కోసం ఎన్నో సహాయ కార్యక్రమాలు చేపడుతున్న దేవాన్షి గురించి...





దేవాన్షీ యాదవ్

కష్టాలన్నీ కలిసికట్టుగా వచ్చాయా! అన్నట్లుగా దేవాన్షీ యాదవ్ నెలల వయసులో ఉన్నప్పుడే తండ్రి చనిపోయాడు. పద్నాలుగు సంవత్సరాల వయసులో కుటుంబ స్నేహితుడిగా భావించే ఒకడు లైంగిక వేధింపులకు, యాసిడ్ దాడికి పాల్పడ్డాడు.

చుట్టుపక్కల వాళ్లు, బంధువులు మాత్రం దేవాన్షినే బోనులో నిలబెట్టారు.

'మన జాగ్రత్తలో మనం ఉంటే ఇలాంటివి జరగవు కదా' లాంటి మాటలు తనను ఎంతో బాధ పెట్టాయి.



ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీ పట్టణానికి చెందిన 31 సంవత్సరాల దేవాన్షి వెనక్కి తిరిగి చూసుకుంటే ఇలాంటి కష్టాలెన్నో కనిపిస్తాయి. అయితే వాటిని గుర్తు చేసుకుంటూ బాధను గుండెలో పెట్టుకోలేదు. తనలాంటి కష్టాలు వచ్చిన వారికి అండగా నిలబడాలనుకుంది. అలా మొదలైందే 'షాహీద్ రామాశ్రయ్ వెల్ఫేర్ సొసైటీ' అనే స్వచ్ఛంద సంస్థ.

లైంగిక వేధింపులకు గురవుతున్న వారి నుంచి గృహహింస బాధితుల వరకు ఎంతోమందికి ఈ సంస్థ తరపున అండగా నిలబడింది దేవాన్షి.

'ధైర్యసాహసాలలో మా అమ్మే నాకు స్ఫూర్తి. నాకు తొమ్మిది నెలలు ఉన్నప్పుడు నాన్న చనిపోయాడు. ఒకవైపు భర్త చనిపోయిన బాధ, మరోవైపు బిడ్డను ఎలా పోషించాలనే బాధ, అయోమయం ఆమెను చుట్టుముట్టాయి. ఆరోజు ఆమె ధైర్యం కోల్పోయి ఉంటే ఈ రోజు నేను ఉండేదాన్ని కాదు. జీవితంలో ప్రతి సందర్భంలో ధైర్యంతో ముందుకు వెళ్లింది. తల్లిగా ప్రేమానురాగాలను పంచడమే కాదు ధైర్యం అనే విలువైన బహుమతిని ఇచ్చింది' అంటుంది దేవాన్షి.

భారమైన జ్ఞాపకాల నుంచి బయటికి రావడానికి, శక్తిమంతం కావడానికి సామాజిక సేవా కార్యక్రమాలు దేవాన్షికి ఎంతో ఉపయోగపడ్డాయి.

దేవాన్షి దగ్గరకు సహాయం కోసం వచ్చే బాధితుల్లో ఏ కోశానా ధైర్యం కనిపించదు. అలాంటి వారిలో ధైర్యం నింపడం అనేది తాను చేసే మొదటి పని. తనని కుటుంబ సభ్యురాలిగా భావించుకునేలా ఆత్మీయంగా ఉండడం రెండో పని. కౌన్సెలింగ్ ద్వారా వారికి భవిష్యత్ పట్ల ఆశ రేకెత్తించడం మూడోపని.

'ఈ సమాజం నన్ను చిన్నచూపు చూస్తుంది. నాకు ఎవరూ అండగా లేరు' అనుకున్న ఎంతోమందికి 'నాకు ఎవరి అండా అక్కర్లేదు. ఒంటరిగా పోరాడగలను. నా కోసం నేను పోరాడలేనా!' అనే ధైర్యాన్ని ఇచ్చింది.

'ఇంకేముంది నా భవిష్యత్ బుగ్గిపాలు అయింది' అని జీవనాసక్తి కోల్పోయిన వారిలో 'కష్టాలు నీ ఒక్కరికే కాదు. అందరికీ వస్తాయి. అదిగో నీ భవిష్యత్' అంటూ ఆశావాహ దృక్పథాన్ని కలిగించింది.

'పదా... పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేద్దాం' అని దేవాన్షి అన్నప్పుడు...

'అమ్మో! నాకు పోలీస్ స్టేషన్ అంటే భయం' అన్నది ఒక బాధితురాలు.

'తప్పు చేసిన వాడు హాయిగా తిరుగుతున్నాడు. ఏ తప్పూ చేయని నువ్వెందుకు భయపడడం' అని దేవాన్షి అనగానే ఆ బాధితురాలు పోలీస్ స్టేషన్‌కు బయలు దేరింది. ఇలాంటి సంఘటనలు ఎన్నో!

సంస్థ అడుగులు మొదలుపెట్టిన కొత్తలో... 'మీవల్ల ఏమవుతుంది' అన్నట్లుగా ఎంతోమంది వ్యంగ్యంగా మాట్లాడేవారు.

వారికి తన పనితీరుతోనే సమాధానం ఇచ్చింది దేవాన్షి.

'దేవాన్షీ చాలా పట్టుదల గల వ్యక్తి. ఎలాంటి పరిణామాలు ఎదురైనా ఒక్క అడుగు కూడా వెనక్కి వెయ్యదు. భర్త, అత్తమామల వేధింపులు తట్టుకోలేక నేను దేవాన్షి దగ్గరకు వచ్చాను. ఆమె నాకు ఆశ్రయం ఇచ్చింది. విషయం తెలుసుకున్న అత్తింటి వారు దేవాన్షిని బెదిరించడానికి వీధిరౌడీలను పంపించారు. ఆమె ధైర్యాన్ని చూసి వారు తోక ముడవడానికి ఎంతో సమయం పట్టలేదు' అంటుంది బరేలీకి చెందిన రత్న.

బరేలీ పట్టణానికి చెందిన వారే కాదు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ఎంతోమంది మహిళలు దేవాన్షి సహాయం కోసం రావడం ప్రారంభించారు.

'మా దగ్గరకు వచ్చేవాళ్లలో 60 నుంచి 70 శాతం గృహహింస బాధితులే. వారికి అండగా నిలిచినప్పుడు సహజంగానే బెదిరింపులు ఎదురయ్యాయి. అయితే నేను వాటిని ఎప్పుడూ ఖాతరు చేయలేదు. మీకు ఇంత ధైర్యం ఎక్కడినుంచి వచ్చింది? అనే ప్రశ్న అడుగుతుంటారు. ఒకప్పుడు నేను మీలాగే భయపడేదాన్ని... అంటూ నాకు ఎదురైన చేదు అనుభవాలను వారితో పంచుకుంటాను. అమ్మ నుంచి ధైర్యం ఎలా పొందానో చెబుతాను. ధైర్యం అనేది ఒకరు దయతో ఇచ్చేది కాదు. అది అందరిలోనూ ఉంటుంది. దాన్ని ఉపయోగించుకుంటున్నామా? లేదా? అనేదే ముఖ్యం అని చెబుతుంటాను' అంటుంది దేవాన్షీ యాదవ్.

'అత్తింటి బాధలు తట్టుకోలేక బయటికి వచ్చాను. ఇప్పుడు నేను ఒంటరిగా ఎలా బతకగలను' అని దిక్కులు చూస్తున్న ఎంతోమందికి సంస్థ ద్వారా దిక్కు చూపించి సొంత కాళ్ల మీద నిలబడేలా చేసింది. బాల్యవివాహాలు జరగకుండా అడ్డుపడింది.

'మంచిపని చేస్తే ఆ ఫలితం తాలూకు ఆనందమే కాదు అపారమైన శక్తి కూడా లభిస్తుంది. ఆ శక్తి మరిన్ని మంచిపనులు చేయడానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది' అంటుంది దేవాన్షీ యాదవ్. ●

సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా..

**తరగతి గది దేశ భవితను నిర్ణయిస్తుంది.
ఇంగ్లిష్ భాష అభివృద్ధిని నిర్ణయిస్తోంది.
ఇంగ్లిష్ రాకపోతే పురోభివృద్ధి దరి చేరనంటోంది.
గ్రామాల్లో పిల్లలు ఇంగ్లిష్‌లో మెరికలు కావాలంటే...
వాళ్లకు చదువు చెప్పే గురువులకు మెళకువలు నేర్పాలి.
'చక్కటి ఇంగ్లిష్ వచ్చిన తెలంగాణ సాధనే నా లక్ష్యం'...
అంటున్నారు టీచర్లకు పాఠాలు చెప్తున్న ఈ ఇంగ్లిష్ టీచర్.**

గురుబోధకుడు

ఇంగ్లిష్ టీచర్



రామేశ్వర్ గౌడ్

'**మం**చి ఇంగ్లిష్ రావాలంటే పెద్ద కార్పొరేట్ స్కూల్‌లో చదవాలి. నిజమా! నిజమే కావచ్చు. పెద్ద స్కూల్లో చదివిన పిల్లలు నోరు తెరిస్తే ఇంగ్లిషే వినిపిస్తుంది'. సమాజంలో స్థిరపడిపోయి ఉన్న ఒక అభిప్రాయం అది. 'నాకు రెండేళ్ల టైమివ్వండి, తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి చేత చక్కటి ఉచ్చారణ, వ్యాకరణ సహితంగా మంచి బ్రిటిష్ ఇంగ్లిష్ మాట్లాడిస్తాను' అంటున్నారు రామేశ్వర్ గౌడ్. 'లక్షల సంఖ్యలో ఉన్న విద్యార్థులందరి దగ్గరకు నేను వెళ్లలేను, కాబట్టి ఆ విద్యార్థులకు పాఠాలు చెప్పే టీచర్లకు ఇంగ్లిష్‌లో బోధించడంలో మెళకువలు నేర్పిస్తాను అవకాశం ఇవ్వండి' అన్నాడు. ఆరు నెలల కాలంలో తెలంగాణ రాష్ట్రంలోని 14 జిల్లాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బోధించారు. 'నేను నిర్దేశించుకున్న సమయం మరో ఒక టిన్నర ఏడాది ఉంది. కానీ ఈ లోపే లక్ష్యాన్ని చేరగలననే నమ్మకం కలుగుతోంది' అన్నారు రామేశ్వర్ గౌడ్ టీచర్స్ డే సందర్భంగా సాక్షితో మాట్లాడుతూ.

మా వాళ్లది ధర్మాగ్రహమే!

ఆస్ట్రేలియాకు వెళ్లకుండా ఇక్కడ పాఠాలు చెప్పడం వల్ల నేను కోల్పోయిందేమీ లేదు. డబ్బు పరంగా కొంత తగ్గి ఉండవచ్చు. డాక్టర్‌లు, డిఫెన్స్ రంగాలకు మినహా సినిమా, రాజకీయరంగం, న్యాయరంగం... అనేక రంగాల్లో నిష్ణాతులకు పాఠాలు చెప్పడంతో సెలబ్రిటీ టీచర్‌గా మంచి గుర్తింపు వచ్చింది. ప్రభుత్వ టీచర్లకు ఉచిత పాఠాల ద్వారా వచ్చిన గౌరవం నాకు సంతృప్తినిస్తోంది. అలాగని నా జర్నీ అలవోకగా సాగలేదు. సక్సెస్ శిఖరానికి చేరేలోపు నేను పొందిన అవమానాలు కూడా చిన్నవేమీ కావు. నా నిర్ణయం తెలిసిన వెంటనే నా ఫ్రెండ్స్ 'వీడు లైఫ్‌ని కరాబు చేసుకుంటుండు... ఆంటీ' అని మా అమ్మతో అన్నారు. మా అమ్మ చాలా బాధపడింది. ఎంత చెప్పినా వినలేదని బాధపడి నాతో మాట్లాడడం మానేసింది. ఐదుగురం అన్నదమ్ములం. నలుగురూ నన్ను కోపంగా చూసేవారు. చాలా రోజులు మౌనయుద్ధం చేశారు. ఇంట్లో ఉండలేక వేరే గదిలోకి మారిపోయాను. వాళ్ల కోపం ధర్మాగ్రహమే. నా సంకల్పం అర్థమైన తర్వాత అందరూ సపోర్ట్‌గా నిలిచారు. నా భార్య రచన, పిల్లలు కూడా నా క్లాసుల నిర్వహణలో వాళ్లు చేయగలిగిన సహాయం చేస్తున్నారు. ఆ రకంగా నేను అదృష్టవంతుడిని.

– ఎ. రామేశ్వర్ గౌడ్, ఫౌండర్, విల్ టూ కెన్, హైదరాబాద్



శ్రద్ధగా నటించాను!

రామేశ్వర్ గౌడ్ సొంతూరు షాద్‌నగర్ సమీపంలో నందిగామ. పాఠశాల విద్య తర్వాత హైదరాబాద్‌కి వచ్చారు. బీఎస్సీ కంప్యూటర్స్ తర్వాత ఉన్నత చదువులకు ఆస్ట్రేలియా వెళ్లాలనుకున్నారు. ఐల్ట్స్ పూర్తి చేసి విదేశాల్లో చదవగలిగిన అర్హత సంపాదించిన తర్వాత మనసు మార్చుకున్నట్లు తెలియచేశారాయన. "చిన్నప్పటి నుంచి నేను మంచి మాటకారిని. నాకు తెలిసిన విషయాన్ని వివరంగా చెప్పగలిగిన కమ్యూనికేషన్ స్కిల్స్ బాగా ఉండేవి. ఐల్ట్స్ (ఐఈఎల్‌టీఎస్, ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్) క్లాసులకు ఏడుగురం ఫ్రెండ్స్ కలిసి వెళ్లాం. క్లాసులో విన్న తర్వాత డౌట్స్ అడిగేవాళ్లు నా ఫ్రెండ్స్. వాళ్లకు వివరిస్తూ ఉన్న క్రమంలో చదువు చెప్పడంలో గొప్ప థ్రిల్ ఉందనిపించింది. అలాగే నన్ను వెంటాడుతూ ఉన్న మరికొన్ని అంశాలు కూడా నా నిర్ణయాన్ని ప్రభావితం చేశాయి. అవి ఏమిటంటే... కాలేజ్‌లో చేరినప్పటి నుంచి ఒక నరకంలోనే జీవించాను. లెక్చరర్‌లు ఇంగ్లిష్‌లో పాఠాలు చెప్తుంటే సరిగా అర్థమయ్యేవి కావు. దిక్కులు చూస్తే ...లేపి ప్రశ్న అడుగుతారేమోననే భయంతో శ్రద్ధగా పాఠం వింటున్నట్లు నటించేవాడిని. నా కాలేజ్ చదువంతా బొటాబొటి మార్కులతోనే సాగింది. నేను ఇంటర్వ్యూలకు వెళ్లి, నా వంతు కోసం ఎదురు చూస్తున్న సమయంలో నా లాగ ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్లు మాట్లాడుతున్న ఇంగ్లిష్‌కి భయపడి 'ఈ ఉద్యోగం నాకేం వస్తుంది'... అని ఇంటర్వ్యూకి హాజరు కాకుండానే వెనక్కి వచ్చిన సందర్భాలున్నాయి. భాష రాకపోవడం వల్ల ఒక జాతి మొత్తం మూల్యం చెల్లించుకుంటోందా అని ఆవేదన కలిగింది. అప్పటికే వీసా కోసం పాస్‌పోర్టును డ్రాప్ బాక్స్‌లో వేసి ఉన్నాను. అలాంటి సమయంలో మా ఐల్ట్స్ సర్ సురేందర్ రెడ్డితో 'నేను ఆస్ట్రేలియాకి వెళ్లను. ఇక్కడే ఉండి ఇంగ్లిష్ పాఠాలు చెబుతాను' అని చెప్పినప్పుడు ఆయన ఆశ్చర్యపోయారు. నా ఆలోచన తెలిసిన తర్వాత అభినందించారు. ఇక 2007లో తార్నాకలో చిన్న గదిలో ఆరువేల అద్దెతో నా ఇన్‌స్టిట్యూట్ 'విల్ టూ కెన్, ద స్ట్రైడ్' మొదలైంది. విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు ఇంగ్లిష్ నేర్పించడం మొదలుపెట్టాను. తర్వాత నా ఇన్‌స్టిట్యూట్‌ని అమీర్‌పేటకు మార్చాను. అదంతా నేను ఆర్థికంగా స్థిరపడడానికి. ఆ తర్వాత ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఉచితంగా పాఠం చెప్పడానికి అనుమతులు సంపాదించగలిగాను.

వాళ్లకు ఇంగ్లిష్ వచ్చు... కానీ!

నా పాఠాలు వినే ఉపాధ్యాయులందరూ ఇంగ్లిష్ వచ్చిన వాళ్లే. కానీ ఇంగ్లిష్‌లో పాఠం చెప్పడంలో శిక్షణ పొందిన వాళ్లు కాదు. మనకు ఇంగ్లిష్ భాషను నేర్పించే మెథడాలజీ రూపొందలేదు. దాంతో ఉపాధ్యాయులకు-విద్యార్థులకు మధ్య పెద్ద అగాధం ఏర్పడుతోంది. ఆ ఖాళీని నేను భర్తీ చేశాను. తెలుగు అర్థమై, ఇంగ్లిష్ చదవడం, రాయడం వచ్చి ఉంటే చాలు. అనర్గళంగా మాట్లాడించగలిగిన టీచింగ్ మెథడాలజీ రూపొందించాను. టీచర్లకు నేను చెప్తున్న పాఠాలు ఆ మెథడాలజీనే. ఎనభైమూడు వేల మంది టీచర్లున్న రాష్ట్రంలో ఆరు నెలల్లో ముప్పైవేల మంది పూర్తయ్యారు. ఇక్కడ మరో విషయాన్ని చెప్పాలి. కరోనా కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. అప్పుడు సమాజం వర్చువల్ విధానంలోకి మారిపోయింది. నేనిప్పుడు బాచుపల్లిలో నా ఇంట్లో కూర్చుని జూమ్ ద్వారా ఏకకాలంలో వేలాదిమందికి పాఠం చెప్పగలుగుతున్నాను. నలభై ఐదు రోజుల సెషన్‌లో ఒకసారి మాత్రం ఆయా జిల్లాలకు వెళ్లి స్వయంగా ఇంటరాక్ట్ అవుతున్నాను. 'రియల్ లైఫ్ ఇంగ్లిష్, స్పోకెన్ ఇంగ్లిష్' అని రెండు పుస్తకాలు రాశాను.

గురువు జ్ఞానాన్ని దాచుకోకూడదు!

ఈ సందర్భంగా నేను చెప్పేదొక్కటే... 'నేను నూటికి నూరుపాళ్లూ పర్‌ఫెక్ట్ అని చెప్పడం లేదు, నాకు తెలిసిన జ్ఞానాన్ని నూరుశాతం పంచుతున్నాను. టీచర్‌కి ఉండాల్సిన ప్రథమ లక్షణం అదే'' అన్నారు రామేశ్వర్ గౌడ్. నిజమే... గురువు జ్ఞానాన్ని తనలో దాచుకోకూడదు, విస్తరింపచేయాలి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఫొటోలు : నోముల రాజేశ్ రెడ్డి

బ్యూటిప్స్

కొబ్బరి పాలతో మృదువుగా..

చర్మం ఆరోగ్యంగా నిగనిగలాడుతూ ఉండాలంటే కొబ్బరిపాలు మేలైన ఎంపిక.



- కొబ్బరి పాలను రాత్రిపూట పడుకునేముందు తలకు పట్టించి, షవర్ క్యాప్ వేసుకోవాలి. మరుసటి రోజు ఉదయం షాంపూతో తలస్నానం చేయాలి. కొబ్బరి పాలు వెంట్రుకల కుదుళ్లకు చేరి, శిరోజాల మృదుత్వం దెబ్బతినదు.
- పచ్చి కొబ్బరిని తురిమి, మిక్సీలో గ్రైండ్ చేసి, పాలు తీయాలి. ఈ పాలను చర్మానికంతటా పట్టించి, అరగంట ఆగి, చల్లని నీటితో స్నానం చేయాలి. చర్మానికి మంచి మాయిశ్చరైజర్‌లా పని చేసి, ముడతలు తగ్గి, మృదువుగా మారిపోతుంది.



- ఎండలో నుంచి ఇంటికి వెళ్లినప్పుడు ఫ్రిజ్‌లో ఉంచిన కొబ్బరి పాలను, దూదితో ఒళ్లంతా రాసుకొని, పది నిమిషాలు సేదదీరాలి. తర్వాత స్నానం చేస్తే ఎండవల్ల కమిలిన చర్మానికి ఉపశమనం లభిస్తుంది. మృదువుగా, కాంతిమంతంగా తయారవుతుంది.

న్యూస్‌మేకర్

**కామెడీ చేసే స్త్రీలు తక్కువ.
దానికి కారణం ఎప్పటి నుంచో
స్త్రీల నవ్వు మీద అదుపు ఉండటమే.
నవ్వని స్త్రీలు ఎదుటి వారిని ఏం నవ్విస్తారు?
థ్యాంక్స్ టు స్టాండప్ కామెడీ.
ఇటీవల కొంతమంది స్టాండప్ కామెడీలో
పేరు గడిస్తున్నారు.
ముంబై కమెడియన్ ఉరుజ్ అష్ఫాక్
ఏకంగా ఈడెన్‌బర్గ్ కామెడీ అవార్డును
గెలుచుకుంది.
ఈ అవార్డు ఇలా భారతీయులకు రావడం
ఇదే మొదటిసారి.**

కామెడీ క్వీన్



ఉరుజ్ అష్ఫాక్

'**ఈ**డెన్ బర్గ్ కామెడీ అవార్డ్స్'ను కామెడీ ఆస్కార్‌గా భావిస్తారు. అందువల్ల 28 ఏళ్ల ఉరుజ్ అష్ఫాక్ 2023 సంవత్సరానికి 'బెస్ట్ న్యూకమర్' అవార్డును గెల్చుకోవడం చాలా పెద్ద విషయంగా చెప్పుకోవాలి. ప్రతి సంవత్సరం ఈడెన్‌బర్గ్‌లో జరిగే జూలై, ఆగస్టుల్లో జరిగే ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఒక రకంగా సంప్రదాయ ఫెస్టివల్స్ మీద తిరుగుబాటు లాంటిది. ఇక్కడ ఎంట్రీలు, ఎగ్జిట్‌లు ఉండవు. ఎవరైనా వచ్చి తమ కళను ప్రదర్శించవచ్చు. అందుకే ప్రపంచవ్యాప్త కళాకారులు భారీగా తరలివచ్చి తమ కళలను ప్రదర్శిస్తుంటారు. వాటిని చూడటానికి జనం పోటెత్తుతారు. ఈ సందర్భంగానే కామెడీ అవార్డ్స్ ఇస్తారు.

ఈసారి ఉరుజ్ అష్ఫాక్ చేసే 'ఓ... నో' అనే షో బెస్ట్ న్యూ కమర్ అవార్డ్ గెల్చుకుంది. భారతీయులలో అందునా స్త్రీలలో ఇలా అవార్డు గెలుచుకున్నవారు ఇంతకు మునుపు లేరు.

అబూదాబి నుంచి

ఉరుజ్ అష్ఫాక్ అబూదాబిలో పుట్టి పెరిగి స్వదేశమైన భారత్‌కు తల్లిదండ్రులతో పాటు 12 ఏళ్ల వయసులో తిరిగి వచ్చింది. ఆ తర్వాత చదువంతా ముంబైలో సాగించింది. చిన్నప్పటి నుంచి చాలా మాటకారి అయిన ఉరుజ్ సైకాలజీలో డిగ్రీ చేశాక 2014 నుంచి స్టాండప్ కామెడీ చేయడం మొదలెట్టింది. స్టాండప్ కామెడీ అప్పుడప్పుడే ఒక ఉపాధిగా మారుతున్నా అది మగవాళ్ల వ్యవహారంగానే ఉండింది. అందువల్ల ఆమెకు కంటెంట్ రాసే పని ఎక్కువగా దొరికేది తప్ప షో దొరికేది కాదు. అయినప్పటికీ ఉరుజ్ చిన్నా చితకా సందర్భాలలో దొరికిన సమయంలో నవ్వించే ప్రయత్నం చేసేది. అయితే 2017 కేవలం మహిళా స్టాండప్ కమెడియన్స్ కోసం నిర్వహించిన 'క్వీన్స్ ఆఫ్ కామెడీ'లో ఉరుజ్ చేసిన కామెడీ విపరీతంగా గుర్తింపు పొందింది. ఇక ఆమె వెను తిరిగి చూళ్లేదు.

మైక్రోఫోనే ఆయుధం

స్టాండప్ కామెడీ చేసేవాళ్ల దగ్గర మైక్రోఫోన్ తప్ప వేరే ఆయుధం ఉండదు. ఆ మైక్రోఫోన్‌లో వారు పలికే ప్రతి మాట ఎదురుగా ఉన్న ఆడియెన్స్‌ను వ్యంగ్యంగా, పదునుగా తాకి హాస్యం పుట్టించాలి. అయితే ఇక్కడ మనోభావాలు దెబ్బ తీయకూడదు. అలాగే పిచ్చి జోకులు వేయకూడదు. అలా చేస్తే నవ్వు కాస్త నవ్వుల పాలవుతుంది. అయితే ఉరుజ్ ప్రత్యేకత ఏమిటంటే ఆమె చాలా వేగంగా మాట్లాడుతూ సందర్భానికి తగినట్టుగా పంచ్ వేసి ఆకట్టుకుంటుంది. ఆమెవన్నీ స్వీయ జీవితంలోని సంఘటనలే. వాటినే చెప్తూ నవ్విస్తుంది. ముఖ్యంగా ఈ కాలంలోని మానవ సంబంధాలు ఎలా ఉన్నాయో చెప్తే అందరూ భుజాలు తడుముకుంటూ వింటారు. 'క్యాజువల్ రిలేషన్‌షిప్స్' పేరుతో ఈకాలపు స్త్రీ-పురుష సంబంధాలను ఆమె విమర్శించే తీరు ఆలోచింప చేసింది. తనను తాను నాస్తికురాలిగా చెప్పుకునే ఉరుజ్ నిర్బంధ సంప్రదాయాలపై కూడా జోకులు పేల్చడం కద్దు. 'మర్యాదస్తులను ఒక్కోసారి చిన్నబుచ్చడానికి వెనుకాడను. సరిహద్దుల్లోనే ఉంటే హాస్యం పుట్టదు. గీత దాటాలి' అనే ఉరుజ్ కత్తి మీద సాము వంటి హాస్యంలో ఒక స్త్రీగా రాణిస్తూ ఉండటం కచ్చితంగా మెచ్చుకోవాల్సిన సంగతి.

ఇంటిప్స్



- గోరు వెచ్చని పాలల్లో రెండు టీస్పూన్ల పెరుగు వేసి కలపాలి. పాలల్లో ఈ మిశ్రమం వేసి, వడలను వేసి ఐదారుగంటలు నానపెడితే పెరుగు చక్కగా తోడుకుంటుంది. ఇప్పుడు ఈ వడలకు తాలింపు వేసి తింటే పెరుగు వడలు చాలా రుచిగా ఉంటాయి. పెరుగు లేనప్పుడు ఇలా చేస్తే పెరుగు పులవకుండా పెరుగు వడలు రుచిగా వస్తాయి.



- వేడినీళ్లలో బేకింగ్ సోడా, కొద్దిగా నిమ్మరసం వేసి కలపాలి. ఈ నీటిలో టూత్ బ్రష్‌ను మునిగేలా వేస్తే ఇరవై నిమిషాలు నానబెట్టాలి. తరువాత సాధారణ నీటితో కడిగితే బ్రష్‌లో ఉన్న మురికి, బ్యాక్టీరియా పోతుంది. పదిరోజులకొకసారి బ్రష్‌లను ఇలా శుభ్రం చేసుకుంటే, దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి.




- రెండు టేబుల్ స్పూన్ల కార్న్‌ఫ్లోర్, రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిని కలపాలి. ఈ మిశ్రమంలో ముంచిన టిక్కాను, తరువాత గుడ్లసొనలో ముంచి డీప్‌ఫ్రై చేస్తే టిక్కా క్రిస్పీగా మరింత రుచిగా వస్తుంది.



- అప్పడాలు, వడియాలు, పల్లీలు, కరివేపాకు వంటివి నూనె ఎక్కువ పీల్చకుండా డీప్‌ఫ్రై చేయాలంటే.. ముందుగా వాటిని ఇనుప జాలీ గరిటలో వేసి గరిటను కాగిన నూనెలో ముంచుతూ పైకి లేపుతూ ఫ్రై చేయాలి. ఇలా చేస్తే నూనె తక్కువగా పీల్చడంతో పాటు క్రిస్పీగా, రుచిగా వస్తాయి.



- పకోడి, బజ్జీల పిండి కలిపేటప్పుడు పదార్థాలన్నివేసి కలుపుకున్నాక... చివరల్లో వంటసోడా కలపాలి. ఇలా కలపడం వల్ల బజ్జీలు నూనె తక్కువగా పీల్చడంతోపాటు మంచి రంగులో కనిపిస్తాయి.


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 163

శనివారం 2-9-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ఫిడే'ని దాటిన గుకేశ్

ఫిడే ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున నంబర్‌వన్ - IVలో



రెండు నెలల్లో అతిపెద్ద లాభం

సెన్సెక్స్ 556 పాయింట్ల ప్లస్ 19,400 స్థాయి పైకి నిఫ్టీ - IVలో



నేడే పీఎస్ఎల్‌వీ సీ57 ప్రయోగం

సూర్యుడిపై పరిశోధన సాగించే ఆదిత్య ఎల్-1 ఉపగ్రహ ప్రయోగాన్ని నేటి ఉదయం 11:50 గంటలకు షార్ నుంచి చేపట్టనున్నారు.

వివరాలు 6లో ▸



పాక్‌లో ఆత్మాహుతి దాడి

పాక్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో తొమ్మిది మంది సైనికులు మృతి చెందారు. దాడికి తామే కారణమని టీటీపీ ప్రకటించుకుంది.

వివరాలు 6లో ▸



మాజీ ఎంపీకి జీవిత ఖైదు

1995లో జరిగిన జంటహత్య కేసుల్లో మాజీ ఎంపీ ప్రభునాథ్ సింగ్(70)కు సుప్రీం కోర్టు జీవితఖైదు విధించింది.

వివరాలు 6లో ▸



సింగపూర్ అధ్యక్షుడిగా థర్మన్

భారత సంతతికి చెందిన ప్రముఖ ఆర్థికవేత్త థర్మన్ షణ్ముగరత్నం(66) సింగపూర్ అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్

'కోతల' కథలు మీ బాబు కోసమేగా రామోజీ..



- దక్షిణాది అంతటా తీవ్ర విద్యుత్ కొరత.. కొనుగోలుకు ఎంత వెచ్చించేందుకైనా సర్కారు సిద్ధం
- బిడ్ వేసినా మార్కెట్‌లో దొరకని పరిస్థితి
- కనిష్ట స్థాయికి పడిపోయిన జల, పవన విద్యుత్
- దేశవ్యాప్తంగా బొగ్గు కొరత
- అయినా.. పక్కా ప్రణాళికతో నిరంతరాయ సరఫరాకు ప్రభుత్వం చర్యలు
- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఈనాడులో 'వైకాపా విద్యుత్ కోతల పథకం' కథనం
- చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం రోజు రోజుకీ దిగజారుతున్న రామోజీ

7లో

బాబూ! ఆ డబ్బెక్కడిది?

ఆ రూ.118 కోట్లనూ అక్రమ ఆదాయంగా పరిగణిస్తే తప్పేంటి?

టీడీపీ అధినేత చంద్రబాబుకు ఆగస్టు 4నే ఐటీ శాఖ నోటీసులు జారీ చేసినట్లు హిందుస్థాన్ టైమ్స్ పత్రిక కథనం

- గతంలోనే బాబు పీఏ శ్రీనివాస్ ఇంట్లో ఐటీ శాఖ సోదాలు
- కాంట్రాక్టు సంస్థల నుంచి చేతులు మారిన రూ.2,000 కోట్ల ముడుపులు
- అవి రకరకాల షెల్‌కంపెనీల నుంచి బాబుకు చేరినట్లుగా పత్రాల్లో వెల్లడి
- ఆ పత్రాల ఆధారంగా చంద్రబాబుకు నోటీసులిచ్చిన ఐటీ శాఖ
- తనకు నోటీసులిచ్చే అధికారం ఆ సర్కిల్‌కు లేదంటూ బాబు సవాలు
- తమకు అధికారం ఉందని సెక్షన్లను ఉటంకిస్తూ బదులిచ్చిన ఐటీ శాఖ
- షాపూర్జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ నుంచి బాబుకు భారీగా ముడుపులు
- మనోజ్ పార్థసానికి చెందిన ఫినిక్స్ ఇన్‌ఫ్రా, పారా ట్రేడింగ్ షెల్ కంపెనీల ద్వారా తరలింపు
- సోదాల్లో ఆధారాలు చేజిక్కించుకుని మరీ... 2019, 2020లో వెల్లడించిన ఐటీ శాఖ
- బాబు అవినీతిలో ఆ రూ.2000 కోట్లు 'శాంపిల్' మాత్రమేనని జనంలో చర్చ

7లో


మచ్చుకు రూ. 2,000 కోట్లు

చంద్రబాబు కొండంత అవినీతిపై గోరంత వెలుగు

టీడీపీ అధినేత పీఏపై జరిగిన ఐటీ దాడుల్లో బయటపడ్డ రూ.2 వేల కోట్ల బాగోతం

ఐటీ నోటీసులకు సంబంధించి చంద్రబాబు అవినీతిపై 2020 ఫిబ్రవరి 14న సాక్షి ప్రచురించిన కథనం

నిజాయితీ ఉంటే ఐటీ నోటీసులపై నోరు విప్పాలి

- చంద్రబాబుకు మాజీ మంత్రి పేర్ని నాని సవాలు
- నీకు ఆదాయ పన్ను శాఖ నోటీసులు ఇచ్చిందా? లేదా?
- హిందూస్థాన్ టైమ్స్‌లో వచ్చిన వార్త నిజమా? కాదా?
- బాబు అవినీతిని ఆ పత్రిక బయటపెట్టింది
- రాజధాని పేరుతో బాబు డబ్బు కాజేశారు

- వివరాలు 7లో

వైఎస్సార్ రైతు భరోసా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



కౌలు రైతన్నకూ 'భరోసా'

దేశంలో ఎక్కడా లేనివిధంగా కౌలుదారులకూ లబ్ధి: సీఎం జగన్

కౌలు రైతులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా చట్టం తీసుకొచ్చాం

- భూ యజమానులకు నష్టం జరగకుండా... భూమినే నమ్ముకొని జీవిస్తున్న వాస్తవ సాగుదారులకు సీసీఆర్సీ కార్డులిప్పిస్తున్నాం
- దేవదాయ, అటవీ భూముల సాగుదారులకూ 'భరోసా' కల్పించాం
- నాలుగేళ్లలో 5.28 లక్షల మంది కౌలు రైతులు, 3.99 లక్షల మంది ఆర్‌వోఎఫ్ఆర్ రైతులకు రూ.1,122 కోట్ల పెట్టుబడి సాయం అందించాం
- ఏ సీజన్‌లో జరిగిన పంట నష్ట పరిహారాన్ని ఆ సీజన్ ముగియక ముందే రైతులకు జమ చేస్తున్నాం
- వరుసగా ఐదో ఏడాదీ తొలివిడతగా 1.46 లక్షల మంది కౌలు రైతులకు రూ.109.74 కోట్ల వైఎస్సార్ రైతు భరోసా సాయం పంపిణీ
- జూన్-ఆగస్టు వర్షాలతో పంట నష్టపోయిన 11,373 మంది రైతులకు రూ.11.01 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ జమ

2లో

ఈ-క్రాప్ కీలకం

వర్షాల కొరతతో వ్యవసాయం, కంటెంజెన్సీ ప్రణాళికపై ముఖ్యమంత్రి జగన్ ఉన్నతస్థాయి సమీక్ష

రైతులను ఆదుకునేందుకు పంటల నమోదుపై దృష్టి పెట్టాలి.. దేశవ్యాప్తంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు

2లో

93% వెనక్కు వచ్చేశాయ్

రూ.2000 నోట్లపై ఆర్‌బీఐ వెల్లడి



- మే 19వ తేదీ (ఉపసంహరణ నిర్ణయం వెలువడిన రోజు) నాటికి చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో 93 శాతం తమకు తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆగస్టు 31 నాటికి చెలామణిలో ఉన్న రూ.2000 నోట్ల విలువ రూ.24 వేల కోట్లకు పడిపోయిందని పేర్కొంది. బ్యాంక్‌లకు తిరిగి వచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలో జరగ్గా, 13 శాతం బ్యాంక్‌ల్లో ఇతర కరెన్సీలోకి మార్పిడి ద్వారా వెనక్కువచ్చినట్లు తెలిపింది.

- వివరాలు IVలో





'జమిలి'పై కమిటీ

మాజీ రాష్ట్రపతి కోవింద్ నేతృత్వంలో 16 మంది సభ్యులతో ఏర్పాటు

- 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికే..
- విధివిధానాలు, గడువుపై త్వరలో ప్రకటన చేయనున్న కేంద్రం
- నిపుణులు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తెలుసుకోనున్న కమిటీ
- కోవింద్‌తో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా భేటీ.. కమిటీ కూర్పుపై చర్చ
- జమిలి ఎన్నికలపై ఏదో ఒకటి తేల్చేయాలని మోదీ సర్కారు పట్టుదల
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కీలక నిర్ణయం తీసుకొనే అవకాశం
- 12 రాష్ట్రాలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయని ప్రచారం
- ఈ నెల 22న ఎంపీల చివరి ఫొటో సెషన్‌కు మొదలైన ఏర్పాట్లు

6లో

కలిసే పోటీ చేద్దాం

విపక్ష 'ఇండియా' కూటమి నేతల తీర్మానం

- 14 మందితో సమన్వయ కమిటీ ఏర్పాటు
- ఇచ్చి పుచ్చుకొనే ధోరణితో వ్యవహరించాలి
- సీట్ల పంపకం ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి
- 'ఇస్రో'ను ప్రశంసిస్తూ మరో తీర్మానం ఆమోదం
- 140 కోట్ల మంది మావైపు ఆశగా చూస్తున్నారు
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెల్లడి


సమావేశానికి హాజరైన వివిధ పార్టీలకు చెందిన నేతలు

6లో

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో సాధ్యమైనంత వరకు కలిసే పోటీ చేయాలని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నాయకులు తీర్మానించారు. ఇచ్చి పుచ్చుకొనే ధోరణితో వ్యవహరించాలని, రాష్ట్రాల స్థాయిలో సీట్ల పంపకం ప్రక్రియను వెంటనే ప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని నిర్ణయానికొచ్చారు. ముంబైలో 'ఇండియా' కూటమి రెండు రోజుల కీలక సమావేశం శుక్రవారం ముగిసింది. ముందస్తు ఎన్నికలు, ఒకే దేశం-ఒకే ఎన్నికలపై ఊహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో కూటమి తదుపరి కార్యాచరణపై నేతలు విస్తృతంగా చర్చించి పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. కొన్ని తీర్మానాలు చేశారు. కూటమికి సంబంధించిన కీలకమైన విధాన నిర్ణయాలు తీసుకోవడంతో పాటు సీట్ల పంపకంపై చర్చించడానికి 14 మంది సభ్యులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎన్నికల్లో సాధ్యమైనంత వరకు కలిసే పోటీ చేద్దామంటూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. 'జుడేగా భారత్, జీతేగా భారత్' అనే థీమ్‌తో వివిధ భాషల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానం ఆమోదించారు.


నేడు సీఎం జగన్ దంపతులు లండన్ పయనం

9 రోజుల పాటు పర్యటన

సాక్షి, అమరావతి: వ్యక్తిగత పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దంపతులు శనివారం రాత్రి 9.30 గంటలకు లండన్ బయలుదేరి వెళ్లనున్నారు. అక్కడ చదువుకుంటున్న తమ పిల్లలను కలిసేందుకు వీరు వెళుతున్నారు. తిరిగి ఈ నెల 11వ తేదీ రాత్రికి వారు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

అభివృద్ధికి దిక్సూచి

నేడు వైఎస్సార్ వర్ధంతి



సీఎంగా వైఎస్ రాజశేఖరరెడ్డి పాలించింది ఐదేళ్ల మూడు నెలలే

ఆ కొద్ది కాలంలోనే ప్రజలకు ఎంత మేలు చేయొచ్చో చూపించారు

సంక్షేమం, అభివృద్ధికి మానవీయతను జోడించిన మహనీయుడు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలను అందించిన మానవతామూర్తి

జీవచ్ఛవంలా మారిన కాంగ్రెస్‌కు జీవం పోసిన రాజకీయవేత్త

- మండుటెండలో 1,475 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన ప్రజానేత
- సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపైనే ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం చేసిన రైతు బాంధవుడు
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో నిరుపేదలకు సరస్వతీ కటాక్షం
- పారదర్శక విధానాలతో పారిశ్రామికాభివృద్ధి.. పెట్టుబడుల ఆకర్షణలో అగ్రగామిగా రాష్ట్రం.. మహానేత ఒక అడుగు వేస్తే.. నాలుగు అడుగులు ముందుకేస్తున్న సీఎం జగన్

పేద బిడ్డల చదువులకు పెన్నిధి

ముస్లింల శ్రేయోభిలాషి 'వైఎస్సార్'

ఆరోగ్య దాత.. అభయ ప్రదాత


రాజన్న రాజ్యంలో రైతే రారాజు

ప్రత్యేక కథనాలు 8,9 పేజీల్లో..

నేడు ఇడుపులపాయకు సీఎం వైఎస్ జగన్

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించనున్న ముఖ్యమంత్రి

2లో



ఈ నెల 17న సభ నిర్వహించుకోండి

- ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకే..
- సభలో 500 మందికి మించి పాల్గొనరాదు.. విద్వేషపూరిత ప్రసంగాలు చేయరాదు
- ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘానికి హైకోర్టు ఆదేశం

- వివరాలు 12లో

క్లుప్తంగా...

నేడు మహానేత వైఎస్సార్ వర్ధంతి

రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి కార్యక్రమం ఈ నెల 2వ తేదీ (శనివారం) రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు, వైఎస్సార్ అభిమానులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఉదయం 9.30 గంటలకు దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపింది.

నేడు ఇడుపులపాయకు సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 2వ తేదీ (శనివారం) వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయకు వెళ్లనున్నారు. ఉదయం 9 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి ఇడుపులపాయకు చేరుకుంటారు. దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ ఘాట్ వద్ద జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని నివాళి అర్పిస్తారు. ఆ తర్వాత వైఎస్సార్ ఎస్టేట్‌లోని గెస్ట్‌హౌస్‌కు వెళతారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

ఎమ్మెల్యే చిట్టిబాబు ఆరోగ్య పరిస్థితిపై సీఎం వాకబు



హైదరాబాద్‌లో ఎమ్మెల్యే చిట్టిబాబును పరామర్శిస్తున్న డాక్టర్ హరికృష్ణ

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ చేసి వివరాలడిగి తెలుసుకున్నారు. చిట్టిబాబు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాగా, అనారోగ్యంతో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబును సీఎం ఆదేశాల మేరకు ఆయన ప్రత్యేక కార్యదర్శి, ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ పరిశీలకుడు డాక్టర్ హరికృష్ణ శుక్రవారం స్వయంగా పరామర్శించారు. ఎమ్మెల్యేకి వైద్య సేవలందిస్తున్న డాక్టర్లతో మాట్లాడారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ(అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీలో మరమ్మతుల అనంతరం రెండో యూనిట్ నుంచి గురువారం అర్ధరాత్రి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం ఏర్పడడంతో గత నెల 28న అర్ధరాత్రి విద్యుదుత్పత్తి నిలిచిపోయిన విషయం తెలిసిందే. అనంతరం యూనిట్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యను నిపుణులు యుద్ధప్రాతిపదికన సరిచేశారు. ప్రస్తుతం సంస్థలో నాలుగు యూనిట్ల నుంచి పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి జరుగుతుందని ఎన్టీపీసీ అధికారులు వెల్లడించారు.

కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ వాయిదా

సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రాజెక్ట్‌లైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల్లో నీటి లభ్యత ఆధారంగా ఇరు రాష్ట్రాల అవసరాలకు నీటి కేటాయింపు ప్రతిపాదనలపై చర్చించడానికి ఈ నెల 4న జరగబోయే త్రిసభ్య కమిటీ భేటీని కృష్ణా బోర్డు వాయిదా వేసింది. ముందే నిర్ణయించిన కార్యక్రమాలు అదే రోజున ఉన్న నేపథ్యంలో సమావేశానికి హాజరుకాలేనని ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి కృష్ణా బోర్డుకు తెలిపారు. దీంతో ఆ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే తెలిపారు. ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలతో చర్చించి త్రిసభ్య కమిటీ సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించాలనేది నిర్ణయిస్తామన్నారు.

కౌలు రైతన్నకూ 'భరోసా'

దేశంలో ఎక్కడా లేనివిధంగా కౌలుదారులకూ లబ్ధి: సీఎం జగన్

- కౌలు రైతులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా చట్టం తీసుకొచ్చాం
- భూ యజమానులను ఒప్పించి.. భూమినే నమ్ముకొని జీవిస్తున్న వాస్తవ సాగుదారులకు సీసీఆర్సీ కార్డులిప్పిస్తున్నాం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: సెంటు భూమి కూడా లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు దేవదాయ శాఖ భూములను సాగు చేసుకునే నిరుపేద రైతులు, అటవీ భూములను పండించుకునే గిరిజన రైతులను ఆదుకుంటూ అన్ని విధాలా అండగా నిలుస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పంట సాగుదారు హక్కు పత్రాలు (సీసీఆర్సీలు) పొందిన వారిలో అర్హులైన 1,46,324 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులు, దేవదాయ, అటవీ భూముల సాగుదారులకు వరుసగా ఐదో ఏడాదీ తొలివిడత పెట్టుబడి సాయంతోపాటు పంట నష్టపోయిన అన్నదాతలకు ఇన్‌పుట్ సబ్సిడీని సీఎం జగన్ శుక్రవారం పంపిణీ చేశారు. కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా సాయంగా రూ.109.74 కోట్లతోపాటు పంట నష్టపోయిన 11,373 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.11.01 కోట్లతో కలిపి మొత్తం రూ.120.75 కోట్లను క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

సీజన్ ముగిసేలోగా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ..

దేవుడి దయతో ఈరోజు రెండు మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాం. ఒకటి వైఎస్సార్ రైతు భరోసా పెట్టుబడి సాయం కాగా రెండోది ఇన్‌పుట్ సబ్సిడీ. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీగా ఏ సీజన్‌లో జరిగిన నష్టాన్ని అదే సీజన్ ముగిసేలోగా అందచేస్తున్నాం. రైతన్నలతోపాటు ఎలాంటి వ్యవసాయ భూమి లేని నిరుపేద రైతులైన నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా నా వారు అని సంబోధిస్తూ అన్ని రకాలుగా వారికి అండగా, తోడుగా నిలబడుతున్న ప్రభుత్వం మనది. అందులో భాగంగానే దేశంలో ఎక్కడా లేనివిధంగా వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసాను అందిస్తున్నాం. అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు సైతం తోడుగా ఉంటూ ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వడమే కాకుండా రైతు భరోసాతో తోడుగా నిలుస్తున్నాం. దేవదాయ శాఖ భూములను సాగు చేసుకుంటున్న వారికి కూడా రైతు భరోసాతో ప్రయోజనం చేకూరుస్తున్నాం. ఇలా క్రమం తప్పకుండా ఈ వర్గాలకు కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయంగా అందిస్తున్న ప్రభుత్వం దేశంలో మరెక్కడా లేదు.

రైతులకు ఇబ్బంది లేకుండా.. కౌలు రైతులకు అండగా

కౌలు రైతుల కోసం మంచి చట్టాన్ని తీసుకొచ్చి రైతులెవరికీ (భూ యజమానులకు) నష్టం లేకుండా 11 నెలల పాటు సీసీఆర్‌సీ కార్డులను గ్రామ సచివాలయంలోనే అందుబాటులోకి తెచ్చాం. సీసీఆర్సీ కార్డు పొందిన కౌలు రైతులకు రైతు భరోసాతో పాటు మిగిలిన సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకున్నాం. కౌలు రైతులకు, రైతులకు మధ్య అవగాహన ఒప్పందాలను కుదిర్చి భూ యజమానులకు ఇబ్బంది లేకుండా వాస్తవ సాగుదారులకు మేలు చేస్తున్నాం. అందులో భాగంగా రైతుల సమ్మతితో సీసీఆర్సీ కార్డులను పొంది కౌలు చేస్తున్న 1,46,324 మంది సాగుదారులకు ఈ ఏడాది తొలివిడతగా రూ.7,500 చొప్పున పెట్టుబడి సాయంగా అందిస్తున్నాం. మొత్తంగా రూ.109.74 కోట్లను వారి ఖాతాల్లో జమ చేస్తున్నాం. ఇలా 50 నెలల్లో దాదాపు 5.28 లక్షల మంది కౌలు రైతులు, 3.99 లక్షల మంది అటవీ భూములను సాగుచేసే గిరిజనులతో కలిపి మొత్తం 9.27 లక్షల మందికి మంచి చేస్తూ రూ.1,122 కోట్లను పెట్టుబడి సాయంగా అందచేశాం.

11,373 మందికి రూ.11 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ..

ఇన్‌పుట్ సబ్సిడీకి సంబంధించి కూడా ఇదే రకమైన మంచి జరుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గోదావరికి భారీ వరదలు రావటాన్ని చూశాం. ఈ పరిస్థితుల్లో దాదాపు 4,879 హెక్టార్లలో జూన్ నుంచి ఆగస్టు లోపు వివిధ పంటలను నష్టపోయిన 11,373 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా ఈ సీజన్ ముగియక ముందే రూ.11 కోట్లను సరైన సమయానికి వారి చేతుల్లో పెడుతున్నాం.

నష్టంలోనూ తోడుగా ఉంటూ..

రైతన్నలు నష్టపోకుండా ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్ ముగిసేలోగా వారికి తోడుగా నిలిచే ఒక గొప్ప కార్యక్రమం ద్వారా గత నాలుగేళ్లలో రూ.1,977 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీగా అందించాం. రైతు నష్టపోకుండా చేయి పట్టుకుని నడిపిస్తూ.. నష్టంలో కూడా వారికి తోడుగా ప్రభుత్వం ఉందన్న భావన కలిగిస్తూ మంచి చేశాం. ఇటీవల గోదావరి వరదలకు సంబంధించి రూ.11 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడమే కాకుండా రూ.38 కోట్లు వరద సహాయం కింద అందించాం. అంతేకాకుండా వరదల వల్ల నష్టపోయిన రైతులకు, నారుమడులు, నాట్లు వేసిన రైతులను వెంటనే ఆదుకుంటూ.. మరలా వాళ్ల పంట వేసుకునేందుకు 80 శాతం రాయితీతో వరి విత్తనాలు ఆర్బీకేల ద్వారా సరఫరా చేసి వారందరికీ తోడుగా నిలబడ్డాం.

వెంటనే గోదావరి రిటైనింగ్ వాల్ పనులు

కోనసీమ కలెక్టర్‌ను ఆదేశించిన సీఎం జగన్

గోదావరి నది రిటైనింగ్ వాల్ పనులను వెంటనే ప్రారంభించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను సీఎం జగన్ ఆదేశించారు. ఇప్పటికే వర్క్ ఎస్టిమేషన్స్ పూర్తైనందున వీలైనంత వేగంగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి వెంటనే పనులను చేపట్టాలని నిర్దేశించారు.

ఆర్బీకేలు - మద్దతు ధరలు..

రైతులు నష్టపోకుండా మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేసే కార్యక్రమం కూడా ఆర్బీకేలో జరుగుతోంది. కనీస గిట్టుబాటు ధర ఎంతన్నది ఆర్బీకేలో ప్రదర్శిస్తూ అంతకంటే రేటు పడిపోతే వెంటనే జోక్యం చేసుకుని పంట కొనుగోలు చేసే కార్యక్రమం జరుగుతోంది. ధాన్యం రైతులకు ఎంఎస్పీ ఇవ్వడమే కాకుండా బోనస్‌గా గతంలో ఎన్నడూ లేని విధంగా గన్నీ బ్యాగ్‌లు, లేబర్, రవాణా ఖర్చుల కింద ఎకరాకు దాదాపు రూ.10 వేలు చొప్పున అదనంగా రైతుల చేతుల్లోకి అందుబాటులోకి వస్తుంది. పంట నష్టపోతే మొట్ట మొదటిసారిగా అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చే అడుగులు ఈ నాలుగేళ్లలో పడ్డాయి. ఏ పంట వేసినా ఈ–క్రాప్ నమోదవుతుంది. ప్రతి ఎకరాకు ఇన్సూరెన్స్ వచ్చే గొప్ప కార్యక్రమం జరుగుతోంది. రైతులు కట్టాల్సిన ఇన్సూరెన్స్ ప్రీమియాన్ని కూడా వారి తరఫున రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తూ తోడుగా నిలబడుతోంది. ఉచిత పంటల బీమా, 9 గంటల పాటు ఉచిత కరెంట్ పగటిపూటే ఇచ్చే కార్యక్రమాలు ఈ నాలుగేళ్లలోనే జరుగుతున్నాయి. రూ.1,700 కోట్లు ఖర్చు పెట్టి ఫీడర్లను బలోపేతం చేసి నాణ్యమైన ఉచిత విద్యుత్తు పగటి పూటే ఇస్తున్నాం. ఇవన్నీ మన కళ్లెదుటే కనిపిస్తున్నాయి.

ఆర్బీకే యూనిట్‌గా కోల్డ్ స్టోరేజీ

కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతి ఆర్బీకేని ఒక యూనిట్‌గా తీసుకుని మ్యాపింగ్ చేసి ప్రైమరీ ప్రాసెసింగ్ తీసుకొస్తున్నాం. దీనిలో భాగంగా కోల్డ్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఆయా క్లస్టర్‌ను బట్టి ప్రతి ఆర్బీకేకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. సెకండరీ ప్రాసెసింగ్‌ను పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో అంటే ప్రస్తుతం జిల్లా స్థాయిలో ఒక యూనిట్‌గా తీసుకుని చేస్తున్నాం. మామిడి మినహా బొప్పాయి, అరటి సహా దాదాపు అన్ని పంటలు ఇప్పటికే ఇన్సూరెన్స్ పరిధిలోకి తెచ్చాం. ఇంకా మెరుగైన విధానాలను అధ్యయనం చేసి అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తాం.

రైతుల ప్రభుత్వమిది..

రైతుల పక్షపాత ప్రభుత్వంగా రాష్ట్రంలో నాలుగేళ్లలో ఎలాంటి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామో మచ్చుకు కొన్ని అంశాలను తెలియచేస్తా. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రతి గ్రామంలో ఆర్బీకేల వ్యవస్థ మన కళ్లెదుటే కనిపిస్తోంది. 10,778 ఆర్బీకేలు ప్రతి గ్రామంలోనూ సచివాలయం పక్కనే కనిపిస్తున్నాయి. ఆర్బీకేలో ఉండే అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ రైతన్నలకు సహాయ సహకారాలను అందిస్తున్నాడు. బ్యాంకింగ్ కరస్పాండెంట్లతో బ్యాంకింగ్ సేవలనూ ఆర్బీకేల వద్దకు తెచ్చాం. ప్రతి ఆర్బీకేలో ఓ కియోస్క్‌ను ఏర్పాటు చేశాం. కల్తీలేని విత్తనాలు, ఎరువులను ఆర్బీకేల ద్వారా సరఫరా చేసే గొప్ప వ్యవస్థ గ్రామస్థాయిలో కనిపిస్తోంది. ఇదే ఆర్బీకేల ద్వారా ఈ–క్రాప్ పంట నమోదు జరుగుతోంది. పారదర్శకంగా ఏ పంట ఎంత వేశారు? ఎవరు వేశారు? అనే వివరాలతో డిజిటల్ అక్నాలెడ్జ్‌మెంట్‌తో పాటు ఫిజికల్ రసీదు కూడా ఇస్తూ ఆర్బీకేలో డేటా నమోదవుతోంది. సోషల్ ఆడిట్‌లో జాబితా డిస్‌ప్లే అవుతోంది. ఏ ఒక్కరికైనా మంచి జరగకపోతే ఎలా ఫిర్యాదు చేయాలో కూడా పారదర్శకంగా అక్కడే రాసి ఉంది. వెంటనే రీ వెరిఫై చేసి మళ్లీ అవకాశం ఇస్తూ ఎవరివల్లా నష్టపోకుండా చేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి.

అమూల్‌తో పాడి రైతుకు అదనపు ఆదాయం

రైతన్నకు అదనపు ఆదాయం రావాలంటే వ్యవసాయంతో పాటు గేదెలు, ఆవులు కూడా ఉండాలని, అప్పుడే మెరుగ్గా జీవించగలుగుతారనే ఉద్దేశంతో సహకార రంగంలో గొప్ప మార్పుగా అమూల్‌ను తెచ్చాం. అమూల్ వచ్చిన ఈ రెండున్నరేళ్లలో ఏకంగా 8 సార్లు పాలసేకరణ ధరలను పెంచి పాడి రైతులకు లాభం చేకూర్చింది. లీటరు గేదె పాలు రూ.22, ఆవుపాలు లీటరు రూ.11 చొప్పున అదనంగా పెరిగింది. అమూల్ పాల సేకరణ ధర పెంచింది కాబట్టి మిగిలిన డెయిరీలు కూడా వాళ్లకు నచ్చినా, నచ్చకపోయినా కాంపిటీషన్‌లో రేట్లు పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో వాళ్లు కూడా సేకరణ రేట్లు పెంచారు. ఇవి కూడా నాలుగేళ్ల మన ప్రభుత్వంలో జరిగిన మార్పులకు తార్కాణం. ఇవన్నీ మన కళ్లెదుటే ప్రస్ఫుటంగా మనకు కనిపిస్తున్న మార్పులు.

రైతు భరోసాతో 52.50 లక్షల మందికి రూ.31 వేల కోట్లు

2019లో మన ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఈ 50 నెలల వ్యవధిలో వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ అనే ఒక్క కార్యక్రమం ద్వారా 52.50 లక్షల మందికి రూ.31 వేల కోట్లను వారి ఖాతాల్లో జమ చేయగలిగాం. ఇది ఎందుకు అవసరమో తెలియాలంటే రాష్ట్రంలో ఉన్న పరిస్థితిని గమనించాలి. రాష్ట్రంలో ఇవాళ అర హెక్టార్ అంటే 1.25 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు 60 శాతం మంది ఉన్నారు. ఒక హెక్టార్ వరకు చూస్తే 70% పైనే ఉన్నారు. వైఎస్సార్ రైతు భరోసాతో పెట్టుబడి సాయంగా ఇచ్చే రూ.13,500 సొమ్ము అర హెక్టారు లోపు ఉన్న 60% మంది రైతుల పెట్టుబడి అవసరాల్లో 80 % వరకు తీరుస్తుంది. దీనివల్ల వారు బయట అప్పులు చేయాల్సిన అవసరం రాదు. కరెక్టుగా సమయానికి అంటే మే నెలలో రూ.7,500, పంట కోసే సమయానికి అక్టోబరులో రూ.4,000, మళ్లీ సంక్రాంతికి రూ.2,000 చొప్పున ఇస్తున్నాం. దీంతో పంట వేసేటప్పుడు, కోసేటప్పుడు ఎప్పుడెప్పుడు ఎంత డబ్బులు కావాలో అప్పుడు వాళ్ల చేతుల్లో డబ్బులు పెట్టడం వల్ల ఎవరి మీదా ఆధార పడకుండా వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడగలుగుతున్నారు. ఇలా గత నాలుగేళ్లుగా అన్నదాత నష్టపోకుండా వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పండుగలా వ్యవసాయం చేసే కార్యక్రమం రాష్ట్రంలో అమలవుతోంది. వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ ద్వారా అందిస్తున్న సాయంతో ఒక హెక్టార్ వరకు పొలం ఉన్న 70 శాతం మంది రైతులకు మేలు జరుగుతుంది.

ఇచ్చిన మాటకు మించి సాయం..

వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.12,500 చొప్పున నాలుగేళ్లలో రూ.50 వేలు పెట్టుబడి సాయంగా అందిస్తానని ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. అంతకు మించి ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్ల పాటు ఒక్కో రైతు కుటుంబానికి రూ.67,500 చొప్పున జమ చేస్తుండడం నిజంగా గొప్ప విషయం. భూ యజమానులతో పాటు సెంటు భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలుదారులకు, దేవదాయ, అటవీ భూముల సాగుదారులకు సైతం రైతు భరోసాను వర్తింపచేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. ఇక సీజన్ ముగియకుండానే వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీని అందించే కొత్త సంప్రదాయానికి నాంది పలికారు. గత ప్రభుత్వ బకాయిలను సైతం చెల్లించి అన్నదాతలకు తోడుగా నిలిచారు.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

మాట నిలబెట్టుకున్నారు..



భారీ వరదలకు పంటలు దెబ్బతింటే మీరు (సీఎం జగన్) మా గ్రామంలో ప్రతి ఇంటికీ తిరిగి పరామర్శించారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం ఇస్తామని ఆ రోజు మాట ఇచ్చారు. మాట ప్రకారం సాయం అందిస్తున్నందుకు ధన్యవాదాలన్నా..! ఈ సాయం మేం రెండో పంట వేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఆర్బీకేల ద్వారా మాకు అన్నీ అందుతున్నాయి. తక్కువ ధరకే నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుతున్నాయి. యంత్రసేవా పథకం ద్వారా కూడా లబ్ధి పొందుతున్నాం. నాలుగేళ్లలో రూ.5 లక్షల సాయం పొందా.

– రాధాకృష్ణ, రైతు, గురజాపులంక, బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఇంకెవరూ ఇంతలా కౌలు రైతుకు సాయం చేయలేదు



రెండు ఎకరాల్లో అరటి సాగు చేస్తే మేలో గాలుల వల్ల నష్టపోయా. దానికి రూ.20,000 ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుంది. గతేడాది అధిక వర్షాలతో పసుపు పంట నష్టపోతే రూ.37,000 ఇన్సూరెన్స్ కింద వచ్చింది. రైతు భరోసా సాయం కూడా అందుతోంది. ఆర్బీకేల ద్వారా అన్నీ ఇస్తున్నారు. డ్రిప్ పరికరాలు సబ్సిడీతో ఇవ్వడం వల్ల రైతులకు ఉపయోగంగా ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు మాకు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. రైతులకు 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్ ఇస్తున్నారు. నేను 40 ఏళ్లుగా చూస్తున్నా... ఏ ప్రభుత్వమూ కౌలు రైతులకు సాయం చేయలేదు.

– రాజమోహన్‌రెడ్డి, రైతు, రైల్వే కోడూరు మండలం, అన్నమయ్య జిల్లా

ఈ - క్రాప్ కీలకం

వర్షాల కొరతతో వ్యవసాయం, కంటింజెన్సీ ప్రణాళికపై సీఎం జగన్ ఉన్నతస్థాయి సమీక్ష



వ్యవసాయ రంగ పరిస్థితి, కంటింజెన్సీ ప్రణాళికపై ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్

- రైతులను ఆదుకునేందుకు పంటల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- పశుగ్రాసానికి ఎక్కడా ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఏపీ 'ఎంఎస్‌పీ' చట్టం బిల్లు
- రైతులకు నిర్ణయించిన కనీస మద్దతు ధర ఇవ్వకుంటే ఈ చట్టం ప్రకారం చర్యలు
- దేశమంతా విద్యుత్ డిమాండ్ చాలా అనూహ్యంగా పెరిగింది
- అధిక రేట్లు ఉన్నా సరే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేస్తున్నాం
- ఒక్క ఆగస్టులోనే విద్యుత్ కొనుగోలు కోసం రూ.966.09 కోట్లు వ్యయం చేశాం
- యూనిట్‌కు రూ.7.52 చొప్పున చెల్లించి మరీ కొంటున్నా కొందరు నెగిటివ్ ప్రచారాలు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రాష్ట్రంలో రైతులను ఆదుకునేందుకు ఈ–క్రాప్ నమోదుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. రైతులను ఆదుకునే చర్యలకు ఈ డేటా చాలా కీలకమన్నారు. పశుగ్రాసానికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు సంబంధించి చట్టం చేసేందుకు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని అధికారులకు సూచించారు. దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగినా రాష్ట్రంలో రైతులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. వర్షాల కొరత నేపథ్యంలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం పరిస్థితి, కంటింజెన్సీ ప్రణాళికపై సీఎం జగన్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. విద్యుత్ డిమాండ్, సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక తదితర అంశాలను అధికారులు సీఎంకు వివరించారు.

ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై అవగాహన

వర్షాల కొరత నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించాలని సీఎం జగన్ ఆదేశించారు. కంటింజెన్సీ ప్రణాళికపై కలెక్టర్ల నేతృత్వంలో రైతు సలహా మండళ్లతో వెంటనే సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పశువులకు అవసరమైన దాణా, గ్రాసాన్ని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సచివాలయాల వారీగా పశువుల వివరాలు సేకరించి అక్కడున్న పరిస్థితులకు అనుగుణంగా సిద్ధం కావాలన్నారు. 7,005 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం విత్తనాలను పంపిణీకి సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. 74,023 మెట్రిక్ టన్నుల టీఎమ్మార్ కూడా సిద్ధం చేశామన్నారు.

ఎంఎస్‌పీ కోసం చట్టం..

పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు ఏపీ ఎంఎస్పీ యాక్ట్‌కు సంబంధించిన బిల్లును వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. కనీస మద్దతు ధర ఇవ్వకుంటే ఈ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరల అమలులో ఆర్బీకేలది కీలక పాత్ర అని చెప్పారు.

ఎండా కాలానికి మించి విద్యుత్ కొనుగోలు వ్యయం

ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగిందని ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. అధిక రేట్లు ఉన్నప్పటికీ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఒక్క ఆగస్టులోనే రూ.966.09 కోట్లు చెల్లించి విద్యుత్ కొనుగోలు చేశామని, యూనిట్‌కు రూ.7.52 చెల్లించి మరీ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎండలు అధికంగా ఉన్న మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలలో సైతం విద్యుత్ కొనుగోలు కోసం ఇంత ఖర్చు చేయలేదన్నారు. మార్చిలో రూ.501 కోట్లు ఖర్చు చేయగా ఏప్రిల్‌లో రూ.493 కోట్లు, మేలో రూ.430 కోట్లు, జూన్‌లో రూ.346.28 కోట్లు, జూలైలో రూ.197.57 కోట్ల చొప్పున ఖర్చు చేసినట్లు వివరించారు. ఇప్పుడు ఇంత ఖర్చు చేసి విద్యుత్ సరఫరా చేస్తున్నా నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన సీఎం జగన్ అలాంటి దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. రానున్న రోజుల్లో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

25 శాతం లోటు వర్షపాతం

జూన్ నుంచి ఆగస్టు వరకు రాష్ట్రంలో కురవాల్సిన సాధారణ వర్షపాతం 419.6 మి.మీ. కాగా 314.6 మి.మీ. వర్షం కురిసిందని, 25 శాతం తక్కువగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, ఎస్పీఎస్ నెల్లూరు, తిరుపతి, పల్నాడు, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వర్షాల కొరత ఉన్నట్లు చెప్పారు. ఇందులో కొన్ని ప్రాంతాలకు సాగునీటి సదుపాయం ఉన్నందున అక్కడ వర్షాల కొరత ప్రభావం తక్కువగానే ఉందన్నారు.

గోదావరి డెల్టాకు ఇబ్బంది లేదు..

రాష్ట్రంలో మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వల వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. అన్ని రిజర్వాయర్లలో నీటి సామర్థ్యం 1,174.58 టీఎంసీలు కాగా 507.88 టీఎంసీల నీరే ఉందని తెలిపారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ తెలంగాణ ప్రభుత్వం విద్యుదుత్పత్తి కోసం నీటిని దిగువకు విడిచిపెడుతోందన్నారు. ముందస్తుగా సాగునీటిని విడుదల చేయడం వల్ల కృష్ణాడెల్టాకు అవసరమైన నీటిని అందించగలిగామన్నారు. గోదావరి డెల్టాకు ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీరు అందుతోందన్నారు. వంశధార, తోటపల్లి కింద సాగునీటికి ఇబ్బందుల్లేవని, వెలుగోడు, గండికోట, మైలవరం, చిత్రావతి, బ్రహ్మంసాగర్, గోరకల్లు రిజర్వాయర్ల కింద నీరు అందించగలమన్నారు. కేసీ కెనాల్, సాగర్ కుడి కాల్వ కింద సాగునీటికి ప్రస్తుతం సమస్యలు ఎదుర్కొంటునట్లు తెలిపారు. సోమశిల, కండలేరులో నెల్లూరు జిల్లాకు అవసరమైన నీళ్లున్నాయని, ఇక్కడ ఆలస్యంగా సాగు చేస్తున్నందున ఈ పంట వరకు సరిపోతాయన్నారు.

18 శాతం పెరిగిన గ్రిడ్ డిమాండ్

గతేడాదితో పోలిస్తే గ్రిడ్ నుంచి విద్యుత్తు డిమాండ్ కనీసం 18 శాతం పెరిగినట్లు అధికారులు తెలిపారు. సీజన్ కావడంతో వ్యవసాయ రంగం నుంచి కూడా డిమాండ్ పెరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సుమారు 3.3 లక్షల వ్యవసాయ కనెక్షన్లు రైతులకు ఇచ్చినట్లు చెప్పారు. విండ్ పవర్ గణనీయంగా తగ్గిందని, తడి బొగ్గు రావడంతో సామర్థ్యం మేరకు థర్మల్ కేంద్రాలు విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు వెల్లడించారు. విద్యుత్ కొరత రాకుండా పెద్ద మొత్తంలో వ్యయం చేసి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. 2022 ఆగస్టులో డిమాండ్ 196.22 మిలియన్ యూనిట్లు ఉండగా ఈ ఏడాది ఆగస్టులో 234.25 మిలియన్ యూనిట్లకు పెరిగినట్లు వివరించారు. పొడి వాతావరణం, వేసవిని తలపించే పరిస్థితులు నెలకొనడంతో అనూహ్యంగా డిమాండ్ పెరిగిందని చెప్పారు.

కంటింజెన్సీ ప్రణాళిక సిద్ధం

వాతావరణ పరిస్థితులు, రిజర్వాయర్లలో నీటి నిల్వను పరిగణలోకి తీసుకుని కంటింజెన్సీ ప్రణాళికను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. ఉలవలు, బొబ్బర్లు, మినుములు, పెసలు, కందులు, కొర్రలు, రాగి, జొన్న, మొక్కజొన్న, సజ్జలు, పొద్దు తిరుగుడు విత్తనాలను ఇప్పటికే 77 వేల క్వింటాళ్లకు పైగా సిద్ధం చేశామన్నారు. 80 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తూ ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

రోజూ కనీసం 44.25 ఎంయూల కొనుగోలు

రోజూ కనీసం 44.25 మిలియన్ యూనిట్ల విద్యుత్తును కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మార్చి నుంచి ఆగస్టు వరకు విద్యుత్తు కొనుగోళ్లకు సుమారు రూ.2,935 కోట్లు వెచ్చించామన్నారు. దేశవ్యాప్తంగా ఎప్పుడూలేని విధంగా శుక్రవారం 231 గిగావాట్ల విద్యుత్‌కు డిమాండ్ ఏర్పడిందన్నారు. సమావేశంలో మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, అంబటి రాంబాబు, సీదిరి అప్పలరాజు, ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ జయానంద్, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


విజయవాడ కృష్ణలంకలో సత్యనారాయణకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ అయ్యప్ప


ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా వెంకట్రావుపల్లిలో పి.ఆదెమ్మకు పింఛను ఇస్తున్న వలంటీర్ మాలిని


విజయనగరం లంకవీధిలో సత్యవతికి పింఛను అందిస్తున్న వలంటీర్ శ్రావణి


కాకినాడలో చికిత్స పొందుతున్న సామర్లకోటకు చెందిన ఎం.నారాయణమ్మకు పింఛను ఇస్తున్న వలంటీర్ జగదీష్


తిరుపతి 8వ డివిజన్‌లో డయాలసిస్ రోగి కనకమహాలక్ష్మికి రూ.10వేల పింఛను ఇస్తున్న వలంటీర్ హేమావతి


అనంతపురంలో భర్త వెంకటరమణకు కొత్తగా మంజూరైన పింఛను, భార్య సుశీలమ్మకు దివ్యాంగ పింఛను అందిస్తున్న వలంటీర్ మెహతాజ్


ఒంగోలు మంగమూరు డొంక వద్ద వృద్ధురాలు సుబ్బాయమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ సల్మా


విశాఖలోని జాలరిపేటలో దివ్యాంగ వృద్ధురాలు కరుకు ఎర్రమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ అజయ్‌కుమార్

ఒకటో తేదీనే 52.70 లక్షల మందికి రూ.1,451.41 కోట్ల పింఛన్

1,49,875 మందికి ఈ నెలలోనే కొత్తగా పింఛన్లు మంజూరు

సాక్షి, అమరావతి: ఠంఛన్‌గా సెప్టెంబర్ ఒకటో తేదీనే రాష్ట్రవ్యాప్తంగా 52,70,915 మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వివిధ రకాల చేతివృత్తిదారులకు రూ.1,451.41 కోట్ల పింఛన్ డబ్బులు అందాయి. ఈ నెల 1 నుంచి మొత్తం 64,04,458 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు రూ.1,764.83 కోట్లను ప్రభుత్వం గురువారమే రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. ఇందులో 1,49,875 మందికి ఈ నెలలోనే ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్టు సెర్ప్ అధికారులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు... లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మొత్తం పింఛన్‌దారుల్లో 82.30 శాతం మందికి తొలిరోజే డబ్బులు పంపిణీ చేశారని చెప్పారు.

మెడ్‌టెక్ జోన్ సందర్శించిన పార్లమెంటరీ కమిటీ

సాక్షి, విశాఖపట్నం : కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ పార్లమెంటరీ కమిటీ బృందం విశాఖలో రెండు రోజుల స్టడీ టూర్‌లో భాగంగా వైద్య పరికరాల తయారీ కేంద్రం ఏపీ మెడ్‌టెక్ జోన్‌ని శుక్రవారం సందర్శించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న నిధుల్ని ఏ విధంగా ఉపయోగించారనే అంశాలపై తయారు చేసిన నివేదికని బృంద సభ్యులు పరిశీలించారు. పారిశ్రామికవేత్తల సమస్యల గురించి చర్చించి కేంద్ర ప్రభుత్వానికి అందించేందుకు నివేదిక తయారు చేశారు. కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ బృందం విశాఖలో అమలు చేస్తున్న పెట్రోలియం, కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పీసీపీఐఆర్) ప్రాజెక్టుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల గురించి ఆరా తీశారు.

కామన్ సర్వీస్ సెంటర్‌లో ఈసీ, సీసీ, పబ్లిక్ డేటా సేవలు

సాక్షి, అమరావతి: స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు త్వరలో కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ప్రజలకు చేరువ కానున్నాయి. ఈ మేరకు ఏపీ స్టేట్ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ, కామన్ సర్వీస్ సెంటర్స్ శుక్రవారం మౌఖిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈసీ, సీసీ, పబ్లిక్ డేటా నమోదు వంటి సర్వీసులు ఇకపై రాష్ట్రంలో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందించనున్నారు.ఐజీఆర్ఎస్ కమిషనర్ రామకృష్ణ, కామన్ సర్వీస్ సెంటర్ స్టేట్ హెడ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

• తెలంగాణ

గుడ్ బ్యాంక్.. రూపాయి కూడా దొరకలేదు

• తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు ఓ దొంగ కితాబు

నెన్నెల: ఓ ఆగంతుకుడు ఆశగా అర్ధరాత్రి చొరబడ్డాడు. ఆబగా నగదు కోసం వెతికాడు. క్యాష్‌కౌంటరేమో ఖాళీగా కనిపించింది. స్ట్రాంగ్‌రూం తాళం యమా స్ట్రాంగ్‌గా ఉండటంతో తెరుచుకోలేదు. ఎక్కడ వెతికినా ఏమీ దొరకలేదు. ఆనక చేసేదేమీలేక 'గుడ్ బ్యాంక్.. ఒక్క రూపాయి కూడా దొరకలేదు'అని కితాబు ఇస్తూ ఓ పేపర్‌పై రాసి వెళ్లిపోయాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో చోటు చేసుకుంది. ముసుగు వేసుకుని గురువారం అర్ధరాత్రి దొంగతనానికి వచ్చిన ఓ దుండగుడు బ్యాంకు తలుపు తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించాడు. క్యాష్ కౌంటర్‌లో చిల్లిగవ్వ కూడా లభించలేదు. ఎంత ప్రయత్నించినా స్ట్రాంగ్‌రూమ్ తాళం తెరుచుకోలేదు. ఇలా 15 నిమిషాలు బ్యాంకులో ఉండి చోరీకి యత్నించినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది.



నక్షత్రాల సుడి గుండం

ఒకటి రెండు కాదు.. లక్షలు, కోట్ల కొద్దీ కొత్త నక్షత్రాలు పుట్టుకొస్తున్న 'మెస్సియర్ 51' నక్షత్ర సమూహం (గెలాక్సీ) చిత్రమిది. పెద్ద ఎత్తున ఖగోళ పదార్థాలు, వాయువులు, ధూళి మేఘాలతో నిండిపోయి సుడిగుండంలా కనిపిస్తున్న ఈ గెలాక్సీని ప్రఖ్యాత జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తాజాగా చిత్రీకరించింది. ఈ ఫొటోలను యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ విడుదల చేసింది. ఈ గెలాక్సీ భూమికి మూడు కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది.

వివేకా హత్యతో లబ్ధి పొందింది సునీత, ఆమె భర్తే

- ఇతరులెవరికీ ఎలాంటి ప్రయోజనం లేదు
- వివేకా ఆస్తులన్నీ ఆమె, ఆమె భర్త దక్కించుకున్నారు
- హత్య చేసే కారణం కూడా వారికే ఉంది
- దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్న సునీత
- సునీత బాధితురాలు కాదు.. వివేకానే ఆమె బాధితుడు
- వారి బండారం బయట పడుతుందనే ఇంప్లీడ్ పిటిషన్లు
- సీబీఐని సునీత శాసిస్తున్నారు
- తండ్రిని చంపిన హంతకుడు దస్తగిరికి సహకరిస్తున్నారు
- సునీత ఇంప్లీడ్ పిటిషన్‌ను కొట్టేయండి
- హైకోర్టుకు నివేదించిన సునీల్ యాదవ్ తరపు న్యాయవాది

సాక్షి, అమరావతి/సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యతో లబ్ధి పొందింది ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాత్రమేనని వివేకా హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్ తరపు న్యాయవాది టీఎల్ నయన్ కుమార్ తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. హత్య చేసే కారణం కూడా వారికే ఉందని వివరించారు. వివేకా హత్య వల్ల ఇతరులు పొందే ప్రయోజనం ఏమీ లేదన్నారు. వివేకా ఆస్తులన్నీ సునీత, ఆమె భర్త సొంతమయ్యాయని తెలిపారు. తండ్రి ఆస్తులను దక్కించుకున్న తరువాత సీబీఐ దర్యాప్తును తప్పుదోవ పట్టించేలా సునీత వ్యవహరిస్తున్నారని వివరించారు. ప్రతి కోర్టులో, ప్రతి పిటిషన్‌లో ప్రతివాదిగా చేరుతూ (ఇంప్లీడ్) పిటిషన్ల



మీద పిటిషన్లతో, అవాస్తవాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని వివరించారు. ఆమె వాదనలను సీబీఐ న్యాయవాదుల ద్వారా చెప్పిస్తున్నారని తెలిపారు. ఈ కేసులో సునీత బాధితురాలు కాదని... మృతుడు వివేకానందరెడ్డే ఆమె బాధితుడని చెప్పారు. వారి బండారం బయట పడుతుందన్న భయంతోనే ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం దాఖలు చేసిన ఇంప్లీడ్‌పిటిషన్ సైతం ఆ కోవలోకే వస్తుందన్నారు. అందువల్ల దాన్ని కొట్టేయాలని నయన్ కుమార్ కోర్టును కోరారు. సునీత భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి సహా మరికొందరిపై కడప కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు పెండింగ్‌లో ఉందన్నారు. 2021 ఆగస్టు 2 నుంచి జైలులో ఉన్నానని, చార్జిషీట్ కూడా దాఖలు చేసినందున, తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సునీల్ యాదవ్ దాఖలు చేసిన వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ శుక్రవారం విచారణ జరిపారు. నయన్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. 'వివేకా హత్య కేసులో కీలక నిందితుడు, కిరాయి హంతకుడు షేక్ దస్తగిరి పిటిషన్‌ను తప్ప ఇతర నిందితుల బెయిల్ పిటిషన్లను కొట్టివేయాలని సునీత కోర్టులను కోరుతూ వస్తున్నారు. వివేకానందరెడ్డి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వాంగ్మూలం ఇచ్చి, ఆయన్ని హత్య చేసిన వారిలో తానూ ఉన్నానని చెప్పిన దస్తగిరికి ఆమె సహకరిస్తున్నారు. అతనికి కింది కోర్టు క్షమాభిక్ష ప్రసాదించడాన్ని, అప్రూవర్‌గా మారేందుకు అనుమతివ్వడంపై సునీత నోరెత్తలేదు. ఆమె న్యాయం కోసం నిష్పాక్షికంగా వ్యవహరించడంలేదు. స్వార్థ ప్రయోజనాల కోసం కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. సమాంతరంగా కేసులను పర్యవేక్షిస్తూ దర్యాప్తులో జోక్యం చేసుకుంటున్నారు. ఒక రకంగా సీబీఐని శాసిస్తున్నారు. దీంతో సీబీఐ దర్యాప్తు సైతం పక్కదారి పట్టింది. అంతేకాకుండా కోర్టులకు నిందితులపై తీవ్ర దురభిప్రాయాన్ని కలిగిస్తూ న్యాయ విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారు' అని నయన్ కుమార్ వివరించారు.

ఆస్తి పోతుందన్న భయం సునీత,నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డిలో పెరిగిపోయింది..

'తన తండ్రి షేక్ షమీమ్ అనే మహిళను వివాహం చేసుకున్నారని, వారికి ఒక కొడుకు ఉన్నాడని, వారికి రూ.8 కోట్లు కూడా ఇవ్వాలని తన తండ్రి భావించారని, ఈ కారణంగానే తండ్రితో సత్సంబంధాలు లేవని సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో సునీత స్పష్టంగా చెప్పారు. ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి కూడా ఇదే చెప్పారు. ఆస్తి పోతుందన్న భయం సునీత, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డిలలో పెరిగిపోయింది. రాజశేఖర్‌రెడ్డి, అతని సోదరుడు నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి, మరికొందరు వివేకా హత్యకు కారణమంటూ మరో నిందితుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ కడప జిల్లా కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు దాఖలు చేశారు. అది పెండింగ్‌లో ఉంది. తులసమ్మ, షేక్ షమీమ్ మరికొందరు సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం వివేకాను హత్య చేసే కారణం సునీతకు, ఆమె భర్తకే ఉంది. సునీల్ యాదవ్‌కు ఈ హత్యతో సంబంధం లేదు. కావాలనే అతన్ని ఇరికించారు.' అని న్యాయవాది నయన్ కుమార్ నివేదించారు.

న్యాయమూర్తిపైనే ఆరోపణలు చేసే స్థాయికి వెళ్లింది..

'నిందితులకు వ్యతిరేకంగా కోర్టులో ప్రతి విచారణకు ఆమె హాజరవుతున్నారు. న్యాయమూర్తి ముందు కూర్చొవడమే కాకుండా తన న్యాయవాదితో వెనక నుంచి చర్చిస్తూ, సూచనలిస్తూ, దర్యాప్తు వివరాలను తానే అందిస్తున్నా అనేలా వ్యవహరిస్తున్నారు. ఈ చర్యల వల్ల.. ఓ వర్గం మీడియా ఏకంగా హైకోర్టు న్యాయమూర్తిపైనే తీవ్రస్థాయి అవినీతి ఆరోపణలు చేసే స్థాయికి వెళ్లింది. ఇదే కేసులో మరో నిందితుడి బెయిల్ పిటిషన్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. సీబీఐ తరఫున వాదించడానికి ఢిల్లీ నుంచి సీనియర్లు వస్తున్నారు. వారికి స్థానిక న్యాయవాదులు, అధికారులు సహకరిస్తున్నారు. సునీత వాదనలు అనవసరం. హత్య జరిగిన రోజున సునీల్ యాదవ్ ఎక్కడెక్కడికి వెళ్లారో చెప్పేందుకు గూగుల్ టేక్ అవుట్, దస్తగిరి వాంగ్మూలంపై సీబీఐ ఆధారపడింది. గూగుల్ టేక్ అవుట్‌లో పేర్కొన్న సమయాలు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. దీనిలో తప్పు జరిగిందని సీబీఐ కూడా ఒప్పుకుంది.' అని నయన్‌కుమార్ కోర్టుకు వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను ఈ నెల 8కి వాయిదా వేశారు.

కౌంటర్ దాఖలు చేయండి

అజేయ కల్లం పిటిషన్‌పై సీబీఐకి తెలంగాణ హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తన వాంగ్మూలాన్ని వక్రీకరించిందని, తాను చెప్పని విషయాలను చెప్పినట్టు చార్జిషీట్‌లో పేర్కొందని, వాటిని చార్జిషీట్ నుంచి తొలగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు అజేయ కల్లం దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు స్పందించింది. ఈ పిటిషన్‌లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించింది. తదుపరి విచారణను 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. తాను చెప్పని విషయాలను చెప్పినట్టు సీబీఐ తన చార్జిషీట్‌లో పేర్కొన్నందున వాటిని చార్జిషీట్ నుంచి తొలగించాలంటూ అజేయ కల్లం ఇటీవల తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం జస్టిస్ లక్ష్మణ్ ముందు విచారణకు వచ్చింది. అజేయ కల్లం తరఫున సీనియర్ న్యాయవాది టి.సూర్యకరణ్‌రెడ్డి, న్యాయవాది పి.వీర్రాజు వాదనలు వినిపించారు.



సంక్షేమ పథకాల అమలే సర్కారు పనితీరుకు కొలమానం.

– వై.ఎస్. రాజశేఖర రెడ్డి

సాక్షి

శనివారం, 2 సెప్టెంబర్ 2023

'జమిలి' సర్వరోగ నివారిణా?

జమిలి ఎన్నికలపై చర్చ సద్దుమణిగిందని అనుకున్నప్పుడల్లా అది మళ్లీ మళ్లీ రాజుకోవటం ఏడెనిమిదేళ్లుగా రివాజైంది. కానీ ఈసారి ఉన్నట్టుండి అందుకు సంబంధించి తొలి అడుగుపడింది. మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కమిటీ విధివిధానాలు, అందులో ఉండే నిపుణుల వివరాలు ఇంకా తెలియాల్సేవున్నా ఇండియా కూటమి సమావేశాల్లో తీరిక లేకుండావున్న విపక్షాలకు ఇది ఊహించని పరిణామం. పార్లమెంటుకూ, అసెంబ్లీలకూ ఏకకాలంలో ఎన్నికలు జరగాలనీ, అందువల్ల ఎంతో ప్రజాధనం ఆదా అవుతుందనీ ఆ విధానాన్ని సమర్థిస్తున్నవారు చెబుతున్నారు. అంతేకాదు, తరచు ఎన్నికలవల్ల అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతున్నదని కూడా వారి వాదన. కానీ ఈ రకమైన వాదనలను కొట్టిపారేస్తున్నవారు కూడా గణనీయంగానే ఉన్నారు. అభివృద్ధి పనులకు ఎక్కడ ఆటంకం ఏర్పడిందో చూపాలని సవాలు చేస్తున్నారు. ప్రకృతి విపత్తుల సమయంలోనో, మరే అత్యవసర సందర్భాల్లోనో ప్రభుత్వాలను ఎన్నికల సంఘం నిరోధించిన దాఖలాలు లేవు. కాకపోతే ఓటర్లను ప్రలోభపెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందటానికి ఉద్దేశించే పథకాలను మాత్రం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ప్రకటించకుండా ఆపుతున్నారు. అందువల్ల జనం నష్టపోయారని చెప్పడానికి ఎటువంటి దాఖలాలూ లేవు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలతోపాటు అసెంబ్లీల ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. మిగతా రాష్ట్రాలను కూడా ఈ చట్రంలోకి తీసుకురావటమే కేంద్రం ఉద్దేశం. 'ఒకే దేశం–ఒకే ఎన్నికలు' అన్న నినాదం కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచీ వినిపిస్తోంది. అంతక్రితం 2003లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి ఈ విషయంలో కొంత ప్రయత్నం చేశారు. అప్పటి కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీతో ఆయన చర్చించారు. కానీ ఎందుకనో తదుపరి చర్యలేమీ లేవు. జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలోని లా కమిషన్ సమర్పించిన 170వ నివేదిక సైతం చట్టసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇంకా వెనక్కు వెళ్తే 1983లో కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఈమాటే చెప్పింది. అయితే రాజ్యాంగ సవరణ, ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ, చట్టసభల నియమ నిబంధనల సవరణ వగైరాలు చేయకుండా జమిలి ఎన్నికలు సాధ్యంకాదని 2018లో జస్టిస్ బీఎస్ చౌహాన్ నేతృత్వంలోని లా కమిషన్ తన ముసాయిదా నివేదికలో అభిప్రాయపడింది. ఒక ఏడాది వేర్వేరు నెలల్లో ఎన్నికలు జరిగే రాష్ట్రాలన్నిటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించటం ఉత్తమమని సూచించింది.

దేశంలో జమిలి ఎన్నికలు 1952 నుంచి 1967 వరకూ జరిగాయి. కానీ దానికి తూట్లు పొడిచింది కేంద్రంలోని పాలకులే. అప్పటి నెహ్రూ సర్కారు 1959 జూలైలో ఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలోని తొలి కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని 356వ అధికరణ ప్రయోగించి బర్తరఫ్ చేసింది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని చక్కదిద్దేవరకూ ఆ అధికరణ దశాబ్దాలపాటు దుర్వినియోగం చేశారు. ఫిరాయింపులను ప్రోత్సహించే ధోరణి వెర్రితలలు వేసి ప్రభుత్వాలు కుప్పకూలాయి. అసెంబ్లీలు రద్దయ్యాయి. ఈ కారణాలన్నిటివల్లా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలది తలోదారీ అయింది. పాలక పార్టీలను చీల్చటం, చీలికవర్గంతో కొత్త ప్రభుత్వాలను ప్రతిష్ఠించటం రివాజైంది.

తరచు ఎన్నికల వల్ల ఖజానాకు తడిసిమోపెడు ఖర్చు అవుతున్నదన్నది వాస్తవం. దీనికితోడు రాజమార్గాల్లో, దొంగదారుల్లో ఎన్నికల జాతరకు వచ్చిపడే వేల కోట్ల రూపాయలు ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్నాయి. ఉదాహరణకు 2009 సార్వత్రిక ఎన్నికలకు ఖజానాకు రూ. 1,115 కోట్లు ఖర్చయితే, 2014 నాటికి ఇది రూ. 3,870 కోట్లకు పడగలెత్తింది. ఇదంతా సర్కారుకయ్యే వ్యయం. పార్టీలూ, అభ్యర్థులూ చేసే ఖర్చు ఇందుకు ఎన్నో రెట్లు ఎక్కువుంటుంది. కానీ రోగం ఒకటైతే మందు మరొకటన్నట్టు ఈ సమస్యలకు జమిలి ఎన్నికలే పరిష్కారమని పాలకులు చేస్తున్న వాదన సరికాదు. ఎన్నికల్లో ధన ప్రభావం అరికట్టడానికి ఎన్నికల సంస్కరణలు అవసరం. ఎన్నికల విశ్వసనీయత పెంచటానికి దొంగ ఓట్లను అరికట్టడం అవసరం. అలవిమాలిన వాగ్దానాలతో ప్రజలను ఆకర్షించి, అధికారంలోకొచ్చాక వంచించే పార్టీలపై చర్యలు తీసుకోవటం అవసరం. కానీ జరిగిందేమిటి? అసలే పార్టీలు వెచ్చించే కోట్లాది రూపాయల సొమ్ము ఎక్కడిదో తెలిసే అవకాశంలేని ప్రస్తుత పరిస్థితిని మరింత జటిలం చేసేలా ఎన్నికల బాండ్ల విధానానికి తెరలేపారు. 'ఒకే దేశం–ఒకే ఎన్నికలు' గొప్ప ఆదర్శంగా కనిపించవచ్చు. చూడదల్చుకున్నవారికి ఇందులో జాతీయతా భావన కూడా దర్శనమీయొచ్చు. కానీ ఎన్నికల ప్రక్షాళనకు ఇది దోహదపడేదెంత?

ఇంతకూ జమిలి ఎన్నికల విధానం అమలు చేయటం మొదలెట్టాక రాష్ట్రాల్లో గడువుకు ముందే అసెంబ్లీలు రద్దు చేయాల్సివస్తే ఏం చేస్తారు? 90వ దశకంలో మాదిరే కేంద్రంలోనే అస్థిరత ఏర్పడి లోక్‌సభ రద్దు చేయాల్సివస్తే మార్గం ఏమిటి? ఇవన్నీ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ఎటూ పరిశీలిస్తుంది. ఇక రెండు చట్టసభలకూ ముడివేయటంవల్ల ఫెడరలిజం దెబ్బతింటుందనేవారూ... జాతీయ అంశాల ప్రాముఖ్యత పెరిగి స్థానిక అవసరాలు, ఆకాంక్షలు మరుగునపడతాయనేవారూ ఉన్నారు. అయితే 2019లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీల ఎన్నికలతోపాటు లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పుడు వెలువడిన ఫలితాలు గమనిస్తే ఇది అర్ధ సత్యమే అనిపిస్తుంది. ఏదేమైనా జమిలి ఎన్నికల విధానంపై విస్తృతమైన చర్చకు చోటిచ్చి, అందులో వ్యక్తమయ్యే అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి అడుగులు వేయాలి. తొందరపాటు పనికిరాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: బ.తదియ రా.1.14 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: ఉత్తరాభాద్ర సా.5.23 వరకు, తదుపరి రేవతి, వర్జ్యం: తె.4.44 నుండి 6.15 వరకు (తెల్లవారితే ఆదివారం), దుర్ముహూర్తం: ఉ.5.47 నుండి 7.29 వరకు, అమృతఘడియలు: ప.12.51 నుండి 2.20 వరకు

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.12
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఆయన ఆశయం అందరి దరహాసం

రాజకీయాలను సంపాదనా మార్గంగా భావించే వారికి వైఎస్ రాజశేఖరరెడ్డి జీవితం చెంపపెట్టు. 'రూపాయి డాక్టర్'గా మూడు పదులు నిండని వయసులోనే తనదైన ముద్ర వేసిన వైఎస్ రాజకీయాల్లో ప్రవేశించి అప్రతిహత విజయాలను అందుకొన్నారు. రైతుకు నీటి సమస్యను తీర్చగలిగితే తన కాళ్లమీద తాను నిలబడి అందరికీ పట్టెడన్నం పెడతాడని నమ్మి ఏకంగా 'జలయజ్ఞం' చేశారు. అట్టడుగు వర్గాలకు ఉన్నత చదువులను అందిస్తే వారి తలరాత మారుతుందని 'ఫీజు రీయింబర్స్‌మెంట్'కు శ్రీకారం చుట్టారు. 'ఆరోగ్య శ్రీ'తో సామాన్యునికి కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేశారు. సగటు మనిషి బతకడానికి కావలసిన అన్ని ఏర్పాట్లూ చేసి చిద్విలాసంగా వెళ్లిపోయారు!

మూర్తీభవించిన మానవత్వం

సందర్భం



ఎ. చంద్రశేఖర్ రెడ్డి

మానవత్వం మూర్తీభవించిన రాజకీయ నాయకుడు, ప్రజల మనిషి డాక్టర్ ఎడుగూరి సందింటి రాజశేఖర్ రెడ్డి. కడప జిల్లా జమ్మలమడుగు మిషనరీ ఆస్పత్రిలో 1949 జులై 8న వైఎస్ జన్మించారు. వైద్య విద్య (ఎంబీబీఎస్) పూర్తి చేసిన తర్వాత రూపాయికే వైద్యం అందించారు. తద్వారా చిన్న వయసులోనే ప్రజల మన్ననలు పొందారు. 28 ఏళ్ల వయసులోనే రాజకీయ నాయకుడిగా మారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆరుసార్లు అసెంబ్లీకి, నాలుగు సార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు.

రైతులకు అవసరమైన సాగు నీరు అందిస్తే వాళ్లు ఎవరి మీదా ఆధారపడరని వైఎస్ చెప్పేవారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 'జలయజ్ఞం' పేరిట సాగునీటి చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. 2004లో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత తొలి సంతకం ఉచిత విద్యుత్తు ఫైలుపై చేశారు.

బహుళజాతి కంపెనీ పత్తి విత్తనాల ధరల విషయంలో రైతుల పక్షాన నిలిచి, సుప్రీంకోర్టులో కేసు గెలిచిన ధీశాలి వైఎస్. ఈ కేసు గెలవడం ద్వారా దశాబ్ద కాలంలో రైతులకు రూ. 48 వేల కోట్లు ఆదా అయింది. అప్పట్లో ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వచ్చివెళ్లిన అమెరికా అధ్యక్షుడు బుష్ శ్వేతసౌధం నుంచి ఓ లేఖ రాశారు. అందులో 'నేను చాలా దేశాలు తిరిగాను. కానీ, రైతుల సంక్షేమం కోసం ఇంత లోతుగా అధ్యయనం చేసిన నాయకుడిని ఎక్కడా చూడలేదు. వైఎస్ లాంటి నాయకుడిని తొలిసారి చూస్తున్నా' అని పేర్కొన్నారు.

2003లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,450 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేసినప్పుడు వైఎస్ ప్రతి కుటుంబాన్నీ కలిసి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన సీఎం అయిన తర్వాత పేదలకు కూడు, గూడు, విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్న లక్ష్యాన్ని నెరవేర్చారు. అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు, చేనేతలు, వికలాంగులకు పింఛను ఠంచనుగా అందించడం వైఎస్ పాలనలోనే మొదలైంది. పేదవారికి కార్పొరేట్ వైద్యం అందించాలని 'ఆరోగ్యశ్రీ' పథకాన్ని తీసుకొచ్చారు. '108 అత్యవసర అంబులెన్స్ సర్వీసు' కూడా ఆయన ప్రారంభించిందే. '104 వాహన సేవ' గ్రామీణ ప్రజ లకు ఇంటి వద్దే వైద్య చికిత్సను అందించేందుకు చేపట్టిన మరో బృహత్తర పథకం. 'పావలా వడ్డీ', 'అభయ హస్తం', 'జలయజ్ఞం', 'రైతుల పంట రుణాల మాఫీ', 'భూ పంపిణీ', 'పశు క్రాంతి', 'ఇందిరమ్మ ఇళ్లు', రేషన్ కార్డులు, పింఛన్లు, '103 రూపాయలకే నిత్యావసర సరుకులు'... ఇలా అనేక పథకాలను విజయవంతంగా అమలు చేశారు.

ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించేందుకు కర్నూలు జిల్లా ఓబులాపురం గ్రామానికి వెళ్లిన వైఎస్‌కు యశోదమ్మ అనే లబ్ధిదారు నూతన వస్త్రాలు పెట్టింది. కుటుంబ పోషణ భారంతో ఇల్లు కట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్న తమకు రూపాయి ఖర్చు లేకుండా ఇల్లు కట్టించి ఇచ్చారంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. 'యశోదమ్మా.. నా చెల్లెలు విమలమ్మ ఎంతో నువ్వూ అంతేనమ్మా. ఇల్లు కట్టించడం నీకు చేసిన మేలు కాదు. అది నా బాధ్యత. నీ పిల్లల చదువుల బాధ్యత కూడా తీసుకుంటా' అన్నారు. తన కార్యాలయ ఫోన్ నంబర్ ఆమెకు ఇచ్చారు. అదీ ఆయన వ్యక్తిత్వం.

కాకినాడ నుంచి వచ్చిన ఓ మహిళ తన ఏడేళ్ల కొడుక్కి చెవుడు అని, ఆపరేషన్‌కు రూ. 6–7 లక్షలు ఖర్చవుతుందని, సాయం చేయాలని వైఎస్‌ను అడిగింది. నాటి సెక్రటరీ పీకే అగర్వాల్‌ను పిలిచి, 'ఈ బాబుకు ఆపరేషన్ చేయించే బాధ్యత మీది' అని చెప్పారు. ఆపరేషన్ అయిన తర్వాత మళ్లీ వచ్చి కలువమ్మా అని ఆ మహిళకు చెప్పి, ఆమె వచ్చినప్పుడు లోపలికి పంపమని సెక్యూరిటీ వాళ్లను కూడా ఆదేశించారు. ఆపరేషన్ విజయవంతమైన తర్వాత ఆమె మళ్లీ వచ్చి కలిసింది. ఆ సమయంలోనే చెవిటి వారికి కూడా ఆరోగ్యశ్రీ కింద ఎంత ఖర్చయినా చికిత్స చేయించాలన్న నిర్ణయం తీసుకున్నారు. వైఎస్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఎప్పుడు కాకినాడ వెళ్లినా అభిమానంతో ఆయనకు సుబ్బారాయుడు అనే వ్యక్తి కొబ్బరిబొండాలు ఇచ్చేవాడు. ఆయన సీఎం అయిన తర్వాత ఏడాదికి సుబ్బారాయుడు వెళ్లి, ప్రజాదర్బారులో కలిశారు. అయన్ను గుర్తుపట్టిన వైఎస్.. 'ఏడాది తర్వాత నేను గుర్తొచ్చానా? ఎలా ఉన్నావు? కొబ్బరి బొండాలు తీసుకొచ్చావా?' అని అడిగారు. తీసుకొచ్చానని, సెక్యూరిటీ వాళ్లు అనుమతించలేదని చెప్పాడు. కుటుంబసభ్యుల యోగక్షేమాలు అడగ్గా.. పెద్దమ్మాయి పెళ్లికి వచ్చిందనీ, తన ఆర్థిక పరిస్థితి బాలేదనీ సుబ్బారాయుడు చెప్పారు. స్పందించిన ఆయన సొంత ఖర్చులతో అమ్మాయి పెళ్లి చేశారు.

వైఎస్ ఎప్పుడూ అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని కోరుకునేవారు. విశాఖలో ఐటీ కార్యకలాపాలను ప్రారంభించారు. బిట్స్ పిలానీ, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో, అమెరికన్ కాన్సులేట్, పీవీ ఎక్స్‌ప్రెస్ వే.. ఇలా హైదరాబాద్ నగరానికి అనేక ప్రాజెక్టులు తీసుకొచ్చారు. కాకినాడలో ఎస్ఈజెడ్, గుంటూరులో 18 టెక్స్ టైల్స్ పార్కులు, చిత్తూరు శ్రీ సిటీ.. ఇలా అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశారు.

వ్యాసకర్త డాక్టర్ వైఎస్సార్ ప్రెస్ సెక్రెటరీ



నేడు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి

వ్యవసాయ పునరుజ్జీవన పథగామి

విశ్లేషణ



ఎం.వి.ఎస్. నాగిరెడ్డి

డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 2004 మే నెల రెండవ వారంలో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసే నాటికి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం దెబ్బతిని ఉంది. సకాలంలో వర్షాలు పడక, ప్రాజెక్టుల నుండి నీరు విడుదల గాక, పండిన పంటలకు కూడా కనీస మద్దతు ధరలు లేక రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి. 'ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదు, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు అనాథలు కాకూడదు' అనే ఉద్దేశ్యంతో జూన్ మొదటి వారంలోనే వైఎస్ జీవో నం.421 విడుదల చేసి, 2 లక్షల రూపాయల పరిహారం అందించారు. దాన్ని అంతకుముందు ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు కూడా వర్తించేలా చూశారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రైతుకు వెన్నెముక. రైతులు అప్పులు కట్టలేక సహకార సంఘాలు దివాళా తీసే పరిస్థితిలో, వైద్య నాథన్ కమిటీ సిఫారసులు అమలు చేసి రూ.1,800 కోట్లు ప్రభుత్వం నుండి వాటికి అందేలా చూశారు. నష్టాల్లో ఉన్న సంఘాలను పక్క సహకార సంఘంలో కలిపి సహకార వ్యవస్థను కాపాడారు. పావలా వడ్డీకే రైతులకు పంట రుణాలు అందించారు.

రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేనాటికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి వనరులు ఉన్న భూమి సుమారుగా 80 లక్షల ఎకరాలు మాత్రమే. ఇలాంటి పరిస్థితిలో లక్ష కోట్లతో కోటి ఎకరాలకు సాగు నీరందిస్తానని 'జలయజ్ఞం' మొదలు పెట్టారు. దీనిలో భాగంగా మొదలు పెట్టిన తొలి ప్రాజెక్టు పులిచింతల అయితే, మొట్టమొదట పూర్తి చేసింది నిజామాబాద్ జిల్లాలోని అలీసాగర్ ప్రాజెక్టు. 'రైతు ఒక ఎకరంలో పంట పండించడం ద్వారా 60 నుండి 100 పని దినాలు కల్పిస్తున్నాడు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం కల్పిస్తున్నాడు' అని వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని వైఎస్ సంకల్పిస్తే కొంతమంది ఎగతాళి చేశారు. కానీ సంకల్ప బలంతో ఆయన ప్రారంభించిన వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకం నేడు ఆదర్శమై ఎన్నో రాష్ట్రాల్లో అమలవుతోంది.

రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల మహిళలు, విద్యార్థులు, వృద్ధుల సంక్షేమం, అభివృద్ధి కోసం 'నాన్న ఒక అడుగు వేస్తే, ఆయన వారసుడిగా నేను రెండు అడుగులు వేస్తాను' అని ప్రకటించి, నాలుగు అడుగులు వేస్తున్నారు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి. ఈ నాలుగు సంవత్సరాల మూడు నెలలలో (51 నెలలు) నేరుగా రైతులకు 'డీబీటీ'(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా రూ. 1,07,307.68 కోట్లు జమచేశారు.

విద్యార్థి నాయకునిగా, ఒక్క రూపాయి వైద్యునిగా, యువ శాసన సభ్యునిగా, యువ ప్రతిపక్ష నాయకునిగా, ముఖ్యమంత్రిగా ప్రతి అడుగులోనూ గొప్ప మానవతావాదిగా నిలిచిన వై.ఎస్.రాజశేఖర రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా ఆయనకు వినమ్ర శ్రద్ధాంజలి.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్

దూరదృష్టి గల నేత

అభిప్రాయం



జి. శ్రీలక్ష్మి

'వైఎస్సార్' అన్న మాట వింటేనే ఏదో తెలియని అనుభూతి కలుగుతుంది. ఆయన్ని తలుచుకోగానే తెల్లని పంచకట్టుతో నిలువెత్తు మనిషి రూపం కళ్ల ముందు మెదులుతుంది. మహిళలు, రైతులు, విద్యార్థులు, బడుగువర్గాల వారు, ఉద్యోగులు... ఆయన పథకాల వల్ల లబ్ధి పొందిన వారే.

రాజన్నకు మహిళల పట్ల సెంటిమెంట్ ఎక్కువగా ఉండేది. చెల్లెమ్మ సబితా ఇంద్రారెడ్డి నియోజకవర్గం నుండి 'ప్రజాప్రస్థానం' పాదయాత్ర ప్రారంభించి మరో చెల్లమ్మ గౌరు చరితా రెడ్డి నియోజకర్గం నందికొట్కూరులో ముగించారు. తన మంత్రి వర్గంలో సబితా ఇంద్రా రెడ్డికి హోం శాఖను కట్టబెట్టారు. ఆయన మహిళా సంక్షేమం పట్ల అవిశ్రాంతంగా శ్రమించారు. 'పావలా వడ్డీ', 'అభయ హస్తం' పథకాలను ప్రవేశపెట్టి ఆడపడుచులు ఆర్థికంగా స్థిరపడడానికి కృషి చేశారు.

ఒక పేదింటి బిడ్డ ఉన్నత చదువులు చదివితే ఆ కుటుంబం దశ, దిశ తిరుగుతుందని ఆయన ఎప్పుడూ చెప్పేవారు. అందుకే 'ఫీజు రీయింబర్స్‌మెంట్' పథకం ప్రవేశపెట్టి పేదల జీవితంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ఈ పథకంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ, పేద విద్యార్థులకు పెద్ద చదువులు అందు బాటులోకి వచ్చాయి.

రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందని గట్టిగా నమ్మే రాజన్న రైతు ముఖాన చిరునవ్వు కోసం అనేక పథకాలను తీసుకొచ్చారు. 'రచ్చ బండ' కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలోని సాధకబాధకాలు తెలుసుకోవడానికి ప్రజల వద్దకు వెళ్లారు. అక్కడికక్కడే సమస్యల పరిష్కారా నికి చర్యలు తీసుకుని వాటిని అమలుపరిచే 'చేతల మనిషి'గా నిలిచారు.

రాజకీయ ప్రస్థానంలో ఎన్నికల్లో ఓటమి ఎరుగని అరుదైన నాయకులలో ఆయన ఒకరు. పులివెందుల నియోజకవర్గం నుండి 1978, 1983, 1985 ఎన్నికల్లో అసెంబ్లీకి; కడప లోక్‌సభ స్థానం నుండి 1989, 1991, 1996, 1998 ఎన్నికల్లో పార్లమెంట్‌కీ, ఆ తర్వాత పులివెందుల నుండి 1999, 2004, 2009 ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీచేసి వరుసగా విజయాలు సాధించారు.

ఆయన వ్యక్తిగత జీవితం కూడా ఆదర్శనీయమే. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా తెల్లవారుజామునే నిద్రలేవడం, ఎవరు ఏ సహాయం కోరి ఇంటికొచ్చినా తన హోదాను పక్కనపెట్టి వారి అవసరం తెలుసుకొని సాయపడడం చేసేవారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయంటే ఆయన దూరదృష్టి, ప్రజా సంక్షేమ కాంక్షలే కారణాలు. ఒక పాలకుడిలో ఉండాల్సిన స్పష్టత, చిత్తశుద్ధి, దూరదృష్టి, దార్శని కత వైఎస్సార్‌లో ఉండడంతో ఆయన తెలుగునాట చిరస్మరణీయుడిగా నిలిచిపోయారు.

వ్యాసకర్త పరిశోధకురాలు

నువ్వు ఇచ్చిన కుటుంబం

ఏమిస్తారయ్యా సామీ ఎవరైనా
కన్నబిడ్డకు ఇంతకన్నా!

ప్రజల గుండె చప్పుడు పేరుగా
నడలని కార్యదీక్ష వేరుగా
బెదరని పోరాటమే తీరుగా
తరగని అభిమానమే హోరుగా
ఒక పెద్ద కుటుంబాన్నే ఇచ్చావు

నీ నవ్వు ప్రజలకు పంచడానికి
నీ నమ్మకం జనంలో నిలవడానికి
నీ దార్శనికత ప్రపంచానికి చాటడానికి
నీ ఆశయం గడప గడపకు చేర్చడానికి
నిన్నే వదిలి వెళ్లావో
నువ్వే అతనిలోకి మళ్లావో!

నీ పాలన కొనసాగుతోంది
నీ లాలన అలరారుతోంది
నీ రూపం దీపమై వెలుగుతోంది
నీ లక్ష్యం ఏరువాకై సాగుతోంది

రాజన్నా!
నువ్వన్న మాటే గుర్తుకొస్తోంది
'ఎన్నాళ్లు బతికామన్నది కాదు
బతికినంత కాలం...
ఎలా బతికామన్నది ముఖ్యం'
నువ్వు అలాగే బతికావు
బతుకై ఉన్నావు
నువ్వు ఇచ్చిన ఇంత పెద్ద కుటుంబంలో
ఎప్పటికీ నిలిచే ఉంటావు.

– పూడి శ్రీనివాసరావు
సీనియర్ జర్నలిస్ట్

ప్రజల గుండెల్లో చిరంజీవి

సందర్భం



నందిరాజు రాధాకృష్ణ

చాలామంది రాజకీయ నాయకుల మాదిరి కాకుండా, మాటకు కట్టుబడి నడిచే నిజమైన తెలుగు స్ఫూర్తికి ఆయన ప్రతిబింబం. అధికారంలో ఉన్నా లేకున్నా, ఆయన ఎప్పుడూ సామాన్యుల కోసం శ్రమిస్తూనే ఉండేవారు. కాంగ్రెస్ వ్యవహారాల పాత్రికేయునిగా వైఎస్ రాజ శేఖరరెడ్డితో చనువుగా మెలగిన వాడిగా ఆయన గురించి నాకున్న అవగాహనతో ఇస్తున్న అక్షర నివాళి ఇది.

అతి సామాన్య వ్యక్తులకు సేవలందిస్తూ, వారి ఆశీర్వాదాలు అందుకుని ఆ ఆనందాన్ని ఇతరులతో పంచుకోవడానికి భగవంతుడు ప్రసాదించిన వరమే మానవ జీవితం అని రాజశేఖర రెడ్డి గాఢంగా నమ్మేవారు. 'ఇంతకాలం జీవించాలని అనుకుంటున్నామని సంవత్సరాలను లెక్క పెట్టవద్దు. సర్వశక్తిమంతుడు మీకు అందించిన అవకాశాలతో సమాజానికి ఎంత చేశారో మీరే ప్రశ్నించుకోండి' అని ఆయన సలహా ఇచ్చేవారు. ఈ మానవీయ సూత్రమే ప్రతినెలా మొదటి వారంలో నిరుపేదలకు సామాజిక భద్రతా పింఛన్‌లను అందజేసేలా ఆయనను ప్రేరేపించింది.

2003 వేసవి మండుటెండలో రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలను సందర్శిస్తూ చేసిన పాదయాత్ర 2004 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌ను గెలిపించింది. ఆయన ముఖ్యమంత్రి పీఠం అలంకరించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బయో–టెక్నాలజీ, పారి శ్రామిక, వ్యవసాయోత్పత్తిని పెంపొందించే అన్ని రంగాలకూ ప్రాధాన్యతనివ్వడంలో సమతుల్య విధానానికి ఆయన కట్టుబడి ఉండేవారు. ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యాలు, ప్రైవేట్ పెట్టుబడులతో కూడిన అన్ని లావాదేవీలు ఒప్పందాలలో పూర్తి పారదర్శకత ఆయన సిద్ధాంతం. ముఖ్యమంత్రి అనేవారు ప్రజల విశ్వాసానికి అమూల్యమైన సంరక్షకుడని ఆయన నమ్మేవారు. పరిపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లడమనేదే ఆయన తపన. జనాభాలో 75 శాతం మంది జీవనోపాధి కోసం వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారన్న నమ్మికతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఎక్కువ దృష్టి పెట్టాలని ఆయన అనుకొన్నారు.

'రాజీవ్ పల్లె బాట' ద్వారా ఆదివారం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల నాడిని పట్టుకోవడం డాక్టర్‌గా రాజశేఖర రెడ్డి ఆసక్తికర 'కాలక్షేపం'. రాజీవ్ పల్లె బాట ఒక సామూహిక సంప్రదింపు కార్యక్రమం. ప్రభుత్వ కార్యక్రమాలను అధికార్లు ఏ విధంగా అమలు చేస్తున్నారనేది ప్రజల నోళ్ల ద్వారా ముఖ్యమంత్రి వినడం ఈ కార్యక్రమ సూత్రంగా నిలిచింది.

రాష్ట్రంలో ఆ సమయంలో కుండ పోతగా వర్షాలు కురుస్తున్నాయి. అది 2009 సెప్టెంబర్ 2, ఆదివారం. రాష్ట్రంలో దట్టమైన క్యుములోనింబస్ మేఘాలు కమ్ముకున్నాయి. అలాంటి సమయంలో తన మానసపుత్రిక లాంటి పథకం 'రచ్చబండ' ద్వారా ప్రజల బాధలు తెలుసుకోవడానికి బయలుదేరారు వైఎస్సార్. వాతావరణం అనుకూలంగా లేదంటూ అధికారులు ఆయనకు తెలిపినా ఆయన ముందుకే కదిలారు.


ప్రియతమ నేత రాక కోసం చిత్తూరులో ప్రజలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఇంతలో ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న హెలి కాప్టర్ ఆచూకీ లేదనే పిడుగులాంటి వార్త! 25 గంటల తర్వాత ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ఆనవాళ్లను నల్లమల అడవుల్లో కర్నూలు–ప్రకాశం జిల్లా సరిహద్దుల్లో గుర్తించారు. నాటి ప్రమాదంలో వైఎస్‌తో పాటు మొత్తం ఐదుగురు మరణించారు. ఒక శకం ముగిసింది. ఒక మహానేత కనుమరుగయ్యారు. తెలుగు రాష్ట్రం బోరున విలపించింది!

వ్యాసకర్త విశ్రాంత పాత్రికేయుడు | 98481 28215

'మనందరికి కావలసినవాడు'



జ్ఞాపకం



అద్దంకి శ్రీరామ కుమార్

డా॥ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయం. ఆ సమయంలో ఆకాశవాణి జాతీయ వార్తా విభాగం కోసం 'అహోబిలం'లో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి నన్నూ, మా విలేఖరి సుదర్శనంను ఢిల్లీ నుంచి పంపారు. ఆ కార్యక్రమం అనంతరం, ఐటీ రంగం గురించి వైఎస్ అభిప్రాయాలను తెలుసుకుని 'స్పాట్ లైట్' ఆంగ్ల కార్యక్రమంలో ప్రసారం చేయమన్నారు.

ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం విలేఖరి మహ్మద్ ఖాన్ షకీల్ మమ్మల్ని సీఎల్‌పీ కార్యాలయంలో ఉన్న రాజశేఖర రెడ్డి దగ్గరకు తీసుకువెళ్ళి పరిచయం చేశారు. తొలి పరిచయంతోనే ఎంతో ఆత్మీయంగా మాట్లాడిన ఆయన, తన ఇంటర్వ్యూను రేడియోలో ప్రసారం చేస్తారంటే నమ్మలేనని అన్నారు. వారిని ఒప్పించి ఆంగ్లంలో వారి ఇంటర్వ్యూను తీసుకున్నాము.

స్పాట్ లైట్ కార్యక్రమం ప్రసారమయ్యే ఉదయమే రాజశేఖర్ రెడ్డి గారికీ, దీనికోసం అభిప్రాయాలు తెలుసుకున్న మిగిలిన నాయకులకూ రాత్రి 9.30కు కార్యక్రమం వినమని చెప్పటం జరిగింది. ఇక్కడే అనుకోని సంఘటన జరిగింది. స్పాట్‌లైట్ కార్యక్రమం ప్రసారం ముగియగానే ఆయన స్వయంగా ఆకాశవాణి ఢిల్లీ న్యూస్ రూమ్‌కు ఫోన్ చేసి విన్నానని చెప్పడమే కాకుండా, ప్రత్యేకించి నన్ను, సుదర్శనంను అభినందించడం ఓ మరపురాని జ్ఞాపకం. ఇలా ఆకాశవాణిలో తొలి సారిగా రాజశేఖర్ రెడ్డి స్వరం ఆంగ్లంలో వినిపించే అవకాశం నాకు లభించింది.

అంతకుముందు ఆయన్ని పార్లమెంటు దగ్గర ఎన్నోసార్లు చూడడం జరిగింది కానీ, పలకరింపులు కేవలం నవ్వు ద్వారా మాత్రమే. 2002లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రానికి బదలీ మీద వచ్చిన నేను 'వార్తా వాహిని' కోసం, వివిధ కార్యక్రమాలను కవర్ చేసేవాడిని. 'సార్, మీరు సీఎం కాగానే తొలి ఇంటర్వ్యూ నాకే' అనగానే, పెద్దగా నవ్వుతూ, 'వెల్‌కమ్' అన్నారు. అన్నట్టుగానే ముఖ్యమంత్రిగా లాల్‌బహదూర్ స్టేడియంలో ప్రమాణం చేసిన సాయంత్రమే తన ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల గురించి నాకు ఫోన్‌లో చెప్పటం, దాన్ని 'జన హృదయ నేత వైఎస్సార్' అని ప్రత్యేక కార్యక్రమం ప్రసారం చేయటం జరిగింది.

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి సంవత్సరం అయిన సందర్భంగా నా కోరికపై ఆకాశవాణి కోసం 15 నిమిషాల ఇంటర్వ్యూ ఇవ్వటం విశేషం. తెలుగు భాషకు ప్రత్యేక హోదా లభించిన రోజు, వారి స్పందన కోసం వెళ్ళాను. ఎంతో పని ఒత్తిడిలో ఉండి కూడా, 'నువ్వు ముందు మజ్జిగ తాగు, తరువాతే నేను నీ ప్రశ్నకు ఒకమాటతోనే స్పందిస్తా'నన్నారు. ఆ సాయంత్రమే 'తెలుగు పద్యానికి పట్టం, మన మాతృభాషకు జేజేలు' అని అంతా పద్యాలతో చేసిన కార్యక్రమంలో ఆయన స్పందన రేడియో శ్రోతలకు వినిపించాం.

అవి అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు హైదరాబాద్‌లో జరుగుతున్న రోజులు. ఢిల్లీ పాత్రికేయులతో రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉండగా నన్ను చూపిస్తూ...'హిందూస్థాన్ టైమ్స్' పాత్రికేయురాలు కల్యాణి శంకర్ 'మా అందరికి కావలసినవాడు రామ్ కుమార్' అంటే, రాజశేఖర్ రెడ్డి పెద్దగా నవ్వుతూ 'మనందరికి కావలసిన వాడు, అంతేకాదు అందరూ అతనికి కావలసిన వారే' అనటం మధురమైన జ్ఞాపకం.

ఆకాశవాణి విశ్రాంత ప్రతినిధి | 94405 67625

ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ గోపీనాథ్ మీనన్, డాక్టర్ రవి పిళ్లైకు స్వామివారి చిత్రపటాలు అందజేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తిలోని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపీనాథ్ మీనన్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వీరికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, స్వామి అమ్మవార్ల చిత్రపటాలు, ప్రసాదాలను అందజేశారు. కాగా, స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఆర్కే గ్రూప్స్ అధినేత పద్మశ్రీ డాక్టర్ రవి పిళ్లై, సుమారు 20 మంది రష్యా దేశస్థులు కూడా ఉన్నారు.

అక్టోబర్ 15 నుంచి దేవీ శరన్నవరాత్రులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ తొమ్మిది రోజుల పాటు అమ్మవారు రోజుకో విశేషమైన అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారు. ఉత్సవాలలో అమ్మవారికి నిర్వహించే ప్రత్యేక ఆర్జిత సేవల వివరాలను దేవస్థానం శుక్రవారం విడుదల చేసింది. ఈ ఏడాది దసరా ఉత్సవాలలో అమ్మవారికి ఖడ్గమాలార్చనను ప్రత్యేక సేవగా నిర్వహించాలని నిర్ణయించారు. 16 నుంచి 23 వరకు అందుబాటులో ఉండే ఈ సేవ కోసం ఉభయదాతలు రూ.5,116 చెల్లించాల్సి ఉంటుంది. ప్రత్యేక కుంకుమార్చన టికెట్ ధర రూ.3 వేలు కాగా, మూలా నక్షత్రం రోజున ఈ ధరను రూ.5 వేలుగా నిర్ణయించారు. దసరా ఉత్సవాలలో అన్ని పూజలను పరోక్షంగా కూడా జరిపించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పాదలకూరులో భూప్రకంపనలు

పొదలకూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరులో శుక్రవారం భూప్రకంపనలు సంభవించాయి. ఉదయం 11.03 గంటలకు ఒక్కసారిగా కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు భయంతో ఇళ్లలోపల నుంచి బయటకు పరుగులు తీశారు. పదేళ్లకాలంలో పొదలకూరులో ఇలా భూమి కంపించడం ఇది మూడోసారి అని స్థానికులు తెలిపారు.

చేనేత విభాగంలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద ఏపీకి మంజూరు చేసిన క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు జౌళి, చేనేతశాఖ కమిషనర్ ఎం.ఎం.నాయక్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన శుక్రవారం విడుదల చేశారు. టెక్స్‌టైల్ డిజైనర్ 12 ఖాళీలు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ 10 ఖాళీలను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు 14 రోజుల్లో కమిషనర్, చేనేత, జౌళిశాఖ, 4వ అంతస్తు, ఐహెచ్‌సీ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్ నంబరు 522503 చిరునామాకు దరఖాస్తులు పంపాలని సూచించారు. పూర్తి వివరాలను https://www.aphandtex.gov.in వెబ్‌సైట్‌లోను, 0864 5232466 ఫోన్ నంబరు ద్వారా తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

స్వర్ణ రథంపై దివ్యతేజం


శ్రీమఠం వీధుల్లో భక్తజన సంద్రం మధ్య స్వర్ణ రథోత్సవం

వైభవంగా శ్రీరాఘవేంద్రుల మధ్యారాధన

భక్తులతో కిటకిటలాడిన శ్రీమఠం
ఆకట్టుకున్న మహా పంచామృతాభిషేకం

మంత్రాలయం: స్వర్ణరథంపై శ్రీరాఘవేంద్ర స్వామి దివ్యతేజస్సును దర్శించుకున్న భక్తజనం తన్మయత్వంలో మునిగిపోయింది. పోటెత్తిన భక్తజనంతో శ్రీమఠం కిటకిటలాడింది. భువన మోహనుడి ఆరాధన సప్తరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యారాధన అత్యంత వైభవంగా సాగింది. రాఘవేంద్ర స్వామి సశరీరంగా బృందావన ప్రవేశం చేసిన శుభదినం కావడంతో వేడుకలు వెలుగులీనాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాయరు మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం చేశారు. రెండుగంటల పాటు ఎంతో వైభవంగా అభిషేక క్రతువు సాగింది. తిరుమల తిరుపతి దేవస్థానం సమర్పించిన పట్టువస్త్రాలు, సుమమాలలతో సుందరంగా బృందావనాన్ని అలంకరించారు. అనంతరం శ్రీరాఘవేంద్రుడి బంగారు ప్రతిమను స్వర్ణ రథంపై కొలువుంచగా మంగళ హారతులు పట్టి రథయాత్రకు అంకురార్పణ పలికారు. అశేష భక్తజనుల హర్షధ్వానాలు, పండితుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో రథయాత్ర రమణీయంగా సాగింది.

టీటీడీ పట్టు వస్త్రాల సమర్పణ

ఆనవాయితీలో భాగంగా శ్రీరాఘవేంద్రస్వామికి పట్టు వస్త్రాలను టీటీడీ జేఈవో వీరబ్రహ్మేంద్ర సమర్పించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పట్టు వస్త్రాలను శాస్త్రోక్తంగా స్వీకరించి శిరస్సున ఉంచుకుని ప్రాంగణ వీధుల్లో ఊరేగారు. ఊంజల మంటపంలో పీఠాధిపతిని టీటీడీ అధికారులు సత్కరించారు. అనంతరం పట్టు వస్త్రాలను రాఘవేంద్రుల మూల బృందావనంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యారాధన వేడుకలకు కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి శ్రీశానంద, కన్నడ సినీ నటుడు జగ్గేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి 30 వేలకు పైగా భక్తులు తరలివచ్చారు.

త్వరలో తిరుచానూరులో మహా వరుణ యాగం

తిరుమల: లోక కల్యాణార్థం త్వరలో తిరుచానూరులో మహా వరుణ యాగం నిర్వహిస్తామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి జరగనున్న నేపథ్యంలో భక్తులకు సంతృప్తికరంగా మూలమూర్తి దర్శనంతోపాటు వాహన సేవలు వీక్షించే అవకాశం కల్పించేందుకు తగిన ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజున 2024 సంవత్సరపు టీటీడీ క్యాలెండర్లు, డైరీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేస్తారని తెలిపారు.

ఈ నెల 5వ తేదీ నుంచి భక్తులకు ఊత కర్రలు: అలిపిరి నడక మార్గంలోని నరసింహ స్వామి ఆలయం సమీపంలో గురువారం మళ్లీ చిరుత సంచరిస్తున్నట్లు తెలిపారు. శ్రీవారి భక్తుల సౌకర్యార్థం తిరుమల నడక మార్గంలో భారీ ఎత్తున భద్రత ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి భక్తులకు ఊత కర్రలు అందజేస్తామని చెప్పారు. ఈ కర్రలను తిరిగి నరసింహ స్వామి ఆలయం వద్ద భక్తుల నుంచి సేకరిస్తామన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పుష్పాభిషేకం


ర్యాలీలో ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: ఇండియన్ స్మార్ట్‌సిటీ అవార్డ్స్‌లో కాకినాడకు పారిశుద్ధ్య విభాగంలో రెండో ర్యాంకు దక్కడంపై ఇందుకు కారణమైన పారిశుద్ధ్య కార్మికులకు సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో అరుదైన గౌరవం దక్కింది. వీరి సేవలను గుర్తిస్తూ ఎమ్మెల్యే ద్వారంపూడి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో 1,000 మంది పారిశుద్ధ్య కార్మికులతో భారీ విజయోత్సవ ర్యాలీని ఏర్పాటు చేసి 3.5 కిలోమీటర్ల మేరకు అడుగడుగునా కార్మికులకు పుష్పాభిషేకం చేయించారు. కొన్నిచోట్ల చీరలు పరిచి వాటిపై నడిపించారు. కేరళ చెండానీ వాయిద్యాలు, తప్పెట గుళ్ళతో అడుగడుగునా సందడి చేస్తూ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులంతా స్వచ్ఛందంగా బయటకు వచ్చి పారిశుద్ధ్య కార్మికులపై పూలుజల్లారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ..సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తోన్న పాలన సంస్కరణల వల్లే కాకినాడ స్మార్ట్‌సిటీకు జాతీయ అవార్డు దక్కిందని చెప్పారు. కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సహా పలువురు అధికారులను ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు సత్కరించారు.

క్లుప్తంగా...

వచ్చే నెలలో ఢిల్లీలో జీ20 పార్లమెంట్ స్పీకర్ల భేటీ

న్యూఢిల్లీ: జీ20 కూటమి దేశాల పార్లమెంట్ స్పీకర్ల సమావేశం వచ్చే నెలలో ఢిల్లీలో జరగనుంది. అక్టోబర్ 12, 13, 14వ తేదీల్లో పార్లమెంట్ నూతన భవనం పార్లమెంట్-20 భేటీకి వేదిక కానుందని జీ20 ఇండియా స్పెషల్ సెక్రటరీ ముక్తేశ్ పర్దేశి చెప్పారు. జీ20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాల పార్లమెంట్ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొని చర్చలు జరుపుతారని తెలిపారు. 'పార్లమెంటేరియన్లు సంబంధిత ప్రభుత్వాలకు మార్గనిర్దేశం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. కాబట్టి, పీ20 సమావేశాలు ప్రపంచ పాలనకు పార్లమెంటరీ కోణాన్ని తీసుకురావడం, అవగాహన పెంచడం, అంతర్జాతీయ నిబంధనలకు రాజకీయ మద్దతును సాధించడం, వీటిని సమర్థంగా కార్యరూపం దాల్చేలా చేయడమే ఈ సమావేశాల లక్ష్యం' అని ముక్తేశ్ వివరించారు. భారత్‌ను ప్రజాస్వామ్యానికి తల్లిగా చూపేందుకు ఉద్దేశించిన ఒక ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. 2010లో జీ20 అధ్యక్ష స్థానంలో కెనడా ఉన్నప్పటి నుంచి పీ20 గ్రూప్ భేటీలు జరుగుతున్నాయని, ఆ క్రమంలో ఇది 9వదని వివరించారు.

మహేంద్రగిరి జల ప్రవేశం

ముంబై: భారత నావికాదళం సామర్థ్యాన్ని మరింత పెంచే మహేంద్రగిరి యుద్ధనౌక శుక్రవారం ముంబైలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ఆయన సతీమణి సుదేశ్ ముఖ్య అతిథిగా హాజరై ఈ యుద్ధనౌకను జలప్రవేశం చేయించారు. మహేంద్రగిరిని ప్రారంభించడం మన నావికాదళ చరిత్రలో కీలక మైలురాయిగా ధన్‌ఖడ్ సందర్భంగా అభివర్ణించారు. భారత సముద్ర నావికాశక్తికి రాయబారిగా మహాసముద్ర జలాల్లో త్రివర్ణపతాకాన్ని మహేంద్రగిరి సగర్వంగా రెపరెపలాడిస్తుందని ఆయన పేర్కొన్నారు. ముంబైలోని మజ్‌గావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్(ఎండీఎల్) మహేంద్రగిరిని తయారు చేసింది. ప్రాజెక్ట్ 17ఏ సిరీస్‌లో ఇది ఏడోదని అధికారులు తెలిపారు. దేశ ఆర్థిక ప్రగతికి, ప్రపంచ శక్తిగా ఎదిగేందుకు, సముద్ర జలాల్లో మన ప్రయోజనాలను రక్షించుకునేందుకు నావికాదళాన్ని ఆధునీకరణ చేయడం ఎంతో అవసరమన్నారు. హిందూమహా సముద్ర ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న భౌగోళిక రాజకీయాలు, భద్రతాపరమైన పరిస్థితుల దృష్ట్యా కూడా ఈ అవసరం ఎంతో ఉందని చెప్పారు. మహేంద్రగిరిలో వినియోగించిన పరికరాలు, వ్యవస్థల్లో 75 శాతం దేశీయంగా తయారైనవే కావడం గర్వకారణమని పేర్కొన్నారు.


ఇండియా వేదికపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, శరద్ పవార్


ఉద్ధవ్ ఠాక్రేతో మాట్లాడుతున్న సోనియా గాంధీ

కలిసే పోటీ చేద్దాం

విపక్ష 'ఇండియా' కూటమి నేతల తీర్మానం
- 14 మందితో సమన్వయ కమిటీ ఏర్పాటు
- సీట్ల పంపకం ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని నిర్ణయం

ముంబై: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో సాధ్యమైనంత వరకు కలిసే పోటీ చేయాలని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నాయకులు తీర్మానించారు. ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో వ్యవహరించాలని, రాష్ట్రాల స్థాయిలో సీట్ల పంపకం ప్రక్రియను వెంటనే ప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని నిర్ణయానికొచ్చారు. ముంబైలో 'ఇండియా' కూటమి రెండు రోజుల కీలక సమావేశం శుక్రవారం ముగిసింది. ముందస్తు ఎన్నికలు, ఒకే దేశం–ఒకే ఎన్నికలపై ఊహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో కూటమి తదుపరి కార్యాచరణపై నేతలు విస్తృతంగా చర్చించారు. పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. కొన్ని తీర్మానాలు చేశారు. కూటమికి సంబంధించిన కీలకమైన విధాన నిర్ణయాలు తీసుకోవడంపాటు సీట్ల పంపకంపై చర్చించడానికి 14 మంది సభ్యులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎన్నికల్లో సాధ్యమైనంత వరకు కలిసే పోటీ చేద్దామంటూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై పోరాటం సాగించాలని, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించాలని తీర్మానంలో పేర్కొన్నారు. 'జుడేగా భారత్, జీతేగా భారత్' అనే థీమ్‌తో వివిధ భాషల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానం ఆమోదించారు. చంద్రయాన్–3 ప్రయోగాన్ని విజయవంతం చేసిన 'ఇస్రో'ను ప్రశంసిస్తూ మరో తీర్మానం ఆమోదించారు. అయితే, ఈ సమావేశంలో కూటమి కన్వీనర్ ఎంపికపై దృష్టి పెట్టలేదు.

ఈ నెల 30 నాటికి సీట్ల పంపకం పూర్తి

ఇండియా కూటమి సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, శివసేన (ఉద్ధవ్) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, బిహార్ సీఎం నితీశ్ కుమార్‌తోపాటు వివిధ పార్టీల ముఖ్య నాయకులు ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, సీతారాం ఏచూరి, డి.రాజా, తేజస్వీ యాదవ్, అఖిలేష్ యాదవ్, కపిల్ సిబల్, జయంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. సీట్ల కేటాయింపు ప్రక్రియ సెప్టెంబర్ 30 నాటికి పూర్తవుతుందని ఇండియా కూటమి వర్గాలు వెల్లడించాయి.

మోదీ సర్కారు ఓటమి తథ్యం: ఖర్గే

నియంతృత్వ పాలనకు కౌంట్‌డౌన్ మొదలైందని, మోదీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు సాగించినా వచ్చే ఎన్నికల్లో పరాజయం తథ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తేల్చిచెప్పారు. ఈ మేరకు ఆయన శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఒకే దేశం, ఒకే ఎన్నికల పేరిట దేశ ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆక్షేపించారు. ప్రజలను ఎవరూ మోసం చేయలేరని స్పష్టం చేశారు. అంతకముందు విపక్ష ఇండియా కూటమి సమావేశంలో ఖర్గే ప్రసంగించారు. ప్రతిపక్ష కూటమి బలాన్ని చూసి మోదీ ప్రభుత్వం బెంబేలెత్తిపోతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇకపై మరింత ఉధృతంగా విపక్షాలపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పే అవకాశం ఉందని, దాడులు, అరెస్టులు జరగబోతున్నాయని, కక్ష సాధింపు రాజకీయాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని భాగస్వామ్య పక్షాలకు పిలుపునిచ్చారు.

విశ్వసనీయ ప్రత్యామ్నాయం: పవార్

బీజేపీ పాలనతో దేశ ప్రజలు విసుగెత్తిపోయారని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ అన్నారు. ఇండియా కూటమి రూపంలో ప్రజలకు విశ్వసనీయ ప్రత్యామ్నాయాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఇండియా కూటమి సమావేశానికి 28 పార్టీలకు చెందిన 86 మంది నేతలు హాజరయ్యారని తెలిపారు.

'ముందస్తు'కు సిద్ధంగా ఉండాలి: నితీశ్

లోక్‌సభకు ముందస్తుగా ఎన్నికలు జరిగే అవకాశాలను కొట్టిపారేయలేమని, అందుకు ఇండియా కూటమి సిద్ధంగా ఉండాలని బిహార్ సీఎం నితీశ్ కుమార్ సూచించారు.

60 శాతం జనాభాకు ప్రాతినిధ్యం: రాహుల్

దేశంలో 60 శాతం జనాభాకు 'ఇండియా' కూటమిలోని పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. ఈ పార్టీలన్నీ కలిసికట్టుగా ఉంటే బీజేపీని సులభంగా ఓడించవచ్చని అన్నారు.

కన్వీనర్ అవసరం లేదు: ఉద్ధవ్ ఠాక్రే

ప్రతిపక్ష ఇండియా కూటమికి కన్వీనర్ అవసరం లేదని శివసేన(ఉద్ధవ్) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకున్నామని వెల్లడించారు. ఏకాభిప్రాయంతో ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. కూటమి లోగోపై ప్రజల నుంచి సూచనలు స్వీకరిస్తున్నామని వివరించారు.

మాకు పబ్లిసిటీ ఆఫీసర్ మోదీ: స్టాలిన్

బీజేపీ ప్రభుత్వం సాధించేదేమీ లేదని డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శించారు. మోదీ సర్కారును ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందని చెప్పారు. తమ కూటమికి ప్రధాని మోదీ 'పబ్లిసిటీ ఆఫీసర్'గా మారారని పేర్కొన్నారు.

సమన్వయ కమిటీలో ఎవరెవరు?

14 మందితో కూడిన సమన్వయ కమిటీ సభ్యుల పేర్లను ఇండియా కూటమి ఖరారు చేసింది. వివిధ పార్టీల నాయకులతో ఇందులో భాగస్వామ్యం కల్పించారు. కె.సి.వేణుగోపాల్(కాంగ్రెస్), శరద్ పవార్(ఎన్సీపీ), టీఆర్ బాలు(డీఎంకే), తేజస్వీ యాదవ్(ఆర్జేడీ), అభిషేక్ బెనర్జీ(తృణమూల్ కాంగ్రెస్), సంజయ్ రౌత్(శివసేన), హేమంత్ సోరెన్(జేఎంఎం), రాఘవ్ చద్దా(ఆమ్ ఆద్మీ పార్టీ), జావెద్ అలీఖాన్(సమాజ్‌వాదీ పార్టీ), లాలన్ సింగ్(జేడీ–యూ), డి.రాజా(సీపీఐ), ఒమర్ అబ్దుల్లా(నేషనల్ కాన్ఫరెన్స్), మెహబూబా ముఫ్తీ(పీడీపీ) ఇండియా కూటమి సమన్వయ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. తమ పార్టీ తరఫు సభ్యుడి పేరును తర్వాత వెల్లడిస్తామని సీపీఎం ప్రకటించింది.

జమిలి ఎన్నికల దారిలో...
ఐదు రాజ్యాంగ సవరణలు

అయితే భారీగా ప్రజాధనం ఆదా
పార్టీలకు, అభ్యర్థులకు కూడా అంతే
అభివృద్ధికి కోడ్ అడ్డంకులూ తగ్గుతాయి

'ఒక దేశం – ఒకే ఎన్నికలు'. ఇప్పుడు దేశవ్యాప్తంగా కాక రేపుతున్న అంశం. ఈ నెల 18 నుంచి ఐదు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. అధికార బీజేపీ వేసిన ఈ ఎత్తుగడ వెనక ఉద్దేశం ఏమిటోనని విపక్షాలు ఇప్పుడు తలలు బద్దలు కొట్టుకుంటున్నాయి. ముఖ్యంగా చిరకాలంగా బీజేపీ సమర్థిస్తున్న ఒక దేశం – ఒకే ఎన్నికలు అంశాన్ని ఈసారి పార్లమెంటు ఆమోదముద్ర వేయించుకుంటుందని అవి అనుమానిస్తున్నాయి. అదే జరిగితే ఇకపై అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ లోక్‌సభతో పాటే ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి.

అంత ఈజీ కాదు...

అయితే, ఇది వినడానికి బాగానే ఉన్నా ఆచరణలో మాత్రం అంత సులువు కాదు. ఇది సాధ్యపడాలంటే కనీసం ఐదు రాజ్యాంగ సవరణలు అవసరమని చట్ట వ్యవహారాల నిపుణులు అంటున్నారు. ఈ అంశంపై అధ్యయనానికి గతంలో ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ.. పార్టీలు మొదలుకుని కేంద్ర ఎన్నికల సంఘం దాకా అందరితోనూ లోతుగా చర్చలు జరిపింది. అనంతరం ఈ విషయమై పలు కీలక సిఫార్సులు చేసింది. ఆచరణసాధ్యమైన రోడ్ మ్యాప్, ఫ్రేమ్ వర్క్ రూపకల్పన నిమిత్తం ఇప్పుడీ అంశం లా కమిషన్ పరిశీలనలో ఉంది.

ప్రయోజనాలెన్నో...



లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులు ఉండే మాట నిజమే అయినా దీర్ఘకాలంలో మాత్రం చాలా ప్రయోజనాలుంటాయని పరిశీలకులు అంటున్నారు. వారు చెబుతున్నది ఏమిటంటే...
- జమిలి ఎన్నికలకు భారీ సంఖ్యలో అదనపు ఈవీఎంలు, వీవీ పాట్ లు కావాల్సి వస్తాయి. ఇందుకు కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుంది.
- ఎన్నికల, భద్రతా సిబ్బంది కూడా భారీ సంఖ్యలో కావాల్సి వస్తారు.
- కానీ, ఈ విధానం అమల్లోకి వస్తే దీర్ఘకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖజానా మీద మాత్రం ఎన్నికల భారం చాలావరకు తగ్గిపోతుంది.
- పార్టీలకు, అభ్యర్థులకు కూడా ఎన్నికల, ప్రచార వ్యయం కూడా అంతే భారీగా తగ్గిపోతుంది.
- చీటికీ మాటికీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చి, అభివృద్ధి పనులు కుంటుబడే దురవస్థ తప్పుతుంది.
- సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు పదేపదే ఆగకుండా ఉంటుంది.
- అయితే మనది సమాఖ్య రాజ్యం గనుక ఇది జరగాలంటే పార్టీల మధ్య ఏకాభిప్రాయం అవసరం.
- అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇందుకు అంగీకరించాల్సి ఉంటుంది.

ఆ సవరణలు

జమిలి ఎన్నికలు సాధ్యపడాలంటే రాజ్యాంగానికి కనీసం ఐదు సవరణలు అవసరమన్నది న్యాయ నిపుణుల అభిప్రాయం. అవి...
- ఆర్టికల్ 83 (పార్లమెంటు సభల కాలావధికి సంబంధించినది)
- ఆర్టికల్ 85 (పార్లమెంటును రాష్ట్రపతి రద్దు చేయడానికి సంబంధించినది)
- ఆర్టికల్ 172 (రాష్ట్రాల అసెంబ్లీల కాలావధికి సంబంధించినది)
- ఆర్టికల్ 174 (రాష్ట్రాల అసెంబ్లీల రద్దుకు సంబంధించినది)
- ఆర్టికల్ 356 (రాష్ట్రాల్లో అసెంబ్లీలను రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించేందుకు సంబంధించినది)

పలు దేశాల్లో ఉన్నదే...

జమిలి ఎన్నికల విధానం కొత్తదేమీ కాదు. మన దేశంలో కూడా 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలు మొదలుకొని 1967 దాకా లోక్ సభకు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతూ వచ్చాయి. కానీ ఆ తర్వాత పలు రాష్ట్ర ప్రభుత్వాలు పలు కారణాలతో ముందుగా ఈ రద్దవడం వంటి పరిణామాలు జరుగుతూ వచ్చాయి.
- దక్షిణాఫ్రికాలో జాతీయ, స్థానిక ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి.
- స్వీడన్‌లో కూడా అంతే. జాతీయ అసెంబ్లీ రిక్స్ దాగ్‌తో పాటు లాండ్ స్టింగ్‌గా పిలిచే ప్రాంతీయ సభలు/కౌంటీ కౌన్సిల్స్‌కు ప్రతి నాలుగేళ్లకోసారి ఒకేసారి జరుగుతాయి.

– నేషనల్ డెస్క్, సాక్షి

'జమిలి'పై కమిటీ

- మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో 16 మంది సభ్యులతో ఏర్పాటు
- 'వన్ నేషన్–వన్ ఎలక్షన్' సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికే..

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగిపోయింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికార బీజేపీని ఎదుర్కొనే వ్యూహాలపై ఓవైపు ప్రతిపక్ష 'ఇండియా' కూటమి కార్యాచరణ సిద్ధం చేస్తుండగా, మరోవైపు ముందస్తు ఎన్నికల ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం పదును పెడుతోంది. ఈ నెల 18 నుంచి 5 రోజులపాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటించి ముందస్తు ఎన్నికల అంశాన్ని కేంద్ర ఇప్పటికే తెరపైకి తీసుకొచ్చింది. దానికి మరింత బలం చేకూర్చేలా 'వన్ నేషన్–వన్ ఎలక్షన్' సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయడానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. జమిలి ఎన్నికల అంశాన్ని తేల్చడానికి 16 మంది సభ్యులతో ఈ కమిటీని నియమించింది. కమిటీ విధివిధానాలు, గడువుపై కేంద్రం త్వరలోనే ప్రకటన చేయనుందని సమాచారం. ఈ పరిణామాలన్నీ చూస్తే ముందస్తు ఎన్నికల హడావుడి మొదలైనట్లే కనిపిస్తోంది. జమిలి ఎన్నికలపై పార్లమెంటరీ స్థాయీ సంఘం, లా కమిషన్ అధ్యయనం చేసి, తమ నివేదికలను కేంద్రానికి సమర్పించాయి. అవి సానుకూలంగా స్పందించాయి.

భాగస్వామ్యపక్షాల అభిప్రాయాలు తెలుసుకోనున్న కమిటీ

'వన్ నేషన్–వన్ ఎలక్షన్'పై తొలిసారిగా 2019 జూన్‌లో కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ అధ్యక్షత వహించారు. అప్పట్లో సమాజ్‌వాదీ పార్టీ, టీఆర్ఎస్(ఇప్పటి బీఆర్ఎస్), శిరోమణి అకాలీదళ్ వంటి పార్టీలు ఆ ఆలోచనకు మద్దతు ప్రకటించాయి. ఆ తర్వాత 2020 నవంబర్‌లో 80వ ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ సదస్సులో 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అంశంపై ప్రధాని ప్రసంగించారు. దాదాపు 3 ఏళ్ల అనంతరం కేంద్రం దీనిపై కమిటీని ఏర్పాటు చేయడం గమనార్హం. మాజీ రాష్ట్రపతి కోవింద్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. జమిలి ఎన్నికలకు సంబంధించిన చట్టపరమైన అంశాలను కమిటీ పరిశీలిస్తుంది. నిపుణులు, పార్టీల నేతలతోపాటు సామాన్య ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తుంది. నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఈ ఏడాది నవంబర్, డిసెంబర్ ల్లో తెలంగాణ సహా 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. వచ్చే ఏడాది ఏడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికలతో పాటే మొత్తం 12 రాష్ట్రాల శాసనసభ ఎన్నికలను ఒకేసారి నిర్వహిస్తారన్న చర్చ మొదలైంది. త్వరలో జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో జమిలి ఎన్నికలపై కేంద్రం నిర్ణయం తీసుకోవచ్చని ప్రచారం జరుగుతోంది.

తరచూ ఎన్నికలతో నష్టమే

దేశంలో 'ఒకే దేశం– ఒకే ఎన్నిక' అవసరం ఉందని రామ్‌నాథ్ కోవింద్ గతంలో పలు సందర్భాల్లో చెప్పారు. ''తరచూ దేశంలో ఏదో ఒకచోట ఎన్నికలు జరుగుతుండడంతో మానవ వనరులపై భారం పడుతోంది. ఎన్నికల వ్యయం పెరిగిపోతోంది. నియమావళి వల్ల అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది'' అని 2018లో పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంలో కోవింద్ చెప్పారు. 2014 మేలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకే దేశం–ఒకే ఎన్నికపై చర్చ ప్రారంభమైంది. దేశంలో 1967 దాకా లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. మోదీ ప్రభుత్వ పదవీ కాలం మరికొన్ని నెలల్లో ముగియనుంది. ఈలోగానే ఈ వ్యవహారాన్ని తేల్చేయాలనే పట్టుదలతో ఉంది.

కోవింద్‌తో జేపీ నడ్డా భేటీ

బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం కోవింద్‌తో సమావేశమయ్యారు. కోవింద్ నేతృత్వంలో కమిటీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొద్దిసేపటి తర్వాత ఈ భేటీ జరిగింది. కమిటీ కూర్పుపై వారు చర్చించినట్లు తెలుస్తోంది.

సమాఖ్య స్ఫూర్తికి విఘాతం: విపక్షాలు

జమిలి ఎన్నికల అంశంపై రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటుపై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి స్పందించింది. కేంద్ర ప్రభుత్వ ఆలోచనను తప్పుపట్టింది. లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. సమాఖ్య వ్యవస్థను దెబ్బతీయొద్దని డిమాండ్ చేసింది. రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీ అనేది ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడ అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు.

ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఎన్నిక చెల్లదు

దేవెగౌడ మనవడికి కర్ణాటక హైకోర్టు షాక్



బెంగళూరు: మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ్ మనవడు, లోక్‌సభ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఎన్నిక చెల్లదని కర్ణాటక హైకోర్టు ప్రకటించింది. హసన్ నుంచి 2019 ఎన్నికల్లో ప్రజ్వల్ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారంటూ నియోజకవర్గానికి చెందిన జి.దేవరాజెగౌడ అనే ఓటరుతోపాటు అప్పటి ఎన్నికల్లో ప్రజ్వల్ చేతిలో ఓటమి పాలైన బీజేపీ అభ్యర్థి ఎ.మంజునాథ్ వేసిన పిటిషన్లపై జస్టిస్ కె.నటరాజన్ విచారణ జరిపారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటంతోపాటు తన ఆస్తుల వివరాలను వెల్లడి చేయలేదంటూ పిటిషనర్లు చేసిన ఆరోపణలు వాస్తవమేనని ధ్రువీకరించారు. ప్రజ్వల్ రేవణ్ణ ఎన్నిక చెల్లదని న్యాయమూర్తి ప్రకటించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు. ప్రజ్వల్ స్థానంలో ఎ.మంజును విజేతగా ప్రకటించాలన్న పిటిషనర్ల వినతిని తోసిపుచ్చారు. మంజు కూడా ఆ ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. కాగా, 2019 ఎన్నికల్లో కర్ణాటకలో జేడీఎస్ నుంచి ప్రజ్వల్ రేవణ్ణ ఒక్కరే లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆయన ప్రధాన ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి ఎ.మంజు జేడీఎస్‌లో చేరి ఎమ్మెల్యే అయ్యారు.

జంట హత్యల కేసు.. మాజీ ఎంపీకి జీవిత ఖైదు

ఇలాంటి కేసును ఇదివరకెన్నడూ చూడలేదన్న సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: 1995లో జరిగిన జంట హత్యల కేసుల్లో లోక్‌సభ మాజీ ఎంపీ ప్రభునాథ్ సింగ్(70)కు సుప్రీం కోర్టు జీవిత ఖైదు విధించింది. రెండు బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. బిహార్ ప్రభుత్వం కూడా బాధితులకు ఇంతే మొత్తం చెల్లించాలని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ సారథ్యంలోని ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఇలాంటి కేసును గతంలో ఎన్నడూ చూడలేదన్న ధర్మాసనం.. ఈ కేసులో నిందితుడు ప్రభునాథ్ సింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ దిగువ కోర్టు, పట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పులను కొట్టివేసింది. సాక్ష్యాలన్నిటినీ మాయం చేసేందుకు ప్రభునాథ్ సింగ్ ప్రయత్నాలు చేశాడని పేర్కొంది. దర్యాప్తు అధికారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవ్యవస్థ తమ విధులను నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమయ్యాయంది. ఇద్దరి హత్యతోపాటు మరో మహిళపై హత్యాయత్నం కేసుల్లో ఆగస్టు 18వ తేదీన ప్రభునాథ్ సింగ్‌ను సుప్రీం కోర్టు దోషిగా నిర్ధారించింది. 1995 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభునాథ్ సింగ్ బిహార్ పీపుల్స్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశాడు. ఓటింగ్ రోజు చప్రాలోని పోలింగ్ స్టేషన్ నుంచి వస్తున్న కొందరు స్థానికులను ఎవరికి ఓటేశారంటూ కారులో వచ్చిన సింగ్ ఆరా తీశాడు. వేరే పార్టీకి ఓటేశామంటూ రాజేంద్ర రాయ్, దరోగా రాయ్ మరికొందరు సమాధానమిచ్చారు. ఆగ్రహంతో సింగ్ తన వద్ద ఉన్న రైఫిల్‌తో వారిపైకి కాల్పులు జరపగా ముగ్గురు గాయపడ్డారు. వీరిలో రాజేంద్ర రాయ్, దరోగా రాయ్ అనంతరం చికిత్స పొందుతూ చనిపోయారు. ఘటనపై చప్రా పోలీస్‌స్టేషన్‌లో 1995 మార్చి 25న కేసు నమోదైంది. 1995లోనే జనతాదళ్ ఎమ్మెల్యే అశోక్ సింగ్ సొంతింట్లో హత్యకు గురైన కేసులో సింగ్ ప్రస్తుతం హజారీబాగ్ జైలులో ఉన్నాడు.

పాక్‌లో ఆత్మాహుతి దాడి.. 9 మంది జవాన్లు మృతి

పెషావర్: పాకిస్తాన్‌లో ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్ బన్ను జిల్లాలో గురువారం జరిగిన ఆత్మాహుతి దాడిలో తొమ్మిదిమంది సైనికులు మృతి చెందారు. నిషేధిత తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ)కి చెందిన ఉగ్రవాది బైక్‌పై వచ్చి భద్రతాబలగాలు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టాడు. భారీ పేలుడు సంభవించడంతో వ్యానులోని 9 మంది మరణించగా మరో అయిదుగురు గాయపడ్డారని సైన్యం తెలిపింది. దాడికి తామే కారణమంటూ టీటీపీ ప్రకటించుకుంది. పలు ఉగ్ర సంస్థలు కలిసి 2017లో టీటీపీగా ఏర్పాటయ్యాయి. అల్ ఖాయిదాతో సంబంధాలున్నట్లు అనుమానాలున్న టీటీపీ ఇటీవల తరచూ దాడులకు తెగబడుతోంది. జనవరిలో పెషావర్‌లోని ఓ మసీదులో జరిగిన ఆత్మాహుతి దాడిలో 101 మంది చనిపోగా మరో 200 మంది గాయపడ్డారు.

నేడే పీఎస్ఎల్‌వీ సీ57 ప్రయోగం

- శుక్రవారం ఉదయం ప్రారంభమైన కౌంట్‌డౌన్
- శనివారం ఉదయం 11.50 గంటలకు ప్రయోగం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సూర్యుడిపై పరిశోధనలే లక్ష్యంగా రూపుదిద్దుకున్న ఆదిత్య–ఎల్1 ఉపగ్రహం ప్రయోగానికి సర్వం సిద్ధమయింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తిరుపతి జిల్లా సతీష్ ధవన్‌స్పేస్ సెంటర్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ సీ57 ఉపగ్రహ వాహకనౌక ఆదిత్య–ఎల్1ను మోసుకెళ్లనుంది. శుక్రవారం ఉదయం 12.10 గంటలకు మొదలైన కౌంట్‌డౌన్ ప్రక్రియ 23.40 గంటలు కొనసాగిన అనంతరం శనివారం ఉదయం 11.50 గంటలకు పీఎస్ఎల్‌వీ సీ57 ప్రయోగాన్ని చేపడతారు. శుక్రవారం ఉదయం షార్‌కు విచ్చేసిన ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ముందుగా శ్రీ చెంగాళమ్మ ఆలయం పూజలు చేసుకున్నారు. కౌంట్‌డౌన్ ప్రక్రియలో భాగంగా ముందుగా రాకెట్‌కు నాలుగో దశలో 2.5 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను చేపట్టారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక రాకెట్‌కు రెండో దశలో 41 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ ప్రయోగంలో సూర్యుడిపై పరిశోధనలకు 1,480.7 కిలోల బరువు కలిగిన ఆదిత్య–ఎల్1 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపుతున్నారు. షార్ నుంచి చేసిన ప్రయోగాల్లో ఇది 92వది. పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో 59వది.

పీఎస్–4 దశతో మరో సరికొత్త పరిశోధన: పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్‌లోని నాలుగో దశ (పీఎస్–4)తో మరో సరికొత్త పరిశోధనకు ఇస్రో శ్రీకారం చుట్టింది. నాలుగో దశతో వివిధ రకాల విన్యాసాలు చేసి 01.03.31 గంటలకు ఆదిత్య–ఎల్1 ఉపగ్రహాన్ని వదిలిపెడుతుంది. గతంలో ఎప్పుడు కూడా ఉపగ్రహాన్ని వదిలిపెట్టేందుకు ఇంత సమయం తీసుకున్న పరిస్థితి లేదు. ముందుగా ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టే కక్ష్య దూరం కూడా ఈసారి కొత్తగానే వుంది. అపోజి అంటే భూమికి దూరంగా 36,500 కిలోమీటర్ల దాకా ఉంటుంది. అలాంటిది కేవలం 19,500 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉపగ్రహాన్ని ప్రవేశపెడుతున్నారు. ఉపగ్రహాన్ని వదిలిపెట్టిన తరువాత రెండు రకాల విన్యాసాలను చేసి కక్ష్య దూరాలను పరిశోధించే పనిని చేపడుతున్నారు. ఎంటీఎస్ పొసిషేషన్ పేరుతో 4042.52 సెకన్లకు ఒకసారి, ఎంఎంహెచ్ పొసిషేషన్ పేరుతో 4382.52 సెకన్లకు ఒకసారి రీస్టార్ట్ చేసి సరికొత్త పరిశోధనలు చేస్తున్నారు.



రోజుకు 1,440 చిత్రాలు

ఆదిత్య–ఎల్1 నిర్దేశిత కక్ష్యలోకి చేరిన వెంటనే అందులో అమర్చిన విజిబుల్ లైన్ కొరోనాగ్రాఫ్(వీఈఎల్‌సీ) పేలోడ్ నిమిషానికి ఒకటి చొప్పున రోజుకు సుమారు 1,440 చిత్రాలను తీసి విశ్లేషణ కోసం గ్రౌండ్ స్టేషన్‌కు పంపుతుందని ప్రాజెక్టు సైంటిస్ట్ అండ్ ఆపరేషన్ మేనేజర్ డాక్టర్ ముత్తు ప్రియాల్ చెప్పారు. ఫిబ్రవరి చివరినాటికి మొదటి చిత్రం అందుతుందని భావిస్తున్నామన్నారు.

రాకెట్ వివరాలు
- పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ పొడవు 44.4 మీటర్లు.
- రాకెట్ ప్రయోగ సమయంలో 321 టన్నుల బరువుంటుంది. నింగికి పయనమైన 01-03-31 (3799.52) నిమిషాల్లో ప్రయోగం పూర్తవుతుంది.
- మొదటి దశలో 139 టన్నుల ఘన ఇంధనం కోర్ అలోన్ దశ, ఈ ప్రయోగానికి రాకెట్ చుట్టూరా ఆరు స్ట్రాపాన్ బూస్టర్లు ఉంటాయి. ఒక్కో బూస్టర్‌లో 12.2 టన్నుల ఘన ఇంధనం నింపుతారు.
- 212.02 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశ 109.40 సెకన్లలో పూర్తవుతుంది.
- 41 టన్నుల ద్రవ ఇంధనాన్ని వినియోగించి 262.38 సెకన్లకు రెండోదశ పూర్తవుతుంది.
- 7.65 టన్నుల ఘన ఇంధనం సాయంతో 581.42 సెకన్లకు మూడో దశను పూర్తిచేస్తారు.
- మళ్లీ నాలుగోదశ (పీఎస్–4) 3127.52 సెకన్లకు స్టార్ట్ చేసి 3599.52 సెకన్లకు కటాఫ్ చేస్తారు.
- శిఖరభాగాన అమర్చిన ఆదిత్య–ఎల్1 ఉపగ్రహాన్ని 3799.52 సెకన్లకు (01.03.31 గంటల వ్యవధి)లో భూమికి దగ్గరగా (పెరిజి) 235 కిలోమీటర్లు, భూమికి దూరంగా (అపోజి) 19,500 కిలోమీటర్ల ఎత్తులోని ఎసింట్రిక్ ఎర్త్ బౌండ్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెడతారు. 175 రోజుల తరువాత సూర్యుడి సమీపంలోని లాంగ్రేజియన్ బిందువు–1 వద్ద ప్రవేశపెట్టి సూర్యుడిపై అధ్యయనం చేస్తారు.

పెళ్లిళ్లు చెల్లనివే అయినా... సంతానానికి సర్వహక్కులు

సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ: చెల్లని వివాహాల ఫలితంగా పుట్టిన వారు సక్రమ సంతానమే అవుతారని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. హిందూ వారసత్వ చట్టం ప్రకారం తల్లిదండ్రుల ఆస్తిపాస్తులపై వారికి అన్ని హక్కులూ ఉంటాయని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకొని జంటకు పుట్టిన పిల్లలకు హిందూ చట్టం ప్రకారం తల్లిదండ్రుల వారసత్వ ఆస్తి మీద అధికారం ఉంటుందా అంటూ దాఖలైన 2011 నాటి పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. 'చెల్లని పెళ్లికి ఫలితంగా పుట్టిన పిల్లలకు అన్ని హక్కులూ దఖలు పడతాయి. హిందూ వివాహ చట్టం సెక్షన్ 16 (2) ప్రకారం సదరు పెళ్లి చెల్లదని కోర్టు తీర్పు ఇవ్వడానికి ముందు కలిగిన సంతానం సక్రమ సంతానమే అవుతుంది' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ విషయంలో కూతుళ్లకు కూడా కొడుకులతో సమానంగా హక్కులు ఉంటాయని వివరించింది. చెల్లని పెళ్లి చేసుకున్న వారికి హిందూ చట్టం ప్రకారం భార్యాభర్తల హోదా రాదు. రద్దు చేయదగ్గ పెళ్లి విషయంలో మాత్రం వారికి ఆ హోదా ఉంటుంది. అలాగే చెల్లని పెళ్లి రద్దుకు ప్రత్యేకంగా కోర్టు ఆదేశాలు అవసరం లేదు. రద్దు చేయదగ్గ పెళ్లి విషయంలో మాత్రం ఆదేశాలు అవసరం.

సింగపూర్ అధ్యక్షుడిగా షణ్ముగరత్నం

సింగపూర్: భారత సంతతికి చెందిన ప్రముఖ ఆర్థికవేత్త థర్మన్ షణ్ముగరత్నం(66) సింగపూర్ అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించారు. దేశంలో 2011 తర్వాత అధ్యక్ష ఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి. షణ్ముగరత్నంపై ఇద్దరు చైనా సంతతి నాయకులు పోటీకి దిగారు. ఆయన ఏకంగా 70.4 శాతం ఓట్లతో ఘన విజయం సాధించారు. షణ్ముగరత్నం సింగపూర్‌లో జన్మించారు. 2001లో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.

క్లుప్తంగా...

చంద్రబాబు అవినీతి బట్టబయలు

మంత్రి జయరాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, కాటసాని

ఆస్పరి (కర్నూలు)/శ్రీకాకుళం పాతబస్టాండ్/ కర్నూలు (సెంట్రల్): చంద్రబాబు అవినీతి బట్టబయలు అయిందని కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి చెప్పారు. ఇంకా బయటకు రావాల్సినవి ఉన్నాయన్నారు. వారు శుక్రవారం వేర్వేరు ప్రాంతాల్లో విలేకరులతో మాట్లాడారు. విచారణ జరిపిస్తే చంద్రబాబు నిప్పో, తుప్పో తేలుతుందన్నారు. చంద్రబాబు తన పాలనలో సబ్ కాంట్రాక్టర్ శ్రీనివాసులు నుంచి రూ.118 కోట్లు తీసుకున్నారని చెప్పారు. అమరావతి తాత్కాలిక భవనాల నిర్మాణ కాంట్రాక్టుల్లో వేలకోట్ల అవినీతి జరిగిందన్నారు. మార్చిలోనే చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులు ఇస్తే ఇంతవరకు ఎందుకు బయట పెట్టలేదని ప్రశ్నించారు. చంద్రబాబుకు దమ్ము, ధైర్యం ఉంటే పూర్తిస్థాయి విచారణ కోరాలన్నారు. త్వరలోనే చంద్రబాబు జైలుకు వెళ్లడం ఖాయమని పేర్కొన్నారు.

రూ.4.73 కోట్ల ఎరువులు, పురుగు మందులు సీజ్

జే.పంగులూరు: బాపట్ల జిల్లా జే పంగులూరు మండల పరిధిలోని ముప్పవరంలో అనుమతులు లేకుండా తయారు చేస్తున్న రూ.4.73 కోట్ల విలువైన 2.1188 టన్నుల ఎరువులు, పురుగు మందులను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. గుంటూరు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కే ఈశ్వరరావు, విజిలెన్స్ ఏవో వాసంతి, సీఐ శ్రీనివాసరెడ్డి తమ సిబ్బందితో శుక్రవారం ముప్పవరంలోని గోడౌన్‌పై దాడి చేశారు. ఇంకొల్లుకు చెందిన వేటూరి వెంకటేశ్వర్లు విజయ దుర్గ పాస్ఫేట్ ఫర్టిలైజర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీని ప్రారంభించారు. ఇక్కడ అనుమతులు లేకుండా ఎరువులు, పురుగు మందులు తయారు చేస్తున్నాడు. యజమాని కొష్టంలో ప్రభుత్వం నుంచి సబ్సిడీ కింద వచ్చే 26 ఖాళీ యూరియా బస్తాలను, గోడౌన్‌ను సీజ్ చేశారు. యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.

రైతులను నట్టేట ముంచిన చంద్రబాబు

రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో భూములిచ్చిన రైతులను నట్టేట ముంచి అమరావతి పేరుతో రూ.లక్షల కోట్లు కొల్లగొట్టిన చంద్రబాబుకు పుట్టగతులుండవని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,069వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు.

పాదయాత్రలో లోకేశ్ అత్యుత్సాహం

- లోకేశ్ సైగ చేయడంతో సీఎం ఫ్లెక్సీని చింపేసిన యువగళం సభ్యుడు

నల్లజర్ల : తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలో శుక్రవారం ప్రారంభమైన లోకేశ్ పాదయాత్ర పలు గ్రామాల్లో ఉద్రిక్తతలకు దారితీసింది. పోతవరంలో ప్రారంభమైన పాదయాత్ర కవులూరు, చీపురుగూడెం, తిమ్మన్నపాలెంలలో జరిగింది. తిమ్మన్నపాలెం జంక్షన్‌లో సీఎం ఫ్లెక్సీని చూసిన లోకేశ్.. యువగళం సభ్యుడికి సైగ చేయడంతో ఆ వ్యక్తి సీఎం ఫ్లెక్సీని మూడొంతులకుపైగా చింపేశాడు. విషయం తెలియడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఫ్లెక్సీ చింపిన వ్యక్తిపై కేసు నమోదు చేస్తామని అడిషనల్ ఎస్పీ రజనీ, డీఎస్పీ వర్మ తదితరులు హామీ ఇచ్చారు. వెంటనే అదే ప్రదేశంలో కొత్త ఫ్లెక్సీ ఏర్పాటు చేయించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనంతో ఉన్నా పలుమార్లు టీడీపీ కార్యకర్తలు రెచ్చగొట్టే చర్యలకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం శాంతించిన కార్యకర్తలు సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. సాయంత్రం పాదయాత్ర నల్లజర్ల జంక్షన్‌కు వచ్చేసరికి సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్ ఇంటి ముందు నిలబడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై యువగళం సభ్యుడు పిడిగుద్దులు గుద్దాడు. దీనిపై కార్యకర్తలు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు.

అయ్యన్నకు నోటీసులు

దొండపర్తి(విశాఖ దక్షిణ)/నక్కపల్లి (అనకాపల్లి జిల్లా) : మాజీ మంత్రి, టీడీపీ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడుకు శుక్రవారం కృష్ణా జిల్లా పోలీసులు నోటీసులు జారీ చేశారు. నారా లోకేశ్ గన్నవరంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్‌పై అయ్యన్నపాత్రుడు వివాదాస్పద, అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై కృష్ణా జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ విషయం తెలుసుకున్న అయ్యన్న అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అయితే శుక్రవారం ఢిల్లీ నుంచి విశాఖ విమానాశ్రయానికి వస్తున్నట్టు తెలుసుకున్న కృష్ణా జిల్లా పోలీసులు.. విశాఖలో కాపు కాశారు. అయ్యన్నపాత్రుడు ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చిన తర్వాత.. తమతో పాటు తీసుకెళ్లి అనకాపల్లి జిల్లా వేంపాడు టోల్‌గేట్ వద్ద 41(ఏ) నోటీసు ఇచ్చి పంపేశారు. అనంతరం అయ్యన్న మీడియాతో మాట్లాడుతూ పోలీసు కేసులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. వివరణ ఇచ్చేందుకు 10 రోజుల్లో గన్నవరం రావాలని పోలీసులు కోరినట్టు తెలిపారు.

కోతల కథలు మీ బాబు కోసమేగా రామోజీ..

దక్షిణాది అంతటా తీవ్ర విద్యుత్ కొరత

కొనుగోలుకు ఎంత వెచ్చించేందుకైనా సర్కారు సిద్ధం

సాక్షి, అమరావతి : ఆగస్టు నెలలో గత వందేళ్లలో కనీవినీ ఎరుగని ప్రతికూల పరిస్థితులు ఉత్పన్నమై కొనాలన్నా విద్యుత్ దొరకని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు చాలా అరుదుగా తలెత్తుతుంటాయని భారత వాతావరణ శాఖ స్వయంగా ప్రకటించింది. అయినా, రాష్ట్ర లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్‌ఎల్‌డీసీ), విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు ప్రణాళికాబద్ధంగా, ముందుచూపుతో వ్యవహరించడం ద్వారా పీక్‌లోడ్ సమయంలో సైతం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కనీస స్థాయికి తగ్గించగలిగాయి. వాస్తవం ఇది కాగా.. నిరంతరం కోతలు విధించినట్లుగా ప్రజలను తప్పుదోవ పట్టించేలా 'వైకాపా విద్యుత్ కోతల పథకం' శీర్షికతో శుక్రవారం ఈనాడు తప్పుడు కథనాన్ని అచ్చేసింది. దేశవ్యాప్తంగా నెలకొన్న విద్యుత్ కొరత పరిస్థితులు, ఇందుకు కారణాలను వివరిస్తూ ప్రజలను చైతన్యపర్చాల్సిందిపోయి బాధ్యతారాహిత్యంగా.. వరుసగా అసత్య కథనాలను ఈనాడు అడ్డగోలుగా వండి వారుస్తోంది. అదనపు ఛార్జీల భారాన్ని తగ్గించుకోవడానికే కోతల పథకం ప్రవేశపెట్టిందంటూ ప్రభుత్వంపై బురదజల్లుతోంది. విద్యుత్ పంపిణీ సంస్థలు నెలవారీ సాధారణ ప్రణాళిక ప్రకారం వివిధ విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ కొనుగోలుకు అంచనాలు తయారుచేసుకుంటాయి. విద్యుత్ కేంద్రాలు డిస్పాచ్ ప్రణాళికను సాధారణంగా ఒక నెల ముందుగానే సిద్ధంచేసుకుంటాయి. ఈ అంచనాలతోనే జల, పవన, థర్మల్, సౌర విద్యుత్ కేంద్రాలు విద్యుత్ లభ్యతను పొందుపరుస్తాయి. ఇవేవీ పట్టించుకోకుండా కేవలం చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమే రామోజీ దిగజారుతున్నారని ఈనాడు కథనం స్పష్టంచేస్తోంది.

ఎందుకిలా రామోజీ





దారుణంగా పడిపోయిన జల, పవన విద్యుదుత్పత్తి..

ప్రతికూల వాతావరణంతో జల, పవన విద్యుత్ ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. శ్రీశైలం జల విద్యుత్ కేంద్రం నుంచి ఈ ఏడాది ఆగస్టులో ఒక్క యూనిట్ విద్యుత్ కూడా ఉత్పత్తి కాకపోవడం ఇందుకు నిదర్శనం. గత ఏడాది ఆగస్టులో జలవిద్యుత్ ఉత్పత్తి 680 మిలియన్ యూనిట్లు కాగా.. ఈ ఏడాది ఇదే నెలలో 208 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి పడిపోయింది. పవన విద్యుదుత్పత్తి ఒక్కోసారి 2,500 మెగావాట్ల నుంచి 150–200 మెగావాట్లకు దారుణంగా తగ్గిపోయింది. మరోవైపు.. మండు వేసవిని మరిపించేలా రాష్ట్రంలో తీవ్రమైన ఎండ, ఉక్కపోత పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనివల్ల గృహావసరాల రంగంతోపాటు అన్ని రంగాల్లో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిపోయింది. వర్షపాత లేమివల్ల కాలువలు చెరువులు నిండక రైతులు కూడా సాగునీటి కోసం ఈ నెలలో విద్యుత్ పంపుసెట్లపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఆగస్టులో కనీస స్థాయికి చేరాల్సిన వ్యవసాయ విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. దానివల్ల గ్రిడ్ మీద తీవ్ర ఒత్తిడి పడింది.

ఒక్కసారిగా విద్యుదుత్పత్తి పెరుగుతుందా?

ఇలా అనూహ్య వాతావరణ పరిస్థితులతో విద్యుత్ డిమాండ్ ఒక్కసారిగా పెరిగినట్లు ఉత్పత్తి పెంచడం వీలుకాదు. అందువల్ల కొనాలన్నా విద్యుత్ దొరకని పరిస్థితి కొంత అనివార్యమవుతుంది. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడానికి ఎంత ఖర్చయినా వెనుకాడకుండా బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయడానికి విద్యుత్ పంపిణీ సంస్థలకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అన్ని అనుమతులిచ్చింది. అయితే, దేశవ్యాప్తంగా ఏర్పడిన ప్రతికూల పరిస్థితులవల్ల బహిరంగ మార్కెట్‌లోనూ, విద్యుత్ ఎక్స్ఛేంజీల్లోను స్వల్పకాలిక, అత్యవసర విద్యుత్ సమయాల్లో కొనుగోలుకు తగినంత విద్యుత్ అందుబాటులో లేదు. పైగా దేశవ్యాప్తంగా బొగ్గు కొరత వేధిస్తోంది. బిడ్డింగ్ పరిమాణంలో కేవలం 5–10 శాతం మాత్రమే విద్యుత్ లభిస్తోంది. టైం బ్లాక్‌కు 2 వేల మెగావాట్లకు ఆన్‌లైన్‌లో బిడ్ వేస్తుంటే కేవలం 100 నుండి 200 మెగావాట్ల విద్యుత్ మాత్రమే దొరుకుతోంది. ఇది కూడా సీలింగ్ ధర యూనిట్‌కు రూ.10 వద్ద లభిస్తోంది. సెంట్రల్ గ్రిడ్ నుంచి ఓవర్ డ్రా చేయాలన్నా మనకు 250 మెగావాట్లకు మించి చేసేందుకు అనుమతిలేదు. ఒక్కోసారి ఆ గరిష్ట పరిమాణం దాటి కూడా ఓవర్ డ్రా చేస్తున్నాం. ఇందుకోసం అధిక ధర, జరిమానా కూడా చెల్లించాల్సి వస్తోంది.

అక్కడలా.. ఇక్కడిలా ఏంటి రామోజీ!?

విద్యుత్ కోతలపై రామోజీ రాతలు కేవలం డ్రామాలని, తాను భుజానికెత్తుకుని మోస్తున్న వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని నిరూపించుకున్నారు. 'వైకాపా విద్యుత్ కోతల పథకం' అంటూ శుక్రవారం ఈనాడు ఆంధ్రప్రదేశ్ ఎడిషన్‌లో రాస్తే, ఇదే విద్యుత్ కోతలపై రెండ్రోజుల క్రితం అంటే ఆగస్టు 30న 'వర్షాలు లేక.. కరెంటు కాక' శీర్షికతో తెలంగాణ ఎడిషన్‌లో కథనాన్ని ప్రచురించింది. జల విద్యుత్ ఉత్పత్తి లేక కోట్లలో నష్టం అని.. ఇంధన ఎక్స్ఛేంజీల్లో కొందామన్నా కరెంటు దొరకడంలేదని విద్యుత్ కోతలకు కారణాలను తెలంగాణలో రాసుకొచ్చింది. దేశవ్యాప్తంగా భారీగా విద్యుత్ డిమాండ్ పెరిగిందని ఆ కథనంలో చెప్పిన ఈనాడు.. ఏపీకి వచ్చేసరికి ప్లేటు మార్చింది. వాస్తవాలను దాచిపెట్టి, రాష్ట్ర ప్రభుత్వమే ఈ పరిస్థితులకు కారణమన్నట్లు అసత్య కథనాన్ని ముద్రించింది. దేశ వ్యాప్తంగా ఉన్న పరిస్థితులే తెలంగాణ, ఏపీలోనూ ఉంటాయనే విషయాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరించడం గమనార్హం.

గత ఏడేళ్లుగా ఆగస్టు నెలలో రాష్ట్రవ్యాప్త గ్రిడ్ విద్యుత్ వినియోగం..

ఏడాది	గ్రిడ్ వినియోగం (మి. యూ)	పెరుగుదల శాతం
2017	149.654	----
2018	166.240	11.00
2019	166.863	0.37
2020	163.136	- 2.23
2021	178.558	9.45
2022	196.248	- 0.15
2023	231.125	17.77

వివిధ రాష్ట్రాల్లో ఆగస్టులో విద్యుత్ కొరత (మిలియన్ యూనిట్లలో)..

రాజస్థాన్	114
ఉత్తరప్రదేశ్	112
మహారాష్ట్ర	106
హరియాణ	89
కర్ణాటక	67
బిహార్	60
జార్ఖండ్	50
ఆంధ్రప్రదేశ్	39
అసోం	32
తమిళనాడు	29
ఛత్తీస్‌గఢ్	20

గత ఐదు నెలల కాలంలో బహిరంగ మార్కెట్ నుండి కొన్న విద్యుత్..

నెల	పరిమాణం (మి.యూ)	యూనిట్ ధర (రూపాయల్లో)	వ్యయం (రూ.కోట్లలో)
ఏప్రిల్	616.90	8.01	493.95
మే	614.00	7.01	430.41
జూన్	524.59	6.60	346.28
జూలై	330.00	5.99	197.57
ఆగష్టు	1344.06	7.319	983.73



దక్షిణ భారతదేశమంతా ఇదే పరిస్థితి..

నిజానికి.. ఆగస్టులో దక్షిణ భారతదేశమంతా విద్యుత్ సరఫరా పరిస్థితి ఇబ్బందికరంగానే ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆగస్టులో విద్యుత్ పంపిణీ సంస్థలు దాదాపు రూ.1,000 కోట్లు ఖర్చుచేసి సరాసరి 1,360 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను అత్యవసరంగా స్వల్పకాలిక ఎక్స్ఛేంజీల నుంచి కొరతను అధిగమించడానికి కొనుగోలు చేశాయి. మిగిలిన స్వల్ప పరిమాణం 3–5 మిలియన్ యూనిట్లు కూడా కొనడానికి సిద్ధపడినా మనకు అవసరం వచ్చినపుడు మార్కెట్‌లో తగినంత విద్యుత్ అందుబాటులో లేకపోవడంవల్ల కొరత ఏర్పడింది. అత్యవసర లోడ్ రిలీఫ్ పరిస్థితి ఈ ఏడాదంతా లేదు. అత్యవసర విద్యుత్ కొనుగోలు కోసం ఎంత ఖర్చయినా వెనుకాడవద్దని, ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్ సంస్థలకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది.

అయినా.. ఒక్కోసారి ఓవర్ డ్రాలు నియమాలకు మించి పెరిగిపోతుంటే గ్రిడ్ భద్రత రీత్యా ఆటోమాటిక్ లోడ్ రిలీఫ్ వ్యవస్థ ఆక్టివేట్ కావడంతో అక్కడక్కడా విద్యుత్ సరఫరాలో స్వల్పంగా అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఈ ఆటోమాటిక్ వ్యవస్థ ఆక్టివేట్ కాగానే వెంటనే పరిస్థితులు చక్కదిద్ది రాష్ట్రమంతా లోడ్‌ను అందుబాటులో ఉన్న ఉత్పత్తితో సమన్వయం చేసి గ్రిడ్ వైఫల్యం చెందకుండా అత్యవసర చర్యలు తీసుకుంటున్నారు. గ్రిడ్‌లో సర్దుబాటు కోసం అప్పుడప్పుడూ ఇస్తున్న అత్యవసర లోడ్ రిలీఫ్‌లు రోజువారీగా సరఫరా చేస్తున్న మొత్తం విద్యుత్ పరిమాణంలో 2.5 శాతం కూడా లేదు.

బాబూ! ఆ డబ్బెక్కడిది?

- రూ.118 కోట్లనూ అక్రమ ఆదాయంగా పరిగణిస్తే తప్పేంటి?
- టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఐటీ శాఖ నోటీసులు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు చేతికి ముట్టిన రూ.118 కోట్ల అక్రమ ధనం గురించి ఆదాయపు పన్ను శాఖ ప్రశ్నించింది. ఐటీ రిటర్నుల్లో చూపని ఈ రూ.118 కోట్లనూ అక్రమ ఆదాయంగా ఎందుకు పరిగణించకూడదో చెప్పాలంటూ నోటీసులు జారీ చేసింది. ఆగస్టు 4వ తేదీన ఈ నోటీసులు జారీ చేసినట్లు ప్రముఖ జాతీయ ఇంగ్లిష్ దినపత్రిక 'హిందుస్థాన్ టైమ్స్' శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది. ఇన్‌ఫ్రా కంపెనీల నుంచి ముడుపుల రూపంలో తీసుకున్న రూ.118 కోట్లను లెక్క చూపని ఆదాయంగా పరిగణిస్తూ... చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ ఆగస్టు 4న చంద్రబాబుకు జారీ చేసిన ఈ షోకాజ్ నోటీసులపై ఆ పత్రిక సమగ్ర కథనాన్ని ప్రచురించింది. ఆ పత్రిక ప్రచురించిన కథనం మేరకు వివరాలివీ...

మనోజ్ వాసుదేవ్ సోదాల్లో విషయం వెలుగులోకి...

మనోజ్ వాసుదేవ్‌పార్థసాని 2017 నుంచీ షాపూర్జీ పల్లోంజీ సంస్థ పాల్గొనే టెండర్ల ప్రక్రియలో చురుగ్గా ఉంటున్నారు. ఆ సంస్థ తరఫున ఈయనే మధ్యవర్తిగా వ్యవహారాలు నడిపేవారు. ఈయనకు చెందిన మనోజ్ పార్థసాని అసోసియేట్స్ కార్యాలయంలో 2019లో ఐటీ శాఖ అధికారులు జరిపిన సోదాలతో చంద్రబాబు నాయుడు గుట్టుగా సాగించిన అవినీతి బయటపడింది. బోగస్ కాంట్రాక్టులు, వర్క్ ఆర్డర్ల పేరుతో షాపూర్జీ పల్లోంజీ నుంచి భారీ ఎత్తున నగదును తరలించినట్లు మనోజ్ వాసుదేవ్ అంగీకరించారని కూడా గతంలో ఐటీశాఖ తన నివేదికలో వెల్లడించింది. సోదాల సమయంలో కొన్ని మెసేజ్‌లు, వాట్సాప్ చాటింగ్స్, ఎక్సెల్ షీట్లను మనోజ్ వాసుదేవ్ నుంచి స్వాధీనం చేసుకున్నామని, అందులో కొన్ని ప్రముఖ నిర్మాణ రంగ కంపెనీల నుంచి నగదును అక్రమంగా తరలించి 'మీకు చేరుస్తున్నాం' అని చంద్రబాబును ఉద్దేశించి పేర్కొన్నట్లు ఐటీ శాఖ వివరించింది. ఆ నోటీసుల ప్రకారం మనోజ్ పార్థసాని చంద్రబాబు నాయుడుకి చెందిన వ్యక్తిగత కార్యదర్శి పి.శ్రీనివాస్‌తో 2016 నుంచీ సంబంధాలను కొనసాగిస్తూ వస్తున్నారు. అంతేకాకుండా చంద్రబాబు నాయుడికి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని శ్రీనివాస్ తనను అడిగినట్లు కూడా మనోజ్ వాసుదేవ్ అప్పట్లో వెల్లడించారని ఐటీ పేర్కొంది. అయితే షాపూర్జీ పల్లోంజీ సంస్థ బడా కార్పొరేట్ కంపెనీ కనక... డబ్బును తరలించడానికి వారంతా కలిసి ఓ తెలివైన మార్గాన్ని ఎంచుకున్నారు. వాస్తవంగా ఎటువంటి పనులు చేయకుండానే షాపూర్జీ పల్లోంజీ నుంచి వివిధ ప్రాజెక్టులు చేసినట్లుగా షెల్ కంపెనీల ద్వారా నకిలీ బిల్లులు పెట్టి ఆయా కంపెనీలకు నగదును తరలించారు. ఈ విషయాన్ని 2019 నవంబరు 1న ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో కూడా మనోజ్ పార్థసాని తెలియజేశారు. కేవలం షాపూర్జీ పల్లోంజీయే కాకుండా ఎల్‌అండ్‌టీ వంటి ఇన్‌ఫ్రా కంపెనీల నుంచి ఫోనిక్స్ ఇన్‌ఫ్రా, పోర్ ట్రేడింగ్ వంటి షెల్ కంపెనీలకు నకిలీ బిల్లుల ఆధారంగా నగదును తరలించినట్లు ఐటీ శాఖకు అర్థమయింది. ఈ విషయాలన్నీ వివరిస్తూ ఆ డబ్బుకు లెక్కలు చెప్పాలని, అవి ఎలా వచ్చాయో తెలియజేయాలని బాబుకు ఐటీ శాఖ నోటీసులిచ్చింది. శ్రీనివాస్ నుంచి చంద్రబాబు నాయుడుకు నగదు చేరినట్లుగా ధ్రువీకరించే ఆధారాలను, నేరాన్ని ధ్రువపరిచే వివిధ సందేశాలు, చాట్‌లు, ఇంకా ఎక్సెల్ షీట్‌లను సైతం సెర్చ్ ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకున్నట్లు డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. ఈ సాక్ష్యాలను మనోజ్ వాసుదేవ్‌కు చూపించి విచారించగా ఇన్‌ఫ్రా కంపెనీల నుంచి బోగస్ కాంట్రాక్టుల ద్వారా నగదును ఎలా తరలించారన్న విధానాన్ని మొత్తం వివరించినట్లు ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ బోగస్ కంపెనీల ద్వారా తరలించిన నగదు ద్వారా అంతిమంగా లబ్ధి పొందింది చంద్రబాబేనని ఐటీ శాఖ పేర్కొంది. మనోజ్ వాసుదేవ్ ద్వారా సబ్‌కాంట్రాక్టుల ద్వారా అందుకున్న రూ.118,98,13,207 మొత్తాన్ని 2020–21లో వచ్చిన అక్రమ ఆదాయంగా ఎందుకు పరిగణించకూడదో చెప్పాలని నోటీసులో పేర్కొంది.

అమిత్ షాను బాబు కలవటంపై అనుమానాలు!!

2024 ఎన్నికల్లో బీజేపీతో ఎలాగైనా పొత్తు పెట్టుకోవాలని ఢిల్లీ స్థాయిలో చంద్రబాబు నాయుడు ప్రతి ఒక్కరినీ ప్రాధేయపడుతూ నానా తంటాలూ పడుతున్న వేళ ఈ నోటీసులు రావటంపై 'హిందుస్థాన్ టైమ్స్' పత్రిక అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ ఏడాది జూన్‌లో చంద్రబాబు నాయుడు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సమావేశం కావటాన్ని కూడా హిందుస్థాన్ టైమ్స్ పత్రిక ప్రస్తావించింది. ఈ నోటీసుల విషయమై తాము అటు చంద్రబాబు నాయుడిని, ఇటు కేంద్ర కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు, కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖలను ఈ మెయిల్ ద్వారా సంప్రదించామని, ఎవ్వరూ స్పందించలేదని కూడా పత్రిక వెల్లడించింది.

లెక్క తేలని మొత్తం రూ.2,000 కోట్లు

అమరావతిలో రాజధాని పేరిట తాత్కాలిక భవనాలను నిర్మించిన చంద్రబాబు... అందులో భారీ కుంభకోణానికి తెగబడినట్లు తాజా ఐటీ నోటీసులతో మరోసారి బట్టబయలైంది. తాత్కాలిక నిర్మాణాల పేరుతో పనుల అంచనా విలువలను భారీగా పెంచేసి అడ్డగోలుగా దోపిడీ చేసిన వైనాన్ని అప్పట్లోనే 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. తాత్కాలిక సచివాలయాన్ని రూ.181 కోట్లతో పూర్తి చేయాలని తొలుత అంచనా వేసుకుంటే దాన్ని పెంచుకుంటూ రూ.1,151 కోట్లు ఖర్చు చేశారంటే... అంచనాలు ఎన్ని రెట్లు పెంచారో, అడ్డగోలు దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో తేలిగ్గానే అర్థమవుతుంది. 2020, ఫిబ్రవరి నెలలో చంద్రబాబు నాయుడు వ్యక్తిగత కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్‌పై ఐటీ శాఖ అధికారులు దాడులు చేసి రూ.2,000 కోట్ల వరకు లెక్క చూపని ఆదాయానికి సంబంధించిన లావాదేవీలు బయటకు తీసిన విషయాన్ని ఐటీ శాఖ జారీ చేసిన నోటీసులతో సహా అప్పట్లోనే 'సాక్షి' ప్రముఖంగా ప్రచురించింది. ఒకే కంప్యూటర్ నుంచి ఆయా సంస్థలకు చెందిన బిల్లుల చెల్లింపులు, ఐటీ రిటర్నులు దాఖలు చేశారు. చంద్రబాబు కొండంత అవినీతి చేస్తే మచ్చుకు రూ.2,000 కోట్లు మాత్రమే బయటకు వచ్చాయని, మరింత లోతుగా దర్యాప్తు చేస్తే మరిన్ని భారీ మొత్తాలు వెలుగులోకి వస్తాయని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

అడ్డగోలు వాదన... బాబుకు అలవాటే!!

చంద్రబాబు నాయుడికైనా, రామోజీరావుకైనా అడ్డంగా వాదించటం పెన్నుతో పెట్టిన విద్య. ఎందుకంటే వీళ్లను ఎవరైనా 'మీరు ఈ నేరం చేశారా?' అని అడిగితే... తాము చేస్తే చేశామనో, లేకపోతే చేయలేదనో వీళ్లు నేరుగా చెప్పరు. చేసిన నేరాన్ని తప్పించుకోవటానికి ముందుగా ఎదుటి వ్యక్తికి తమను అడిగే అర్హత లేదనో, లేకపోతే తమకు ఆ చట్టం వర్తించదనో, లేకపోతే ఫలానా చట్టం ప్రకారం తమను ప్రశ్నించజాలరనో ఎదురు తిరుగుతారు. అలా... కేసును దశాబ్దాల పాటు సాగదీస్తారు. పైపెచ్చు తమపై ఎలాంటి కేసులూ రుజువు కాలేదని, తాము శుద్ధపూసలమని చెబుతుంటారు. అసలు విచారణ జరగనిస్తే కదా... వీళ్లు తప్పు చేశారో లేదో తేలటానికి!!. ఇదే రీతిలో ఐటీ శాఖ నోటీసులకు కూడా చంద్రబాబు నాయుడు విచిత్రమైన సమాధానమిచ్చారు. సోదాల్లో చంద్రబాబు నాయుడి పాత్రను బయటపెట్టే ఆధారాలు లభించటంతో... నేరుగా ఆయన ఖాతాల్లోకి ఎంత ముడుపులు వెళ్లాయనే విషయమై ఒక అంచనాకు వచ్చి... అది ఎలా వచ్చిందో చెప్పాలంటూ నోటీసులు జారీ చేసింది. చంద్రబాబు దానికి నేరుగా సమాధానమివ్వకుండా... తనకు నోటీసులిచ్చే అధికారం సదరు సెంట్రల్ సర్కిల్ అధికారికి లేదంటూ జవాబిచ్చారు. దాన్ని పరిశీలించిన ఐటీ శాఖ... సెక్షన్లను ఉటంకిస్తూ సదరు కేసును ఆ అధికార పరిధి ఉన్న డిప్యూటీ కమిషనర్‌కు బదిలీ చేస్తూ... డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని మరోసారి నోటీసులు జారీ చేసింది. దీన్ని అక్రమ ఆదాయంగా పేర్కొంటూ చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పాలని ఆగస్టు 4న జారీ చేసిన నోటీసుల్లో ప్రశ్నించింది.

నిజాయితీ ఉంటే ఐటీ నోటీసులపై నోరు విప్పాలి

- చంద్రబాబుకు మాజీ మంత్రి పేర్ని నాని సవాలు
- నీకు ఆదాయ పన్ను శాఖ నోటీసులు ఇచ్చిందా? లేదా?
- హిందూస్తాన్ టైమ్స్‌లో వచ్చిన వార్త నిజమా? కాదా?
- బాబు అవినీతిని ఆ పత్రిక బయటపెట్టింది
- రాజధాని పేరుతో బాబు డబ్బు కాజేశారు
- ఆ వార్తే కనిపించనట్లు పచ్చ మీడియా వ్యవహరిస్తోంది
- చంద్రబాబు తప్పు లేకపోతే నిలదీయొచ్చు కదా?
- ఇప్పుడు దొరికింది కేవలం రూ.118 కోట్లు మాత్రమే
- మళ్లీ ఇప్పుడు అధికారం కోసం వెంపర్లాట
- ఎన్టీఆర్ ఆత్మ చంద్రబాబును వెంటాడుతుంది

సాక్షి, అమరావతి: చంద్రబాబు అవినీతిని హిందూస్తాన్ టైమ్స్ పత్రిక బట్టబయలు చేసిందని, ఆయనకు దమ్ము, నిజాయితీ ఉంటే ఆ పత్రిక కథనంపై నోరు విప్పాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) డిమాండ్ చేశారు. అమరావతి పేరుతో చంద్రబాబు డబ్బులు కొట్టేసింది నిజమా? కాదా? అని నిలదీశారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఆదాయ పన్ను శాఖ నోటీసులు ఇచ్చిందో లేదో చంద్రబాబు చెప్పాలన్నారు.



'వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుని ఎన్టీఆర్ ఆత్మ వెంటాడుతుంది. ఆయన పైనుంచి రాజకీయాల్లో బాబుకు కుక్క చావు చూపిస్తున్నారు. వైఎస్ జగన్‌కి అండదండలు ఇస్తున్నారు. విధి ఎవరినీ వదిలిపెట్టదు. ఇవాళ సెప్టెంబర్ 1 2023. బాబుకు కలిసి వచ్చినట్లు లేదు. హిందూస్తాన్ టైమ్స్ అనే జాతీయ పత్రిక చంద్రబాబు అవినీతి బాగోతాన్ని బట్టబయలు చేస్తూ పెద్ద వార్తను ప్రచురించింది. తాత్కాలిక రాజధాని నిర్మాణం పేరుతో 2016 నుంచి 2019 వరకు ఎల్ అండ్ టీ, షాపూర్జీ పల్లంజీ కంపెనీలకు చంద్రబాబు కాంట్రాక్టులు ఇచ్చారు. అందులో రూ.118 కోట్ల లంచం సొమ్ము మనోజ్ వాసుదేవ్ పార్థసాని అనే వ్యక్తికి చెందిన సూట్ కేసు కంపెనీ నుంచి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు ప్రైవేట్ సెక్రటరీగా పని చేసిన పి.శ్రీనివాస్ ద్వారా బాబే తీసుకున్నట్లు హిందూస్తాన్ టైమ్స్ వార్తలో ఉంది. 2022 సెప్టెంబరు 28న ఆదాయ పన్ను శాఖ చంద్రబాబుకు నోటీసులు ఇచ్చింది. ఆ నోటీసులపై ఎల్లో మీడియా ఎందుకు స్పందించదు? సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ వెళ్లినప్పుడల్లా తప్పుడు వార్తలు రాసే ఎల్లో మీడియాకు హిందూస్తాన్ టైమ్స్‌లో వచ్చిన కథనం కనిపించదా? వయసు పెద్దదై రామోజీకి ఏమీ కనిపించడం లేదేమో! మా ప్రభుత్వంపై నిత్యం బురద చల్లడం తప్ప. వారాంతపు పలుకులు రాసుకునే బీజీలో రాధాకృష్ణ ఉన్నాడేమో. టీవీ 5కి కూడా ఏమీ తెలియడం లేదేమో. నిజంగా చంద్రబాబులో ఏ తప్పూ లేకపోతే, నోటీసులివ్వడానికి ఎంత సాహసం ఇన్‌కం ట్యాక్స్ వారికి అని ఎందుకు రాయలేకపోయారు? కనీసం టీడీపీ పత్రిక చైతన్య రథంలోనైనా రాయించలేరా' అని నిలదీశారు. 'ఇప్పుడు దొరికింది రూ.118 కోట్లు మాత్రమే. దొరక్కుండా ఇంకా ఎక్కడ, ఎంతెంత తిన్నారో? నాడు జనం సొమ్ము హల్వాలా తినేసిన చంద్రబాబు.. మళ్లీ ఇప్పుడు అధికారం కోసం వెంపర్లాడుతున్నారు. 2014లో ఇచ్చిన గ్యారెంటీలకే దిక్కు లేదు. మళ్లీ ఇప్పుడు భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ కొత్త పాట అందుకున్నారు' అని పేర్ని నాని ఎద్దేవా చేశారు. 'పోతుల సునీతపై హైకోర్టులో కేసు వేసిన లోకేశ్.. ఇప్పుడు హిందూస్తాన్ టైమ్స్‌పై పరువు నష్టం దావా వేస్తారా అని నిలదీశారు. ఇప్పటికే చంద్రబాబు అవినీతిపై ఎన్నో ఫిర్యాదులు వెళ్లాయి. అన్నింటిపై బాబు స్టేలు తెచ్చుకున్నారు. రేపు దీని పైనా స్టే తెచ్చుకుంటారు' అని వ్యాఖ్యానించారు.

'చంద్రబాబు ప్రతి ఏడాది సెప్టెంబరు 1 లేదా 2న ఆస్తులు, అప్పుల చిట్టా ప్రకటిస్తారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 65లో ప్లాట్ నంబర్ 1310 విలువ కేవలం రూ.1.10 లక్షలు మాత్రమే అని చెబుతుంటారు. నగల్లేవ్, వాచ్ కూడా లేదు, కారు లేదు అని కూడా చెప్తారు. ఆయన భార్య భువనేశ్వరికి మాత్రం రూ.2 లక్షల నగలున్నాయని ఆషాఢభూతిలా చెప్తూ ఉంటారు. కేవలం సెప్టెంబర్ 2న రాజశేఖరరెడ్డి వర్ధంతి వార్తలు ఎవరూ చూడకూడదనే ఇలా ఆస్తుల ప్రకటన చేస్తారు' అని విమర్శించారు. షర్మిల ఒక ఇండిపెండెంట్ పొలిటీషియన్ అని, ఆమె నిర్ణయాలు ఆమెకు ఉంటాయని పేర్ని నాని చెప్పారు.

ఆర్థికనేరాల కథనాలపై చంద్రబాబు స్పందన ఏంటి?

- వార్త ప్రచురించిన పత్రికపై కేసు పెట్టడానికి ముందుకొస్తారా?
- ఈ విషయంలో లోకేశ్ వైఖరి తేల్చి చెప్పాలి
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మహారాణిపేట (విశాఖ దక్షిణ): అవినీతి చక్రవర్తి చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు పాల్పడిన ఆర్థికనేరాలు ఒక ఆంగ్లపత్రిక ద్వారా బహిర్గతమయ్యాయని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఇవన్నీ తప్పని, తాను నిజాయితీపరుడినని ఈ కథనాలు రాసిన పత్రికపై కేసు వేయడానికి ముందుకొస్తారా? అని ప్రశ్నించారు. విశాఖపట్నంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేశ్ తల్లిని తాము పల్లెత్తుమాట అనకపోయినా తమపై కేసులు పెట్టడానికి ముందుకొచ్చాడని, ఇప్పుడు తన తండ్రిపై వచ్చిన కథనాలు తప్పని ఆయా పత్రికలపై కేసులు వేయడానికి ముందుకొస్తాడా? లేక తన తండ్రికి తనకు సంబంధం లేదని వదిలేస్తాడా? అని నిలదీశారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు చేసిన ఆర్థికనేరాలన్నీ రుజువులతో సహా బహిర్గతమయ్యాయని చెప్పారు. చంద్రబాబు ముడుపుల వ్యవహారాలు పత్రికల్లో వచ్చాయని, వాటిని ఆయన ఖండించకపోవడాన్ని బట్టి చూస్తే అవన్నీ నిజమేనని స్పష్టమవుతోందని పేర్కొన్నారు. గతంలో తాను అసెంబ్లీలో ఇదే అంశంపై అన్ని ఆధారాలతో సుమారు 45 నిమిషాలు మాట్లాడానని గుర్తుచేశారు. చంద్రబాబు ఆస్తులపై దాడులు నిర్వహించినప్పుడు లెక్కల్లోలేని రూ.2 వేలకోట్లు దొరికినట్లు ఆదాయపన్ను శాఖ ఆధారాలతో సహా బహిర్గతం చేసిందని తెలిపారు.



2016 సంవత్సరానికి ముందు నుంచే చంద్రబాబు కాంట్రాక్టర్ల దగ్గర కిక్ బ్యాక్స్ తీసుకున్న చంద్రబాబు అమరావతి నిర్మాణాల్లో అవినీతి సొమ్మును డొల్ల కంపెనీలకు ఏ విధంగా బదలాయించాడో ఆయన పర్సనల్ సెక్రటరీ ద్వారా ఆదాయపన్ను అధికారులు తెలుసుకున్నారని చెప్పారు. అవినీతి అంటే ఏంటో తనకి తెలియదని, అవినీతి డబ్బు తాను ఎప్పుడూ చూడలేదని చెప్పుకొనే చంద్రబాబు పత్రికల్లో వచ్చిన కథనాలకు ఎందుకు జవాబు చెప్పలేకపోతున్నాడని ప్రశ్నించారు. చంద్రబాబు పూర్తిగా అవినీతి ఊబిలో కూరుకుపోయాడని, తన అవినీతి సామ్రాజ్యం కూలిపోతుందని తెలిసి ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకుంటున్నాడని చెప్పారు. చంద్రబాబు ఎంత ప్రయత్నించినా శేష జీవితంలో శిక్ష అనుభవించాల్సిందేనన్నారు. చంద్రబాబు ఈ జన్మలో చేసిన పాపాలకు శిక్ష ఈ జన్మలోనే అనుభవిస్తాడని పేర్కొన్నారు.

రెండెకరాల నుంచి లక్షల కోట్లకు ఎలా ఎదిగాడో చెప్పాలి

భవిష్యత్తుకి గ్యారెంటీ అంటూ కొత్త నినాదంతో ప్రజల ముందుకు వస్తున్న చంద్రబాబు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క వాగ్దానమైనా నెరవేర్చాడా? అని మంత్రి ప్రశ్నించారు. రైతులను, మహిళలను పూర్తిగా మోసం చేసిన చంద్రబాబును నమ్మవద్దని ప్రజల్ని కోరారు. చంద్రబాబు తన బుర్ర ఉపయోగించి ఒక కొత్త పథకాన్నైనా ప్రకటించగలిగాడా అని ప్రశ్నించారు. రెండెకరాల నుంచి లక్షల కోట్లకు ఎలా ఎదిగారో చంద్రబాబు చెప్పాలన్నారు. చంద్రబాబుకు రాజకీయాల్లోకి రాకముందు ఆస్తులు, ఇప్పుడున్న ఆస్తులు ప్రజలకు తెలుసని చెప్పారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి.. వైఎస్సార్.. ఈ పేరు రాష్ట్ర ప్రజలకు ఓ భరోసా. అన్నదాతలకు అండ. సంక్షేమానికి, అభివృద్ధికి చిరునామా. అర్హతే ప్రామాణికంగా సంతృప్తస్థాయిలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించిన మహనీయుడు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థులను ఉన్నత విద్య చదివించిన విద్యా దాత. ఆరోగ్య శ్రీ పథకంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించిన ప్రాణ దాత. పంట ఎండినా నష్టపోమనే ధీమా రైతులకు కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని పండగలా మార్చిన రైతు బాంధవుడు. జలయజ్ఞం ద్వారా అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన మహా నేత. పారదర్శకమైన పారిశ్రామిక విధానంతో పెట్టుబడులు వరదెత్తేలా చేసి.. ఉపాధి అవకాశాలను పుష్కలంగా కల్పించిన వైఎస్సార్.. మూడు పోర్టులు నిర్మించి ఎగుమతులకు రాష్ట్రాన్ని కేంద్రంగా మార్చారు. ఐటీ ఎగుమతుల్లో 566 శాతం వృద్ధి సాధించారు. ఆర్థిక మాంద్యం ముప్పును ఎలా అధిగమించాలో చాటిచెప్పి, అభివృద్ధికి సరైన నిర్వచనం చెప్పారు. సంక్షేమాభివృద్ధి పథకాలతో తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని జ్ఞాపకంగా నిలిచిన మహానేత వైఎస్సార్ అమలు చేసిన పథకాలనే కేంద్రం, అనేక రాష్ట్రాలు చేపట్టాయి. పరిపాలనలో మానవత్వాన్ని జోడించి నవయుగానికి నాంది పలికిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఐదేళ్ల మూడు నెలలే పని చేశారు. మంచి చేయాలన్న మనసుంటే.. ప్రజలకు ఎంత మేలు చేయవచ్చో ఆ కొద్ది కాలంలోనే చేసి చూపించారు. సమగ్రాభివృద్ధి వైపు రాష్ట్రాన్ని ఎలా పరుగులెత్తించవచ్చో దేశానికే చాటి చెప్పారు. అందుకే ఆ మహానేత భౌతికంగా దూరమై 14 ఏళ్లు దాటిపోయినా, ఇప్పటికీ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

– సాక్షి, అమరావతి

వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో 1949 జూలై 8న వైఎస్ రాజారెడ్డి, జయమ్మ దంపతులకు జన్మించిన వైఎస్ రాజశేఖరరెడ్డి వైద్య విద్యను అభ్యసించారు. పులివెందులలో ఆస్పత్రిని ఏర్పాటు చేసి.. రూపాయికే వైద్యం చేసి రూపాయి డాక్టర్‌గా ప్రజల మన్ననలు పొందారు. డాక్టర్‌గా ప్రజల నాడి తెలిసిన వైఎస్ రాజశేఖరరెడ్డి.. 1978లో రాజకీయ అరంగేట్రం చేసినప్పటి నుంచి 2009 సెప్టెంబరు 2న హెలికాప్టర్ ప్రమాదంలో హఠాన్మరణం చెందే వరకు తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశారు.

నేడు మహానేత
వైఎస్సార్
14వ వర్ధంతి

మహానేత ఒక అడుగు వేస్తే.. నాలుగు అడుగులు ముందుకేస్తున్న సీఎం జగన్

అభివృద్ధికి దిక్సూచి



జీవచ్ఛవంలా మారిన కాంగ్రెస్‌కు పాదయాత్రతో జీవం

అటు కేంద్రంలో.. ఇటు రాష్ట్రంలో వరుస ఓటములతో 2003 నాటికి కాంగ్రెస్ పార్టీ జీవచ్ఛవంలా మారింది. ఆ దశలో రాష్ట్రంలో పాదయాత్ర చేశారు వైఎస్ రాజశేఖరరెడ్డి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి మండుటెండలో 2003 ఏప్రిల్ 9న ప్రజాప్రస్థానం పాదయాత్రను ప్రారంభించారు. 2003 జూన్ 15న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వద్ద ముగించారు. మండుటెండలో 1,475 కిలోమీటర్ల వైఎస్సార్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తన పాదయాత్రతో కాంగ్రెస్‌కు జీవం పోసి 2004లో ఇటు ఉమ్మడి రాష్ట్రంలోను, అటు కేంద్రంలోనూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ, జలయజ్ఞం ప్రాజెక్టులతో, రైతు పథకాలతో వ్యవసాయాన్ని పండగల మార్చి ప్రజారంజక పాలన అంటే ఏమిటో దేశానికి చూపించారు.

పాలకుడంటే ఎలా ఉండాలో చాటిచెప్పిన నేత

పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 2004 మే 14న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వేదికపై నుంచే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా ఫైలుపై తొలి సంతకం చేసి రైతు రాజ్యానికి వైఎస్ రాజశేఖరరెడ్డి పునాది వేశారు. పంటలు పండక విద్యుత్ ఛార్జీలు కట్టలేని రైతులపై టీడీపీ సర్కారు రాక్షసంగా బనాయించిన కేసులను ఒక్క సంతకంతో ఎత్తేయడం ద్వారా పాలకుడంటే ఎలా ఉండాలో చాటిచెప్పారు. రూ.1,100 కోట్ల వ్యవసాయ విద్యుత్ బకాయిలను మాఫీ చేశారు. దాదాపు 35 లక్షలకు పైగా పంపు సెట్లకు ఉచిత విద్యుత్‌ను అందించారు. రూ.400 కోట్లతో మొదలైన వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ ఆ తర్వాతి ఏడాదికి రూ.6 వేల కోట్లకు చేరినా ఉచిత విద్యుత్ హామీ అమలుపై వెనక్కు తగ్గలేదు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తే విద్యుత్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందేనని ఎగతాళి చేసిన నేతలు కూడా అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని కొనసాగించాల్సిన పరిస్థితిని కల్పించారు. వైఎస్సార్ స్ఫూర్తితో దేశంలో అనేక రాష్ట్రాలు వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నాయి. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించారు. పంట ఎండినా రైతు నష్టపోకూడదనే లక్ష్యంతో పంటల బీమాను అమలు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీని అందించారు. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వంతో పోరాడారు. 2004 నుంచి 2009 మధ్య ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.550 నుంచి రూ.1000 వరకు పెరగడమే అందుకు తార్కాణం.

మాంద్యం ముప్పును తప్పించిన ఆర్థికవేత్త

2007–08, 2008–09 సంవత్సరాల్లో ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలను ఆర్థిక మాంద్యం అతలాకుతలం చేసింది. ఆ మాంద్యం ప్రభావం దేశంపైనా పడింది. కానీ.. వైఎస్సార్ దాని ముప్పు ప్రభావం రాష్ట్రంపై పడకుండా చేయగలిగారు. సాగునీటి ప్రాజెక్టులు, పేదల ఇళ్ల నిర్మాణం, రహదారులు వంటి అభివృద్ధి పనులు చేపట్టి మార్కెట్లోకి ధనప్రవాహం కొనసాగేలా చేశారు. వాటి ద్వారా రాష్ట్రానికి పన్నులు వచ్చేలా చేసి.. మాంద్యం ముప్పు నుంచి రాష్ట్రాన్ని కాపాడారు. వైఎస్సార్ ఆర్థిక ప్రణాళికను చూసి అప్పట్లో ఆర్థిక నిపుణులు ప్రశంసించారు.

ఆరోగ్యశ్రీతో ప్రజారోగ్యానికి భరోసా..

2004 మే 14 నుంచి 2007 జూన్ 26 వరకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రూ.168.52 కోట్లను మహానేత వైఎస్సార్ విడుదల చేశారు. ఆ సమయంలో పేదలు పడిన వేదన గమనించారు. జబ్బునపడ్డ పేద కుటుంబాలు ఆ ఆపత్కాలంలో సహాయం కోసం సీఎం కార్యాలయానికి రావాల్సిన ప్రయాసకు స్వస్తి పలుకుతూ ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇది ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చింది. ఈ పథకం పేదలకు అత్యున్నతస్థాయి వైద్యాన్ని అందిస్తూ వేలాది మంది ప్రాణాలను నిలిపింది. ప్రమాదంలో గాయపడిన వారిని, అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారిని తక్షణమే ఆస్పత్రికి తరలించేలా 108 అంబులెన్స్ సర్వీసును ప్రవేశపెట్టారు. గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలను విస్తరిస్తూ 104 సర్వీసులను ప్రారంభించారు. వైఎస్సార్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ, 108, 104 సర్వీసులను ఆ తర్వాత అనేక రాష్ట్రాలు చేపట్టాయి. ఆరోగ్యశ్రీ స్ఫూర్తితోనే కేంద్రం ఆయుష్మాన్ భారత్‌ను చేపట్టింది.

పేదరికానికి విద్యతో విరుగుడు

పేదరికం వల్ల ఏ ఒక్కరూ ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న లక్ష్యంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి రూపకల్పన చేశారు. మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు పేదవాడి సొంతమైతేనే పేదరికం నిర్మూలన సాధ్యమని ఆయన బలంగా నమ్మారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా లక్షలాది మంది నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోన్న ఓసీ విద్యార్థులు ఉన్నత చదువులను అభ్యసించి.. దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. దీనివల్ల లక్షలాది కుటుంబాలు పేదరికం నుంచి బయటపడ్డాయి. ఉన్నత చదువులను అందరికీ అందుబాటులోకి తేవడం కోసం జిల్లాకు ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెంలో ఉద్యాన వర్సిటీని.. తిరుపతిలో పశు వైద్య కళాశాలను నెలకొల్పారు. ప్రతిష్ఠాత్మక జాతీయ విద్యా సంస్థ ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)ని హైదరాబాద్ సమీపంలో కంది వద్ద ఏర్పాటు చేశారు. బాసర, ఇడుపులపాయ, నూజివీడు వద్ద ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉన్నత చదువులు దక్కేలా చేశారు. నిరుపేదలను విద్యావంతులుగా తీర్చిదిద్దే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఆ తర్వాత అనేక రాష్ట్రాలు అమల్లోకి తెచ్చాయి.

పారిశ్రామికాభివృద్ధితో పుష్కలంగా ఉపాధి అవకాశాలు

ఉమ్మడి రాష్ట్రంలో 1995 నుంచి 2004 వరకు పరిపాలించిన చంద్రబాబు రాష్ట్రాన్ని అవినీతికి కేంద్రంగా మార్చారు. దాంతో సుదీర్ఘమైన తీర ప్రాంతం, సమృద్ధిగా సహజవనరులు, పుష్కలంగా మానవ వనరులు అందుబాటులో ఉన్నా పెట్టుబడుల ఆకర్షణలో ఏడో స్థానానికి పరిమితమైంది. వైఎస్సార్ అధికారంలోకి వచ్చాక పారదర్శకమైన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించారు. దాంతో రాష్ట్రంలోకి పెట్టుబడులు వెల్లువెత్తాయి. పెట్టుబడుల ఆకర్షణలో 2004 నుంచి 2009 వరకు రాష్ట్రం అగ్రగామిగా నిలిచింది. భారీ ఎత్తున పరిశ్రమలు ఏర్పాటవడంతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా వచ్చాయి. సుదీర్ఘమైన తీర ప్రాంతాన్ని వినియోగించుకోవడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రచించిన వైఎస్సార్.. యుద్ధప్రాతిపదికన గంగవరం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులు నిర్మించారు. దాంతో ఎగుమతులు భారీ ఎత్తున పెరిగాయి. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి హైదరాబాద్‌ను ప్రపంచ చిత్రపటంలో నిలిపారు. తద్వారా హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమ వేళ్లూనుకునేలా చేశారు. దాంతో ఐటీ ఎగుమతులు 566 శాతం పెరిగాయి.

గెలుపోటముల బాధ్యత తనదేనని చెప్పి..

ఐదేళ్లలో సంక్షేమాభివృద్ధి పథకాలతో జనరంజక పాలన అందించిన మహానేత వైఎస్సార్.. గెలుపోటములకు తనదే బాధ్యత అని 2009 ఎన్నికల్లో ప్రకటించారు. తాను చేసిన అభివృద్ధిని చూసి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ప్రతిపక్షాలు మహా కూటమి కట్టినా వైఎస్సార్ ప్రజా బలం ముందు వెలవెలబోయాయి. 2009 ఎన్నికల్లోనూ మరోసారి రాష్ట్రంలో, కేంద్రంలోనూ ఒంటిచేత్తో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. సంక్షేమాభివృద్ధిలో మహానేత వైఎస్సార్ ఒక అడుగు ముందుకేస్తే.. ఆయన కుమారుడు, సీఎం వైఎస్ జగన్ నాలుగడుగులు ముందుకేస్తూ 51 నెలలుగా రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తున్నారు.

అజేయుడు

1978లో పులివెందుల శాసనసభ స్థానం నుంచి రాజకీయ అరంగేట్రం

విపక్షంలో ఉన్నా.. అధికారం చేపట్టినా ప్రజల కోసమే పోరాడిన యోధుడు

మూడు దశాబ్దాలకుపైగా రాజకీయ జీవితంలో ఓటమే ఎరుగని ధీరుడు

పులివెందుల నియోజకవర్గం నుంచి ఆరుసార్లు శాసనసభకు ఎన్నిక

కడప లోక్‌సభ స్థానం నుంచి 1989 నుంచి వరుసగా నాలుగుసార్లు జయకేతనం

సాక్షి, అమరావతి: సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఓటమే ఎరుగని నాయకులు ప్రపంచంలో అత్యంత అరుదుగా ఉంటారు. అలాంటి నాయకుల్లో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముందువరుసలో నిలుస్తారు. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా ప్రజల సంక్షేమం కోసం ఎందాకైనా పోరాడే ధీశాలికి జనం వెన్నంటి నిలిచి అజేయుడిని చేశారు.

మదిలో పదిలం.. ఎన్నటికీ మరువలేం: వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో వైఎస్ రాజారెడ్డి, వైఎస్ జయమ్మ దంపతులకు 1949, జూలై 8న జన్మించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కర్ణాటకలో గుల్బార్గాలోని ఎమ్మార్ వైద్య కళాశాలలో వైద్య విద్యను పూర్తి చేశారు. పులివెందులలో 1973లో తండ్రి వైఎస్ రాజారెడ్డి పేరుతో 70 పడకల ఆస్పత్రిని ప్రారంభించి.. ప్రజా సేవకు జీవితాన్ని అంకితం చేశారు. రూపాయికే వైద్యం చేస్తూ ప్రజలకు చేరువయ్యారు. తక్కువ సమయంలోనే రూపాయి డాక్టర్‌గా ప్రజల్లో పేరు తెచ్చుకున్నారు. పులివెందుల శాసనసభ స్థానం నుంచి 1978లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజకీయ అరంగేట్రం చేశారు. శాసనసభకు ఎన్నికైన తొలి సారే అంజయ్య మంత్రివర్గంలో స్థానం దక్కించుకుని 1980 నుంచి 83 వరకూ గ్రామీణాభివృద్ధి, విద్య, ఎక్సైజ్ శాఖ మంత్రిగా సమర్థవంతంగా పనిచేశారు.

ఎన్టీఆర్ ప్రభంజనంలోనూ..

సినీనటుడు ఎన్టీఆర్ రాజకీయ అరంగేట్రం చేసి.. టీడీపీని స్థాపించి 1983 ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఎన్టీఆర్ ప్రభంజనంలోనూ పులివెందుల శాసనసభా స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిపై అత్యధిక మెజార్టీతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విజయం సాధించారు. 1985 ఎన్నికల్లోనూ పులివెందుల నుంచి విజయం సాధించడం ద్వారా హ్యాట్రిక్ కొట్టారు. వైఎస్‌తోపాటు 1978లో చంద్రగిరి నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన చంద్రబాబు.. 1983 ఎన్నికల్లో ఎన్టీఆర్‌పైనే పోటీచేసి విజయం సాధిస్తానని బీరాలు పలికారు. కానీ.. ఆ ఎన్నికల్లో చంద్రగిరి నుంచి పోటీ చేసిన చంద్రబాబు ఎన్టీఆర్ గాలిలో కొట్టుకుపోయి టీడీపీ పంచన చేరి.. 1985 ఎన్నికల్లో పోటీ చేయకుండా దూరంగా ఉండిపోయారు. ఆ తర్వాత 1989 ఎన్నికల్లో చంద్రబాబు కుప్పానికి వలస వెళ్లడం గమనార్హం.



వైరిపక్షాలు ఏకమైనా..

రాజీవ్‌గాంధీ సూచన మేరకు 1989 ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసి.. 1.66 లక్షల మెజార్టీతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత 1991లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానం నుంచి 4.18 లక్షల రికార్డు మెజార్టీతో విజయభేరి మోగించారు. ఎన్టీఆర్‌కు 1995లో వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక.. 1996 లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఓడించడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడి.. కాంగ్రెస్‌లో వైఎస్ వైరిపక్షాలతో బాబు కుట్రలు చేశారు. కానీ.. ఆ కుట్రలను చిత్తు చేసి విజయకేతనం ఎగురవేసి, ఎంపీగానూ హ్యాట్రిక్ కొట్టారు. ఆ తర్వాత 1998 ఎన్నికల్లోనూ కడప లోక్‌సభ స్థానం నుంచి ఘనవిజయం సాధించారు.

డబుల్ హ్యాట్రిక్

పులివెందుల శాసనసభ స్థానం నుంచి 1978, 1983, 1985 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించి హ్యాట్రిక్ కొట్టిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. 1999, 2004, 2009 ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధించి రెండోసారి హ్యాట్రిక్ సాధించారు.

జనం మెచ్చిన ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉభయ రాష్ట్రాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన మరణించి 14 ఏళ్లు గడిచినా ఆయన పాలనను ఇప్పటికీ రెండు రాష్ట్రాల ప్రజలు గుర్తు చేసుకుంటున్నారంటే.. ఆయన ఎంత ప్రజారంజకంగా పాలించారో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఓట్ల రాజకీయాలకు వైఎస్సార్ స్వస్తి చెప్పారు.



ఎన్నికల్లోనే రాజకీయాలు తప్ప.. తర్వాత రాజకీయాలకు అతీతంగా ఉండేవారు. ఓటు వేయని వారితోపాటు ప్రజలందరికీ ముఖ్యమంత్రిననే రీతిలో వైఎస్సార్ పాలన సాగించారు. అర్హులైన వారందరికీ పథకాలను సంతృప్త స్థాయిలో అందించారు. ఇతర పార్టీల వారికి పథకాలు ఇస్తున్నారని స్వపక్ష ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసినా.. ప్రజలందరికీ ముఖ్యమంత్రిని గానీ కొందరికే కాదనే సమాధానం వైఎస్సార్ నుంచి వచ్చేది.

– రిటైర్డ్ ఐఏఎస్ ఎంజీవీకే భాను

భవిష్యత్ తరాల మేలు కోసం వేగంగా నిర్ణయాలు తీసుకుని అమలు చేసిన అరుదైన నేత వైఎస్ రాజశేఖరరెడ్డి. ఎన్ని అవాంతరాలు ఎదురైనా గొప్ప ఆలోచనలతో ధైర్యంగా ముందుకు సాగిన రాజనీతిజ్ఞుడు.



హైదరాబాద్‌లో ఔటర్ రింగ్ రోడ్డు ఆయన దార్శనికతకు నిదర్శనం. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వెడల్పు పెంచి రాయలసీమ గొంతు తడిపింది కూడా దివంగత మహానేతే. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి సాయం చేయడంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల్లో వైఎస్సార్‌కు ఎవరూ సాటిరారు. తారతమ్యాలు లేకుండా ఎవరికైనా సాయమందించేవారు.

– విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రభాకర్‌రెడ్డి

పొదుపు వ్యవస్థలో విప్లవం..

వైఎస్ ‘పావలా వడ్డీ’

సాక్షి, అమరావతి: నిరంతరం ప్రజాసంక్షేమం కోసం పరితపించిన మహోన్నత వ్యక్తి ఆలోచనలోంచి రూపుదిద్దుకున్న పథకం దేశంలో పొదుపు వ్యవస్థలో విప్లవం సృష్టించింది. మహిళల ఆర్థికాభివృద్ధికి దన్నుగా నిలిచింది. దేశవ్యాప్తంగా ఈ పథకం అమలుకు దిక్సూచిగా నిలిచింది. అదే పావలా వడ్డీ పథకం. ఆ పథకం రూపకర్త మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో అమలు చేసిన ఈ పథకం తరువాత దేశవ్యాప్తంగా విస్తరించింది. కొన్ని ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ సంస్థలు పేదల నుంచి రోజువారీ వడ్డీలు వసూలు చేసే సమయంలో.. 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన పావలా వడ్డీ పథకం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రస్తుత విభజిత ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మొత్తం పొదుపు సంఘాల్లో మూడోవంతుకుపైగా 2004–08 మధ్య కాలంలో ఏర్పడినవే. దీనికి పావలా వడ్డీ అమలే ప్రధాన కారణం. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడు ఎనిమిది లక్షల వరకు పొదుపు సంఘాలున్నాయి. వీటిలో 2,90,928 సంఘాలు వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న 2004–08 మధ్య ఏర్పడినవే. అదే సమయంలో పావలా వడ్డీ కార్యక్రమంతో అప్పట్లో పెద్దసంఖ్యలో మహిళలు రాష్ట్రంలో పొదుపు సంఘాల్లో చేరారు. దీన్ని గమనించిన కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని దేశమంతా అమలు చేయాలని నిర్ణయించింది.

అభయహస్తంతో భరోసాకి దారి..: పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉండే మహిళల వయసు 60 ఏళ్ల దాటిన తర్వాత వారికి రుణాలిచ్చేందుకు అప్పట్లో చాలా బ్యాంకులు ఆసక్తి చూపేవి కాదు. ఈ నేపథ్యంలో 60 ఏళ్ల వయసు దాటిన పొదుపు సంఘాల మహిళలకు ఆదాయ భద్రత, భరోసా కల్పించేందుకు రాజశేఖరరెడ్డి అప్పట్లో ‘అభయహస్తం’ అనే మరో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు.



నేడు మళ్లీ జగన్ ‘ఆసరా’తో..: చంద్రబాబు హయాంలో మోసపోయిన డ్వాక్రా మహిళలకు ఆసరాగా నిలవాలని 2019లో ముఖ్యమంత్రిగా పదవీ చేపట్టిన వైఎస్ జగన్ నిర్ణయించుకున్నారు. 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి మహిళల పేరిట ఉండే పొదుపు సంఘాల రుణాలు రూ.25,571 కోట్లను ‘వైఎస్సార్ ఆసరా’ పథకం ద్వారా నాలుగు విడతల్లో నేరుగా ఆ మహిళలకు అందజేస్తున్నారు. ఇప్పటికే మూడు విడతల్లో ప్రభుత్వం రూ.19,178 కోట్లు ఈ పథకం కింద చెల్లించింది. దీనికితోడు.. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా గత నాలుగేళ్ల సకాలంలో రుణాలు చెల్లించిన పొదుపు సంఘాల మహిళలకు ఆ వడ్డీ డబ్బులను ఏ ఏడాదికి ఆ ఏడాదే నేరుగా వారికే ప్రభుత్వం అందజేస్తోంది.

రాజన్న రాజ్యంలో రైతన్నే రారాజు



సాక్షి, అమరావతి: వైఎస్సార్ వేసిన ప్రతీ అడుగు, చేసిన ప్రతీ ఆలోచన రైతుల కోసమే. రైతును రాజుగా చూడాలన్న కాంక్షతో అమలుచేసిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు వారి హృదయాలలో చెరగని ముద్రవేశాయి. ఉచిత విద్యుత్ ఫైల్పై తొలి సంతకంతో మొదలైన తన పాలనలో అడుగడుగునా రైతులకు తోడుగా నిలిచారు.

రుణమాఫీతో రైతుకు వెన్నుదన్ను..

కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రుణమాఫీని అమలుచేయగా, దేశంలోనే అత్యధికంగా నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 64లక్షల మంది రూ.11,100 కోట్ల లబ్ధిపొందారు. రుణమాఫీ దక్కని 36 లక్షల మంది రైతులకు ×ప్రోత్సాహం కింద₹ ఒకొక్కరికి రూ.5వేల చొప్పున రూ.1,800 కోట్లు అందించారు. పునరావాస ప్యాకేజీ కింద.. వ్యవసాయ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడిన భూ యజమానులు, కౌలుదారుల కుటుంబాలకు సైతం రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా అందించారు. అలాగే, ఉమ్మడి ఏపీలోని 23 డీసీసీబీల్లో 18 డీసీసీబీలు దివాళ తీసే స్థాయికి చేరుకోగా, వైద్యనాథన్ కమిటి సిఫార్సు మేరకు ఒక్క సంతకంతో రూ.1,800 కోట్ల సాయం అందించి సహకార రంగం పునరుజ్జీవానికి బాటలు వేశారు. ప్రపంచంలోనే తొలిసారి పావలా (3 శాతం) వడ్డీకే రుణాలకు శ్రీకారం చుట్టారు.

కనీస మద్దతు కనీవినీ రీతిలో పెంపు..

1999లో క్వింటాల్‌కు రూ.490 ఉన్న ధాన్యం కనీస మద్దతు ధర 2004లో టీడీపీ అధికారం కోల్పోయే నాటికి రూ.550కు చేరింది. ఐదేళ్లలో పెరిగిన ఎమ్మెస్పీ కేవలం రూ.60 (12.5%) మాత్రమే. అలాంటిది 2004–09 మధ్య రూ.550 నుంచి రూ.1,000కు అంటే అక్షరాల రూ.450 (78.5%) పెరిగిందంటే అది ఆ మహానేత కృషి ఫలితమే. ధాన్యంతో పాటు ఇతర పంటల మద్దతు ధరను భారీగా పెంచగలిగారు.

తండ్రి బాటలో తనయుడు

రైతుల కోసం ఆ మహానేత ఒక అడుగు వేస్తే.. నేను రెండడుగులు ముందుకేస్తానంటూ అధికారంలోకి వచ్చింది మొదలు నాలుగేళ్లుగా రైతు సంక్షేమం కోసమే సీఎం జగన్ అహరహం శ్రమిస్తున్నారు. మహానేత జయంతిని ఏటా రైతు దినోత్సవంగా రైతుల మధ్యలో జరుపుకుంటున్నారు. విత్తు నుంచి విక్రయం వరకు గ్రామస్థాయిలో రైతులను చేయిపట్టి నడిపించేలా ఆర్బీకేలు తీసుకొచ్చారు. సహకార రంగ బలోపేతానికి రూ.295 కోట్ల మూలధనంగా సమకూర్చారు. ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాలకు చెల్లించే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచారు. ఇక సంక్షేమ పరంగా చూస్తే.. వైఎస్సార్ రైతుభరోసా కింద ఏటా రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఇలా రైతు సంక్షేమం కోసం గతంలో ఎన్నడూలేని విధంగా ఈ నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం అక్షరాల రూ.1,70,769.23 కోట్ల లబ్ధిని చేకూర్చింది.



అపర భగీరథుడు

సాక్షి, అమరావతి: దేశానికి ధాన్యాగారంగా భాసిల్లిన తెలుగు నేల 1995 నుంచి 2004 మధ్య వరుస కరవులతో తల్లడిల్లింది. పదిమంది ఆకలి తీర్చే అన్నదాత సాగుపై ఆశలు కోల్పోయి, అప్పుల భారంతో బలవన్మరణాలకు పాల్పడ్డాడు. మహా ప్రస్థానం పాదయాత్రలో అడుగడుగునా ఎదురైన ఇలాంటి ఘట్టాలు వైఎస్ రాజశేఖరరెడ్డిని కదిలించాయి. అధికారంలోకి వస్తే గోదావరి, కృష్ణా జలాలను ప్రతి ఎకరాకు అందించి, కరవు రక్కసిని తరిమికొడతానని ఆయన బాస చేశారు. 2004 మే 14న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే.. దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైన పోలవరం ప్రాజెక్టుతోసహా అనేక ప్రాజెక్టులను జలయజ్ఞం కింద కార్యరూపంలోకి తెచ్చారు. 2004–05లో రాష్ట్ర బడ్జెట్ అంచనా వ్యయం రూ.51,142.92 కోట్లు. కానీ రూ.1,33,730 కోట్ల వ్యయంతో ఒకేసారి 86 సాగునీటి ప్రాజెక్టుల పనులకు అనుమతిచ్చారు. కొత్తగా 97.69 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతో పాటు 23.53 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ప్రణాళిక రూపొందించారు. 2014 మే 14 నుంచి 2009 సెప్టెంబరు 2 వరకు అంటే ఐదేళ్ల మూడు నెలల్లోనే రూ.53,205.29 కోట్ల వ్యయంతో 16 ప్రాజెక్టులు పూర్తిగా, మరో 25 ప్రాజెక్టులను పాక్షికంగా పూర్తి చేసి 19.53 లక్షల కొత్త ఆయకట్టుకు నీరందించారు. 3.96 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించారు. ఉమ్మడి రాష్ట్ర సాగునీటి చరిత్రలో ఇదో రికార్డు.

సాగునీటి రంగ చరిత్రలో మహోజ్జ్వల ఘట్టం: వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తన తండ్రి వైఎస్సార్ చేపట్టిన జలయజ్ఞం ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నారు. ప్రాజెక్టుల పనులకు వైఎస్సార్ హయాంలో అడ్డుతగిలిన తరహాలోనే ఇప్పుడూ చంద్రబాబు సైంధవుడిలా అడ్డుతగులుతున్నారు. అయినా సీఎం జగన్ వాటిని అధిగమిస్తూ పనులు కొనసాగిస్తున్నారు. నెల్లూరు, సంగం బ్యారేజ్‌లను పూర్తి చేసి గతేడాది సెప్టెంబరు 6న జాతికి అంకితం చేశారు. గాలేరు–నగరిలో అంతర్భాగమైన అవుకు రెండో టన్నెల్, హంద్రీ–నీవా ద్వారా కర్నూలు పశ్చిమ మండలాల్లో 68 చెరువులను నింపే పథకం, వెలిగొండ తొలి దశ, వంశధార స్టేజ్–2 ఫేజ్–2, వంశధార–నాగావళి అనుసంధానం పనులు పూర్తి కావొస్తున్నాయి. నిర్వాసితులకు పునరావాసం కల్పించడం ద్వారా పులిచింతల, గండికోట, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, సోమశిల, కండలేరు, అవుకు, గోరకల్లు రిజర్వాయర్లలో మట్టికట్ట లీకేజీలకు డయాఫ్రమ్ వాల్‌తో అడ్డుకట్ట వేశారు. బ్రహ్మంసాగర్‌లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేస్తూ 2019, 2020, 2021, 2022లలో ఏటా సగటున కోటి ఎకరాలకు నీళ్లందించి, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తున్నారు. ఇక రాష్ట్రానికి పోలవరం జీవనాడి. వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో పోలవరం ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు. అటవీ, పర్యావరణ, ప్రణాళికా సంఘం సహా అవసరమైన అన్ని అనుమతులను సాధించారు. భారీ వ్యయమయ్యే పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించి.. కేంద్రం ఇచ్చే 90 శాతం వాటా నిధులతో పూర్తి చేయడానికి ప్రయత్నాలు చేశారు. ఆ ప్రయత్నాలన్నీ సఫలమై ప్రాజెక్టుకు కేంద్రం జాతీయ హోదా ఇచ్చే సమయంలోనే వైఎస్సార్ హఠాన్మరణం చెందారు. విభజన నేపథ్యంలో పోలవరానికి జాతీయ హోదా కల్పించిన కేంద్రం.. వంద శాతం వ్యయంతో తామే పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది.

కొత్త వరి వంగడాలు ఆయన చలవే..



'సాక్షి' ఇంటర్వ్యూలో ఎన్జీ రంగా వర్సిటీ మాజీ వీసీ, ఐసీఏఆర్ గవర్నింగ్ బాడీ మాజీ సభ్యుడు ప్రొ. పోలి రాఘవరెడ్డి

సాక్షి, అమరావతి

'2004లో వైఎస్ సీఎంగా బాధ్యతలు చేపట్టే సమయానికి నేను మార్టేరు పరిశోధనా కేంద్రంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నా. సీఎంగా బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే ఆయన మా కేంద్రానికి వచ్చారు. పరిశోధనలు బాగా పెరగాలి. వాటి ఫలాలు రైతులకు మరింత వేగంగా చేరాలంటే ఏం చేస్తే బాగుంటుందో చెప్పండన్నారు. రూ.100 కోట్లు ఇవ్వండి అని నేను అడగ్గానే పక్కనే ఉన్న మంత్రి రఘువీరారెడ్డి మన దగ్గర డబ్బుల్లేవన్నారు. భలే చెబుతావయ్య అంటూ అక్కడికక్కడే రూ.50 కోట్లు శాంక్షన్ చేశారు. వాటితో పరిశోధనా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాం. ఫలితంగా కొత్త రకాలను సృష్టించగలిగాం. ఉత్పత్తిని పెంచగలిగాం. ఈరోజు వందల సంఖ్యలో కొత్త రకాల విత్తనాలు మార్కెట్లోకి వస్తున్నాయంటే ఇదంతా ఆయన చలవే' అని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పూర్వపు వీసీ, ఐసీఏఆర్ గవర్నింగ్ బాడీ మాజీ సభ్యుడు ప్రొ. పోలి రాఘవరెడ్డి అన్నారు. మహానేత హయాంలో డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా, వీసీగా సేవలందించిన డాక్టర్ రాఘవరెడ్డి ఆ మహానేతతో తనకున్న సాన్నిహిత్యం, ఆయన హయాంలో విద్యా రంగానికి జరిగిన మేలుపై 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన ఏమన్నారో ఆయన మాటల్లోనే..

ఏటా అదనంగా వంద కోట్లు..: వర్సిటీలకు ఆనాడు రూ.400 కోట్ల బడ్జెట్ ఉండేది. ఇది ఏమాత్రం సరిపోవడం లేదని చెప్పడంతో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వర్సిటీకి ఏటా రూ.100 కోట్లు అదనంగా మంజూరు చేయించారు. 'విత్తన గ్రామాల'కు నాంది పలకడమే కాదు రివాల్వింగ్ ఫండ్ పేరిట రూ.20 కోట్లు ఇచ్చారు. ఉత్పత్తి చేసిన విత్తనాలను అమ్మగా వచ్చిన ఆదాయంతో విస్తరణ కార్యక్రమాలు చేపట్టండి అని వైఎస్ సూచించారు. ఆ నిధులు ఇప్పుడు రూ.100 కోట్లకు పైగా ఉన్నాయి. సాగులో రైతులకు తోడుగా నిలవాలన్న ఆలోచనతో దేశంలోనే తొలిసారి ల్యాబ్ టూ ల్యాండ్ అంటూ శాస్త్రవేత్తల బృందాలను పల్లెలకు పంపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పొలం బడులకు నాంది పలికారు.

వ్యవసాయ వర్సిటీలో సీట్ల పెంపు..: వ్యవసాయ విద్యను మెరుగుపర్చాలంటే ఏం చేయాలని ఓ రోజు వైఎస్ అడిగారు. ఆయన వచ్చేటప్పటికి వర్సిటీ పరిధిలో 400–500 సీట్లు మాత్రమే ఉండేవి. వాటిని 1,000 సీట్లకు పెంచాలని సూచించగానే క్షణం ఆలోచించకుండా పెంచేద్దామన్నారు. స్థానిక ప్రజలకిచ్చిన హామీ మేరకు పశ్చిమ గోదావరి జిల్లాలో ఉద్యాన వర్సిటీ పెడదామని ఆయన అనగా.. అవసరంలేదని నేను చెప్పా. 'లేదు రాఘవ.. నేను మాటిచ్చాను. పెట్టాల్సిందే' అంటూ 250 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో వర్సిటీని ఏర్పాటుచేశారు. తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ ఆయన హయాంలో ఏర్పాటైనవే. వైఎస్ హయాంలో రాజమండ్రి, జగిత్యాలలో కొత్త కళాశాలలు వచ్చాయి. బాపట్లలో మాత్రమే అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాల ఉండేది. వైఎస్ హయాంలో కొత్తగా అనంతపురం జిల్లా మడకసిరి, రంగారెడ్డిలలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుచేశారు. పులివెందులలో కొత్తగా కాలేజ్ ఆఫ్ ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీని తీసుకొచ్చారు. ఇక వర్సిటీ పరిధిలో సుమారు 5వేల మంది రైతు కూలీలు రోజువారీ వేతనాలతో పనిచేసేవారు. వీరికి క్లాస్–4 ఎంప్లాయిస్‌కు సమానంగా జీతభత్యాలు ఇవ్వడమే కాదు.. వారికి పింఛన్ సౌకర్యం కూడా కల్పించారు. రైతు మోములో చిరునవ్వులు చూడాలి. అవే మనకు గొప్ప అవార్డులు.. అన్న ఆయన మాటలు నాకు ఇప్పటికీ గుర్తు.

ఆరోగ్య దాత.. అభయ ప్రదాత

సాక్షి, అమరావతి: రోడ్లపై కుయ్.. కుయ్‌మని సౌండ్ చేస్తూ తిరిగే 108 అంబులెన్సు.. ఆరోగ్యశ్రీ పేరు విన్న వెంటనే గుర్తొచ్చేది.. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి. 2004కి ముందు బడుగు, బలహీన వర్గాలు, పేదలు, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలు ఏవైనా పెద్ద జబ్బుల బారినపడితే ఆస్తులను అమ్ముకుని వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితులు నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండేవి. పెద్ద జబ్బులు వస్తే ప్రాణాలపైన ఆశలు వదులుకోవాల్సిందే. వైద్యం కోసం ఆస్తులు అమ్ముకుని.. అప్పులు చేసి ఆర్థికంగా చితికిపోయి దైన్యంతో నిండిపోయిన కుటుంబాలే ఎక్కువ. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్సార్ ఆరోగ్య దాతగా.. అభయ ప్రదాతగా నిలిచారు. పేదలకు సంజీవనిలాంటి ఆరోగ్యశ్రీ పథకాన్ని 2007లో ప్రవేశపెట్టి ఎంతోమంది రోగులకు ఆయుష్షు పోశారు. ప్రభుత్వ ఆస్పత్రులే కాకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నా ప్రభుత్వమే నాణ్యమైన ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో లక్షలాది కుటుంబాలకు ఆస్తులు అమ్ముకోవాల్సిన దైన్యం.. అప్పుల సుడిగుండంలో చిక్కుకోవాల్సిన బాధలు తప్పాయి.

ఆపద్బంధు 108

ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టడమే కాకుండా ప్రమాదాల్లో గాయపడిన వారిని, అనారోగ్యంతో ఉన్నవారిని తక్షణమే ఆస్పత్రికి తరలించేలా 108 వాహనాలను వైఎస్సార్ ప్రవేశపెట్టారు. ప్రతి మండలానికి ఒక 108 అంబులెన్సును కేటాయించారు. అవసరమున్నవారు ఎవరైనా 108కి ఫోన్ చేస్తే నిమిషాల్లోనే వారి వద్దకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడానికి 104 సర్వీసులను ప్రారంభించారు. వైఎస్సార్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని దేశంలో 18 రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు వివిధ పేర్లతో అమలు చేస్తుండటం విశేషం. అంతేకాకుండా ఆరోగ్యశ్రీ స్ఫూర్తితోనే కేంద్రం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని చేపట్టింది. అదే విధంగా 108, 104 సేవలు పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయి.

కొత్త ఊపిరిలూదిన సీఎం వైఎస్ జగన్

వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. చంద్రబాబు హయాంలో పడకేసిన ఆరోగ్యశ్రీ సేవలకు కొత్త ఊపిరిలూదారు. 108, 104 పాత వాహనాల స్థానంలో కొత్త వాహనాలను ప్రవేశపెట్టడంతోపాటు వీటి సంఖ్యను మరింత పెంచారు. తెల్లరేషన్ కార్డుదారులతో పాటు రూ.5 లక్షల్లోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాలన్నింటినీ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చారు. ప్రొసీజర్లను 1,059 నుంచి ఏకంగా 3,257కు పెంచారు. అంతేకాకుండా వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద శస్త్ర చికిత్సల అనంతరం విశ్రాంత సమయానికి రోగులకు నెలకు రూ.5 వేల వరకు భృతిని కూడా అందిస్తున్నారు.

వైద్య విద్య బలోపేతానికి కృషి

తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ రంగంలో వైద్య విద్య బలోపేతానికి వైఎస్సార్ చేసిన కృషి అమోఘం. ఆయన సీఎంగా ఉండగా ఉమ్మడి రాష్ట్రంలో కడప, ఒంగోలు, శ్రీకాకుళం, ఆదిలాబాద్‌ల్లో రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లను ఏర్పాటు చేశారు. అలాగే కడపలో దంత వైద్య కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య విద్య బలోపేతమైంది.. మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాకే. ఈ క్రమంలో సీఎం జగన్ ఏకంగా 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ఇప్పటికే ఐదు కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. మరో ఐదు వచ్చే ఏడాది, మిగిలిన ఏడు 2025–26 విద్యా సంవత్సరంలో అందుబాటులోకి రానున్నాయి.





పేద బిడ్డల చదువులకు పెన్నిధి

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో దేశంలోనే సరికొత్త చరిత్రకు వైఎస్సార్ నాంది



సాక్షి, అమరావతి: ఆర్థికంగా ఉన్నవారికే ఉన్నత విద్య అన్నట్టున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ సంక్షేమ చదువుల విప్లవాన్ని సృష్టించారు. దేశ చరిత్రలోనే లేని ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసి కులమతాలతో సంబంధం లేకుండా ఉన్నత విద్య పేదలందరికీ ఉచితమే అని ప్రకటించారు. 2005–08 మధ్య ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులైన 26.67 లక్షల మందికి ఈ పథకం కింద రూ.2 వేల కోట్లను ఖర్చుచేశారు. ఇక 2009ని సంక్షేమ నామ సంవత్సరంగా ప్రకటించి.. 7 లక్షల మంది అగ్రవర్ణ పేదలను కూడా ఈ పథకంలో భాగం చేశారు. వారి ఉచిత చదువుల కోసం రూ.350 కోట్లు కేటాయించారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేపట్టని ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతో 33.67 లక్షల మంది పేద విద్యార్థుల చదువులకు పెన్నిధిలా నిలిచారు.

18 యూనివర్సిటీల స్థాపన..

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యకు 2003–04లో కేవలం రూ.4,468 కోట్లు మాత్రమే కేటాయించారు. అదే వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2008–09లో రూ.11 వేల కోట్లు కేటాయించి దేశంలోనే ఈ రంగానికి అధిక నిధులు కేటాయించిన ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. అంతేకాకుండా జిల్లాకు ఒక యూనివర్సిటీ ఉండాలని నిర్ణయించి కొత్తగా 18 విశ్వవిద్యాలయాలను స్థాపించారు. పేద విద్యార్థులకు సైతం ఖరీదైన ఐటీ శిక్షణ అందించాలని నిర్ణయించి నూజివీడు, ఇడుపులపాయ, బాసరలో ట్రిపుల్ ఐటీలను అందుబాటులోకి తెచ్చారు.

ఆయన బాటలోనే..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి ప్రారంభించిన ప్రజా సంక్షేమ పథకాలను, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నూరు శాతం అమలు చేస్తున్నారు. అంపశయ్యపై ఉన్న ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు: మన బడి కింద పది రకాల సౌకర్యాలతో అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. పేదింటి పిల్లలు అంతర్జాతీయ పౌరులుగా ఎదగాలని, ప్రపంచ స్థాయిలో పోటీపడాలని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టారు. జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నారు. అంతేకాకుండా విదేశాల్లో చదువుకోవాలనుకుంటున్న ప్రతిభావంతులకు రూ.1.25 కోట్ల ఫీజును సైతం చెల్లించడం ఆయనకే చెల్లింది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనంతగా ఈ నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్ విద్యా రంగానికి రూ.69,289 కోట్లు ఖర్చు చేశారు.



నా అనుకున్న వాళ్లకోసం ఎంతవరకైనా

సాక్షి, అమరావతి: 'నా అనుకున్న వాళ్ల కోసం ఎంతవరకైనా వెళ్లే గొప్ప వ్యక్తిత్వం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిది. అనుకున్నది సాధించడానికి ఎన్ని సవాళ్లనైనా ఎదుర్కొనే ధైర్యం ఆయన నైజం. ఆయన నవ్వుతూ ఉండేవాడు. మమ్మల్ని కూడా నవ్వుతూ ఉండమనేవారు. ఒక్కోసారి చిన్నపిల్లాడిలా మారిపోయేవారు. నా లాంటి ఎందరికో రాయకీయ పునాదులు వేసిన నాయకుడు' అంటూ మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డితో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్. 'వైఎస్సార్ కేవలం మంచి వాడే కాదు.. అంతకు మించిన వాడు' అని 'సాక్షి'కి చెప్పారు. వైఎస్సార్ తనను ఎంతగానో ప్రోత్సహించేవారని తెలిపారు.



ముస్లింల శ్రేయోభిలాషి..

సాక్షి, అమరావతి: కర్నూలు నగరం కొత్తపేటకు చెందిన షేక్ కుర్షిద్, సమీర్ దంపతుల ముగ్గురు పిల్లలు ఫీజురీయింబర్స్‌మెంట్‌తో డాక్టర్లు అయ్యారు. కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామానికి చెందిన హసీనాభాను, జిలానీ దంపతుల పెద్ద కుమారుడు బి.అష్రఫ్ అహ్మద్ బీసీ–ఈ రిజర్వేషన్‌తో ఎంఎస్ పూర్తి చేశారు. వీరే కాదు.. ఉభయ తెలుగురాష్ట్రాల్లో వేలాది మంది ముస్లిం యువకులు ఇప్పుడు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఉన్నత రంగాల్లో స్థిరపడ్డారంటే అందుకు కారణం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అని ఘంటా పథంగా చెబుతారు. 4 శాతం రిజర్వేషన్లతో దాదాపు 15 ముస్లిం ఉపకులాలకు బీసీ–ఈ రిజర్వేషన్ల వర్తింపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి కార్యక్రమాలతో వారి బతుకులు మార్చేసిన వైఎస్సార్ ముస్లిం సమాజానికి శ్రేయోభిలాషిగా నిలిచారు.

పరిశ్రమలకు వరాలు





సాక్షి, అమరావతి: అభివృద్ధి ఒక్క ప్రాంతానికే పరిమితం కాకూడదని, అన్ని ప్రాంతాలకు విస్తరించాలన్న గొప్ప విజన్ ఉండటమే కాకుండా దాన్ని అక్షరాల చేతల్లో చూపించిన మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి. ఆయన రూపొందించిన పారిశ్రామిక విధానాలు పరిశ్రమలకు వరాలే అయ్యాయి. అందుకే ఉమ్మడి రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వచ్చాయి. వైఎస్సార్ సీఎంగా ఉన్న ఐదేళ్లలో పెట్టుబడులు ఏటా సగటున 54 శాతం వృద్ధి చెందాయి. పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం 7వ స్థానం నుంచి మొదటి స్థానానికి చేరుకుంది. ఈ స్థాయి వృద్ధి రేటును అంతకుముందు సీఎంలు, వైఎస్ తర్వాత సీఎంలు ఎవ్వరూ అందుకోలేకపోయారు. ఆయన మరణించి పదేళ్లు అయినా వైఎస్సార్ హయాం పారిశ్రామిక రంగానికి స్వర్ణయుగం. అందుకే ఇప్పటికీ పారిశ్రామికవేత్తలు గుర్తు చేసుకుంటున్నారు.

వైఎస్సార్ సీఎం కాకముందు వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించిన ముఖ్యమంత్రులందరూ అభివృద్ధినంతా హైదరాబాద్‌కే పరిమితం చేశారు. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక అభివృద్ధిని తన దార్శనికతతో అన్ని ప్రాంతాలకు విస్తరించారు. వైఎస్సార్ అభివృద్ధి చేసిన శ్రీ సిటీ, అపాచీ, బ్రాండిక్స్, రాంకీ ఫార్మా వంటి భారీ ప్రత్యేక ఆర్థిక మండళ్లకు తోడు విశాఖ, విజయవాడ, కాకినాడల్లో ఏర్పాటు చేసిన ఐటీ సెజ్‌లు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. హైదరాబాద్‌లో శంషాబాద్ ఎయిపోర్టు, పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవే, బయోటెక్నాలజీ పార్క్, కృష్ణపట్నం పోర్టు, ప్రత్యేక ఆర్థిక మండళ్ల , టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, కైజెన్ టెక్నాలజీస్ వంటి అనేక ప్రాజెక్టులు ఆయన హయాంలోనే నెలకొల్పారు. ఇవే కాకుండా వాడరేవు, నిజాంపట్నం, బందరు పోర్టు, విశాఖ–కాకినాడ పెట్రో కారిడార్, ఎన్‌టీపీసీ, బీహెచ్ఈఎల్, బ్రాహ్మణీ స్టీల్స్ వంటి అనేక కలల ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న తొమ్మిదేళ్లలో రాష్ట్రానికి రూ. 11,659 కోట్ల విలువైన పెట్టుబడులు మాత్రమే అమల్లోకి వస్తే.. వైఎస్సార్ ఐదేళ్ల కాలంలో ఏకంగా రూ. 43,117 కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయి. వైఎస్సార్ హయాంలో ఐటీ ఎగుమతుల్లో 566 శాతం వృద్ధి నమోదైంది. ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తండ్రి వైఎస్సార్ బాటనే అనుసరిస్తున్నారు. అభివృద్ధి కేవలం ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా అన్ని ప్రాంతాలకు విస్తరించేలా మూడు రాజధానులతో పాటు పారిశ్రామికంగా అదే బాటను అనుసరిస్తున్నారు.

క్లుప్తంగా...

బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా హర్షవర్ధన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా కె.హర్షవర్ధన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను హర్షవర్ధన్ శుక్రవారం కలిశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి వేణును హర్షవర్ధన్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఓ ప్రకటన విడుదల చేశారు.

ఆర్‌-5 జోన్‌పై విచారణ వాయిదా

నవంబర్‌కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: అమరావతిలో ఆర్‌–5 జోన్‌లో పేదలకు ఇళ్ల నిర్మాణానికి సంబంధించి హైకోర్టు స్టే ఆదేశాలు వెకేట్ చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణ నవంబర్‌కు వాయిదా వేసింది. పేదలకు ఇళ్ల నిర్మాణాలపై హైకోర్టు స్టే ఆదేశాలను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. ప్రధానమంత్రి యోజన్ హౌస్ ఫర్ మిలియన్స్ పథకంలో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణం కోసమే ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసిందన్నారు. హైకోర్టు స్టే ఆదేశాలు వెకేట్ చేయాలని కోరారు. హైకోర్టు సుదీర్ఘ ఆర్డర్ చూడాల్సి ఉందని, ప్రస్తుతం స్టే వెకేట్ చేయలేమని ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ కేఎం జోసెఫ్ ధర్మాసనం ఆదేశాల అనంతరమే హైకోర్టులో విచారణ జరిగిందని గుర్తుచేసింది. హైకోర్టు ఆదేశాలను క్షుణ్ణంగా చూడాల్సి ఉందని, ప్రతివాదులు మూడువారాల్లో కౌంటరు దాఖలు చేయాలని ధర్మాసనం పేర్కొంది. రిజాయిండర్‌కు మరో మూడు వారాలు గడువిచ్చిన ధర్మాసనం విచారణను నవంబర్‌కు వాయిదా వేసింది.

గుడివాడ అభ్యర్థిని త్వరలో నిర్ణయిస్తాం: చంద్రబాబు

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో ఎట్టిపరిస్థితుల్లో గుడివాడ సీటు గెలిచి తీరాలని టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ నేతలకు చెప్పారు. ఆయన శుక్రవారం గుడివాడ, కైకలూరు నియోజకవర్గాలపై సమీక్ష నిర్వహించారు. గుడివాడ నేతలతో మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే వ్యక్తిని త్వరలోనే అభ్యర్థిగా ఖరారు చేయనున్నట్లు తెలిపారు. అందుకనుగుణంగా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పార్టీ కోసం ఎవరెవరు ఎలా పనిచేస్తున్నారో సమగ్ర వివరాలు తనవద్ద ఉన్నాయని చెప్పారు.

వైద్య, ఆరోగ్యరంగంలో ఏపీతో కలిసి పనిచేసేందుకు యూనిసెఫ్ సంసిద్ధత

సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌తో యూనిసెఫ్ ఫీల్డ్ ఆఫీస్ చీఫ్ జెలాలెం బి.టాఫెస్సే భేటీ



యూనిసెఫ్ ఫీల్డ్ ఆఫీస్ చీఫ్ జెలాలెం బి.టాఫెస్సేకు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాలకు అనుసంధానంగా వైద్య, ఆరోగ్యరంగంలోని వివిధ స్థాయిల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు యూనిసెఫ్ చీఫ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. యూనిసెఫ్ ఫీల్డ్ ఆఫీస్ చీఫ్ డాక్టర్ జెలాలెం బి.టాఫెస్సే (ఏపీ, కర్ణాటక, తెలంగాణ), మరికొందరు శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రైమరీ హెల్త్‌కేర్‌లో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీలు), ఫ్యామిలీ ఫిజిషియన్, ఆశా, అంగన్‌వాడీ వర్కర్స్, ఏఎన్‌ఎంలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు వంటి వివిధ స్థాయిల్లో ప్రభుత్వానికి అవసరమైన విధంగా తోడ్పాటు ఇచ్చేందుకు యూనిసెఫ్ ముందుకు వచ్చింది. వివిధ రంగాల్లో ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై యూనిసెఫ్ బృందంతో ముఖ్యమంత్రి జగన్ చర్చించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ముందుకెళుతున్న తీరును ముఖ్యమంత్రి జగన్ వివరించగా యూనిసెఫ్ చీఫ్ అభినందించారు. చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వారికి అందజేస్తున్న పౌష్టికాహారం, యాక్షన్ ప్లాన్, మహిళా రక్షణ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పర్యవేక్షణ, మహిళా పోలీసుల ద్వారా మహిళలు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలను అరికట్టడం వంటి కీలక అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన సాయం అందిస్తామని యూనిసెఫ్ బృందం ప్రకటించింది. ఆరోగ్యసురక్ష పేరుతో త్వరలోనే ఒక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. ఏపీని చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ స్టేట్‌గా తీర్చిదిద్దినట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో యూనిసెఫ్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆర్.పి.శ్రీధర్, యూనిసెఫ్ సోషల్ బిహేవియర్ చేంజ్ స్పెషలిస్ట్ సీమ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

యనమల సోదరుల అసైన్డ్ భూ దందా

- దళితులు, పేదలకు దక్కాల్సిన రూ.20 కోట్ల భూమిని కొట్టేసిన సోదరులు
- యనమల ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 52 ఎకరాలు కొట్టేసిన వైనం
- నిబంధనలు తుంగలో తొక్కి అసైన్డ్ భూముల కేటాయింపు
- అన్న రావాల్సిన అసైన్‌మెంట్ కమిటీకి తమ్ముడు హాజరు
- యనమల రామకృష్ణుడు సంతకం తానే పెట్టిన కృష్ణుడు
- ఆ తర్వాత పట్టాదారుల నుంచి భూములు కొన్న బినామీ
- పట్టాలు రద్దు చేసే దిశగా ప్రభుత్వం
- పట్టాదారులకు అధికారుల నోటీసులు



టీడీపీ నేతలు యనమల రామకృష్ణుడు, కృష్ణుడు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు తుని నుంచి ప్రాతినిధ్యం వహించిన సమయంలో కోట్లు విలువైన భూములను అక్రమంగా కొల్లగొట్టిన వైనం వెలుగులోకి వచ్చింది. తుని నియోజకవర్గం బెండపూడి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వానికి చెందిన కొండపోడు భూమి 51.92 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా 73 మంది అనుయాయుల పేరుతో డీ ఫారం పట్టాలు ఇచ్చి సొంతం చేసుకున్న విషయం బయటకు పొక్కింది. ఈ విషయం బయటకు పొక్కడం, స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో అధికారులు పట్టాదారులకు నోటీసులు జారీ చేశారు. నిబంధనలు పాటించకుంటే అసైన్డ్ భూముల డీఫారం పట్టాలను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఆ దిశగా యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది.

తమ్మయ్య పేటలో తమ్ముళ్ల దోపిడీ..

బెండపూడి రెవెన్యూ పరిధిలో తమ్మయ్యపేట గ్రామానికి సమీపంలో ప్రభుత్వ భూమి పలు సర్వే నంబర్లలో ఉంది. సర్వే నంబర్ 431లో కొండపోడు భూమిలో 67 మందికి, సర్వే నంబర్ 308లో పుంత భూమిలో ఆరుగురికి తొలి విడతగా 2007 అక్టోబరు 22న అసైన్‌మెంట్ కమిటీ ద్వారా డీ ఫారం పట్టాలు మంజూరు చేశారు. మరో ఇద్దరికి 2008 ఆగస్టు 14న 1.23 ఎకరాలకు కమిటీ తీర్మానం ద్వారా పట్టాలు ఇచ్చారు. ఈ విధంగా 51.92 ఎకరాలను 73 మందికి కేటాయించగా వీరిలో 64 మంది యనమల సొంత సామాజిక వర్గం, ఇద్దరు రజకులు, ఏడుగురు ఓసీల పేరుతో కేటాయించారు. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూముల కేటాయింపుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీలు, 30 శాతం బీసీలు, 10శాతం మైనార్టీలు, 10 శాతం ఓసీలలోని పేదలలు ఉండాలి. అయితే, బెండపూడి భూములన్నింటినీ యనమల తన అనుయాయులకు కట్టబెట్టారు. దళితులకు ఒక్క ఎకరమూ కేటాయించలేదు. అప్పట్లో అక్కడ ఎకరం విలువ రూ.3 లక్షలకు మించి లేదు. ఈ మండలంలో కాకినాడ సెజ్, గేట్‌వే పోర్టు ఆఫ్ కాకినాడ, బల్క్‌డ్రగ్ పార్క్ వంటివి రావడంతో కోలకతా–చెన్నై జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న ఈ భూమి ధర ప్రస్తుతం ఎకరం రూ.40 లక్షలపైనే పలుకుతోంది. అంటే బెండపూడిలో యనమల అసైన్ చేసిన మొత్తం భూమి విలువ రూ.20 కోట్లు పైమాటే. ఆ తర్వాత కొంత కాలానికి ఆ అసైన్డ్ భూములలో 40 ఎకరాలను యనమల సోదరులకు బినామీగా ఉన్న కాకినాడ రూరల్‌కు చెందిన ఒక టీడీపీ నాయకుడు ఎకరానికి కేవలం రెండు, మూడు లక్షల రూపాయలు ముట్టజెప్పి సొంతం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

ఎమ్మెల్యే సంతకం తమ్ముడు చేసి..

నియోజకవర్గ స్థాయిలో అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే ఉంటారు. ఆర్డీవో మెంబర్ కన్వీనర్‌గా, తహసీల్దార్, ఎంపీపీ, ఎంపీడీవో, ఒకరు ఎస్సీ, మరొకరు ఎస్టీ తదతరులతో ఈ కమిటీ ఉంటుంది. కానీ యనమల హయాంలో కమిటీని నామ్‌కేవాస్తేగా మార్చి అడ్డగోలుగా భూములు కేటాయించుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయన 6 సార్లు ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచారు. టీడీపీ అధికారంలో ఉండగా ఇక్కడ ఆయన చెప్పిందే వేదంగా సాగింది. అసైన్‌మెంట్ కమిటీని కూడా నీరుగార్చి, ఇష్టారాజ్యంగా నడిపించారు. విచిత్రమేమిటంటే అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్ హోదాలో ఎమ్మెల్యే రామకృష్ణుడు చేయాల్సిన సంతకాన్ని ఆయన సోదరుడైన కృష్ణుడు చేసినట్టు రికార్డుల్లో ఉంది. ఇది చూసి రెవెన్యూ యంత్రాంగమే విస్తుపోయింది. యనమల సోదరులపై తునిలో పోలీసు, ఇరిగేషన్, దేవాదాయ భూములను సైతం అనుయాయుల పేరుతో కొట్టేయడం, నకిలీ పట్టాలతో పోలవరం ప్రాజెక్టు పరిహారం, ఉత్తరాది మఠం భూముల రికార్డులు తారుమారు చేసి అన్యాయంగా కొట్టేశారనే విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. తాజాగా బెండపూడి భూముల వ్యవహారం బయటపడటంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

పట్టాలు రద్దు చేసి అర్హులైన వారికి ఇవ్వాలి



వార్డు మెంబర్ కూడా కాని కృష్ణుడు అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్ ఎలా అయ్యారు? బెండపూడి ప్రభుత్వ భూమి కేటాయింపుల్లో ఏ హోదాతో సంతంకం చేశారు? నిబంధనల ప్రకారం దళితులు, బీసీలు, ఇతర వర్గాలలో నిరుపేదలకు కేటాయించకుండా బినామీల పేరుతో కేటాయించడం అన్యాయం. ఆ భూములు కూడా టీడీపీ నాయకుడు అనధికారికంగా కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు. నిబంధనలు పాటించకుండా కట్టబెట్టిన పట్టాలు రద్దు చేసి అర్హులైన నిరుపేద బీసీ, దళితులకు ఆ భూములు కేటాయించాలి.

– రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా

అసైన్‌మెంట్ కమిటీ తీర్మానం సక్రమంగా లేదు.. నోటీసులు ఇచ్చాం



బెండపూడిలో 2007లో అసైన్డ్ భూముల కేటాయింపులో లొసుగులున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. రికార్డులను పరిశీలించగా అసైన్‌మెంట్ కమిటీ తీర్మానం సక్రమంగా లేదని తేలింది. అప్పటి ఎమ్మెల్యే అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా, ఆర్డీవో కన్వీనర్, తహసీల్దార్, ఎంపీపీ, ఎంపీడీవో తదితరులు మెంబర్లుగా ఉండాలి. ఈ వివరాలేమీ రికార్డుల్లో లేవని తేలింది. భూమి లబ్ధిదారులకు కేటాయింపుల్లో కూడా రిజర్వేషన్ పాటించ లేదు. నిబంధనల ప్రకారం పట్టాదారులకు నోటీసుల ఇచ్చాం. నిశితంగా పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటాం.

–కృతికా శుక్లా, జిల్లా కలెక్టర్, కాకినాడ

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన వీఆర్‌ఏలు

రూ.500 డీఏ మంజూరు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్‌ఏ) సంఘం రాష్ట్ర ప్రతినిధులు శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిశారు. వీఆర్‌ఏలకు రూ.500 డీఏ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏలకు డీఏ రద్దు చేసిందని, అప్పట్లో ఇచ్చే డీఏ రూ.300 కూడా రద్దు చేయడంతో తమ ఇబ్బందులను ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో సీఎం వైఎస్ జగన్ తమకు న్యాయం చేశారని వీఆర్‌ఏల సంఘం ప్రతినిధులు తెలిపారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన వారిలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, వెంకట్రావు, రాంబాబు, కోశాధికారి సత్యనారాయణ ఉన్నారు.

ఆంగ్లభాషపై పట్టుతో అంతర్జాతీయ అవకాశాలు

బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్



గారెత్ విన్ ఓవెన్‌ను సత్కరిస్తున్న నాగరాణి

సాక్షి, అమరావతి: అంతర్జాతీయంగా ఉన్న ఉపాధి అవకాశాలను అందుకోవాలన్నా, ఉన్న ఉద్యోగాల్లో ఉన్నత స్థానాలు పొందాలన్నా ఇంగ్లిష్ ఎంతో కీలకమని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. సాంకేతిక విద్యాశాఖ నేతృత్వంలో 'ఆంగ్ల నైపుణ్యం–ఉపాధి' అనే అంశంపై శుక్రవారం మంగళగిరిలో సమావేశం నిర్వహించారు. గారెత్ విన్ ఓవెన్ మాట్లాడుతూ ఆంగ్ల భాషా నైపుణ్యంతో అంతర్జాతీయ స్థాయి విద్యను సునాయాసంగా అందుకోవచ్చన్నారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

తల్లిపాల విశిష్టతపై మహిళల్ని చైతన్యవంతులను చేద్దాం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు
- ఈనెల 30వ తేదీ వరకు రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తల్లిపాల విశిష్టతను ఆవశ్యకతను మహిళలకు చాటి చెప్పేలా జిల్లా వ్యాప్తంగా ఈనెల 30వ తేదీ వరకు జిల్లాలో రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలలో భాగంగా బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఆహారంగా అందించాలని కనీసం రెండేళ్ల వరకు ఆహారంతో తల్లిపాలను కూడా కొనసాగించాల్సిన అవశ్యకతను మహిళలకు శిశు సంక్షేమ అధికారులు వివరించనున్నారన్నారు. తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానం అని తల్లి పాలలో రోగ నిరోధకశక్తి అధికంగా ఉంటుందన్నారు. బిడ్డలకు పాలు ఇవ్వడం తల్లీబిడ్డల ఇద్దరికి ఎంత ప్రయోజనకరంగా ఉంటుందన్న విషయాన్ని మాసోత్సవాల ద్వారా అవగాహన కలిగించనున్నామని కలెక్టర్ వివరించారు. తల్లిపాలలో ఉండే పోషకాలు తల్లి బిడ్డ ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని, తల్లిపాలు మాత్రమే నవజాత శిశువులకు అయోడిన్ పొందేందుకు ఏకైక మార్గమని, పుట్టిన బిడ్డకు మొదటి వెయ్యి రోజులు కీలకమని శిశువుల మెదడు, శారీరక అవయవాల అభివద్ధికి అయోడిన్ ప్రధాన పాత్ర పోషిస్తుందని అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా విశదీకరించనున్నట్టు వెల్లడించారు. మాసోత్సవాలలో సుపోషన్ దివస్ అన్నప్రాశన, శ్రీమంతం వంటి కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ఇమ్యునైజేషన్ శిబిరాలు సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులను కార్యక్రమానికి ఆహ్వానించి రాష్ట్రీయ పోషన్ మాసోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

బాబు కాదన్నారు.. జగనన్న జాలి చూపారు



వేలి ముద్రలు పడటం లేదనే సాకుతో గత ప్రభుత్వ హయాంలో నిలిపి వేసిన పింఛను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఇంటికే వచ్చి అందిస్తున్నారని దివ్యాంగుడి తండ్రి ఆనందం వ్యక్తం చేశారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పెదపులిపాక పంచాయతీ గణపతి నగర్‌కు చెందిన వీరిశెట్టి ఫణిబాబు, లక్ష్మీప్రసన్నలకు 15 ఏళ్ల కుమారుడు లక్ష్మణ్ ఉన్నాడు. దివ్యాంగుడైన లక్ష్మణ్‌కు వేలి ముద్రలు పడటం లేదనే సాకుతో మంజూరైన పింఛను కూడా గత ప్రభుత్వ హయాంలో రద్దు చేశారు. తిరిగి కరోనా సమయం 2020 సంవత్సరంలో పింఛను కోసం దరఖాస్తు చేయగా జగనన్న ప్రభుత్వం మంజూరు చేసిందని అప్పటి నుంచి క్రమం తప్పకుండా నెలనెలా ఇంటికే వచ్చి తమ బిడ్డకు వికలాంగుల పింఛను అందిస్తున్నారని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక సచివాలయం పరిధిలోని వలంటీర్ ప్రతాప్ లబ్ధిదారు లక్ష్మణ్‌కు పింఛను నగదు అందిస్తున్న సందర్భం ఇది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

చీరాల కేంద్రంగా మళ్లీ గోల్డ్ మాఫియా

- ముఠాలోని కీలక నిందితుడి అరెస్టు
- 47 కేజీల వెండి తరలించడంపై కేసు
- భారీగా చేతులు మారిన బంగారం
- విజయవాడ, తెనాలి, చీరాల బంగారు దుకాణాలకు విక్రయం
- విచారిస్తున్న తెనాలి పోలీసులు



గత ఏడాది రవితేజ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న చీరాల పోలీసులు (ఫైల్)

చీరాల: మళ్లీ గోల్డ్ మాఫియా కలకలం రేగింది. బంగారం, వెండి నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులకు విక్రయించడంపై ఫిర్యాదులు అందాయి. చీరాల, విజయవాడ, తెనాలి ప్రాంతాల్లో భారీగా లావాదేవీలు జరిగినట్లు సమాచారం. నిఘా పెట్టిన తెనాలి టూటౌన్ పోలీసులు ముఠాలోని కీలక నిందితుడు చీరాలకు చెందిన రవితేజను అదుపులోకి తీసుకుని తెనాలికి తరలించారు.

వివరాలు.. పోర్టుల ద్వారా బంగారాన్ని ఇతర దేశాల నుంచి తెచ్చి కస్టమ్స్ అధికారుల సహకారంతో తక్కువ ధరకు బంగారం విక్రయాలు చీరాల కేంద్రంగా నిర్వహిస్తున్నారు. బంగారం బిస్కెట్ల రూపంలో తక్కువ ధరకు ఎటువంటి లెక్కా పత్రం లేకుండా వస్తుండటం, ర్యాప్ (దొంగ బంగారం)కు తలదన్నేలా తక్కువ ధరకు బంగారం వ్యవహారం ప్రస్తుతం చీరాలలో తెరవెనుక ప్రముఖుల కనుసన్నల్లో గుట్టుగా నడుస్తోంది. చీరాలలో గుట్టుచప్పుడుగా చోటుచేసుకున్న ఈ వ్యవహారంలో అంతర్గత సభ్యుల మధ్య తలెత్తిన విభేదాలతో అసలు బండారం బయటపడింది. కోట్ల రూపాయలలో బంగారం బిస్కెట్ల క్రయవిక్రయాలు జరిగాయని సమాచారం. నిఘా ఉంచిన పోలీసులు ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. ఇందులో ప్రముఖ బంగారు వర్తకుడు కీలకపాత్ర పోషిస్తున్నాడు.

బురిడీ పొక్కిందిలా...

గతేడాది చౌక బంగారం విషయంలో మొత్తం రూ.35 కోట్లు విలువ ఉన్న 700 బిస్కెట్లు క్రయవిక్రయాలు జరిగాయనేది భోగట్టా. అయితే తక్కువ ధరకు బంగారం వస్తుందని నమ్మడంతో పలువురు వ్యాపారులు కూడా జత కలిశారు. ఈ వ్యవహారం భాగస్వాములుగా ఉన్న వారి మధ్య విభేదాలు రావడంతో విషయం బయటకు పొక్కింది. చివరకు భాగస్వాములకు కూడా ఇది అసలు బంగారమేనా అనే అనుమానాలు రావడంతో కీరోల్ పోషించిన వ్యక్తిని నిలదీశారు. లావాదేవీలు, రశీదుల విషయంలో విభేదాలు రావడంతో వ్యవహారం బయటకు వచ్చింది. చీరాల ప్రాంతంలో ప్రస్తుతం చౌకగా బంగారం దొరుకుతుందని కొందరు ఏజెంట్లు నమ్మబలుకుతూ బంగారం వ్యాపారులలో ఆశలు రేపుతున్నారు. ఆశల ఊబిలో పడి కొందరు బంగారం వ్యాపారులు కూడా ఇరుక్కుపోతున్నారు.

సౌదీ టూ విజయవాడ వయా సింగపూర్..

బంగారం ఉత్పత్తి కేంద్రమైన సౌదీలోని ఖతర్ నుంచే స్మగ్లింగ్ ముఠా బంగారాన్ని తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఖతర్ నుంచి సింగపూర్‌కు, అక్కడ నుంచి విజయవాడకు వాయు, జల మార్గాల ద్వారా బంగారం బిస్కెట్లు తీసుకువస్తున్నట్లు సమాచారం. తీసుకువచ్చిన బంగారాన్ని ఏజెంట్ల ద్వారా విజయవాడ నుంచి తెనాలి, నెల్లూరు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎటువంటి లెక్కా పత్రాలు లేకుండా తక్కువ ధరకు రావడంతో వ్యాపారులు కూడా వీరివైపు మొగ్గు చూపుతున్నారు. వ్యాపారులు చెల్లించిన నగదు కూడా బ్లాక్ మని కావడంతో ఫిర్యాదులు చేసేందుకు కూడా ముందుకు రావడం లేదు. ఇదే కేటుగాళ్లకు ఆసరా అయింది. తీసుకున్న డబ్బుకు ఎటువంటి పత్రాలు కూడా లేకపోవడంతో కేటుగాళ్లు బంగారం వ్యాపారులను వలలో వేసుకుంటున్నారు. బంగారం ఇవ్వకుండ మోసానికి పాల్పడుతున్నారు.

47 కేజీల వెండి తరలించారనే సమాచారంతో వెలుగులోకి..

గోల్డ్ మాఫియాలో కీలకంగా ఉన్న నిందితుడు రవితేజ దొంగతనం చేసిన వీరి వద్ద నుంచి 47 కేజీల వెండి తక్కువ ధరకు కొనుగోలు చేసి చీరాల ప్రాంతంలో కొన్ని బంగారు దుకాణాల్లో విక్రయించాడని తెనాలి పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో శుక్రవారం వేకువజామున చీరాల బందావారి వీధిలోని రవితేజ ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా రవితేజ ప్రతిఘటించి పోలీసుల మీదనే దాడికి పాల్పడే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు రవితేజను బలవంతంగా కారులో తెనాలి తీసుకెళ్లి విచారణ చేస్తున్నారు. అయితే రవితేజ వద్ద నుంచే భారీగా బంగారం, వెండి కొనుగోలు చేసి ఎలాంటి పత్రాలు, జీఎస్టీ బిల్లులు లేకుండా ప్రజలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న బంగారు వ్యాపారుల్లో భయాందోళన మొదలైంది.

నేడు తెలంగాణ గవర్నర్ రాక

మంగళగిరి: మండలంలోని నీరుకొండ గ్రామంలో గల ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ మూడవ కాన్వొకేషన్‌కు తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్య రాజన్ హాజరుకానున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆవరణలో జరుగనున్న కార్యక్రమానికి ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ అశుతోష్ శర్మలతోపాటు యూనివర్సిటీ ఫౌండర్ ఛాన్సలర్ డాక్టర్ పీఆర్ పరివేందర్ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

యార్డులో 17,251 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 15,010 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 17,251 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,500 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,797 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

గుంటూరు మీదుగా రామానందపురానికి ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్–రామానందపురం వయా గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలును కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రైలు నంబరు 07695 సికింద్రాబాద్- రామానందపురం ప్రతి బుధవారం ఈనెల 6 నుంచి 27వ తేదీ వరకు కేటాయించినట్లు వెల్లడించారు. రైలు 07696 రామానందపురం–సికింద్రాబాద్ ప్రతి శుక్రవారం ఈనెల 8 నుంచి 29వ తేదీ వరకు కేటాయించినట్లు తెలిపారు. ఈరైలు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, చెన్నై ఎగ్మోర్, చెంగల్‌పట్టు, విల్లుపురం మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

కొనసాగిన దేహదారుఢ్య పరీక్షలు

అర్హత సాధించిన 164 మంది మహిళా ఎస్‌ఐ అభ్యర్థులు



పరుగు పోటీల్లో మహిళా ఎస్‌ఐ అభ్యర్థులు



గుంటూరు, ప్రకాశం జిల్లాల ఎస్పీలతో మాట్లాడుతున్న రేంజ్ ఐజీ పాలరాజు

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో ఎస్‌ఐ మహిళా అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం జరిగాయి. 620 మంది అభ్యర్థులు హాజరవ్వగా, వారి ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ, 1,600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌లు నిర్వహించారు. పరుగు పోటీలు నిర్వహించే క్రమంలో పలు సూచనలు చేశారు. గత బుధవారం నుంచి శుక్రవారం వరకు కేవలం మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు చేపట్టారు. ఈ క్రమంలో గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, ఎస్పీలు కె.ఆరిఫ్ హఫీజ్ (గుంటూరు), మల్లికా గర్గ్ (ప్రకాశం), ఏఎస్పీలు అంకితా సూరన (ఒంగోలు), కె.సుప్రజ (గుంటూరు), హైమావతి (ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు) గ్రౌండ్‌లో పర్యటించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. 620 మంది అభ్యర్థులకు 164 మంది అర్హత సాధించారు. గ్రౌండ్‌లో మౌలిక సౌకర్యాలు నెలకొల్పారు. మహిళా పోలీస్ అధికారులతో ప్రత్యేక పహారా నిర్వహించారు. ఐజీ కార్యాలయ సీఐ సుధాకర్, పలువురు అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య విధాన పరిషత్ డీసీహెచ్‌ఎస్‌గా సుబ్రహ్మణ్యరాజు



గుంటూరుమెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిగా డాక్టర్ కె.సుబ్రహ్మణ్య రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మార్కాపురం జిల్లా ఆసుపత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పనిచేస్తున్న ఆయనకు డీసీహెచ్‌ఎస్‌గా ప్రమోషన్ ఇచ్చి ప్రభుత్వం గుంటూరుకు బదిలీ చేసింది. రెగ్యులర్ డీసీహెచ్‌ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ రత్నాకర్ సెప్టెంబరు నుంచి సెలవులో ఉండటంతో డాక్టర్ హనుమంతరావు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ హనుమంతరావు నుంచి డాక్టర్ సుబ్రహ్మణ్యం రాజు బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ డీసీహెచ్‌ఎస్‌గా విధుల్లో చేరిన డాక్టర్ సుబ్రహ్మణ్య రాజుకు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.





బరువు తగ్గడం అంత బరువేం కాదు!

కొంతమంది శరీరతత్వాన్ని బట్టి బరువు పెరగడం, తగ్గడమనేది పెద్ద టాస్కే. మంచి పౌష్టికాహారం, కొవ్వులతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా బరువు పెరగడం సులభమే. కానీ దాన్ని తగ్గించుకోవాలంటే మాత్రం చుక్కలు కనిపిస్తాయి. ఇందుకు చాలా మంది సినీ తారలు కూడా నిదర్శనం. నిత్యం యోగా చేసే సినీతారలు, తదితర వంటి సెలబ్రిటీలే ఇంత కష్టపడుతుంటే.. మనలాంటి సామాన్యులు బరువు తగ్గడం సాధ్యమేనా అని నిరాశ పడొద్దు. బిజీ లైఫ్ వల్ల చాలామందికి వ్యాయామం చేయడానికి సమయం చిక్కదు. అలాగని డైటింగ్ చేస్తూ కడుపు మాడ్చుకోవడం కూడా కష్టమే. అందుకే చాలా మంది సులభంగా బరువు తగ్గే మార్గాలను ఎంచుకుంటారు. అలాంటివారికి ఈ కింది చిట్కాలు ఉపయోగపడవచ్చు.

మంచి నీటిని తరచు తాగడం వల్ల ఆహారం తక్కువగా తీసుకుంటాం. ముఖ్యంగా భోజనానికి ముందు నీరు తాగడం వల్ల కొద్దిగా తింటే చాలు పొట్ట నిండిన భావన కలుగుతుంది. 12 వారాల పాటు చేసిన ఓ అధ్యయనంలో భోజనానికి ముందు నీళ్లు తాగని వారితో పోలిస్తే.. తాగేవారు త్వరగా బరువు తగ్గుతారని తేలింది. బరువు తగ్గేందుకు ఏమేం చేయాలో, ఏం చేయకూడదో తెలుసుకుందాం.

- ఆహారాన్ని కంగారుగా తినకూడదు. నెమ్మదిగా నమిలి తినాలి. దీనివల్ల తక్కువ ఆహారం తీసుకుంటారు.
- నెమ్మదిగా ఆహారం తీసుకోవడం వల్ల కడుపు త్వరగా నిండిన ఫీలింగ్ వస్తుంది.
- మీరు రోజూ తీసుకొనే ఆహారంలో ప్రొటీన్లు ఎక్కువగా ఉండాలి.
- ప్రొటీన్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపు త్వరగా నిండుతుంది.
- ఆకలి తగ్గితే శరీరంలోకి తక్కువ క్యాలరీలు చేరతాయి.
- జీఎల్‌పీ-1, ఘెర్లిన్ హార్మోన్లపై ప్రొటీన్లు ప్రభావం చూపడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది.
- తియ్యని శీతలపానీయల జోలికి వెళ్లొద్దు.
- సోడా కలిగిన డ్రింక్స్ వల్ల రోగాల ముప్పు పెరుగుతుంది.
- చక్కెర శాతం ఎక్కువగా ఉండే పానీయాల వల్ల శరీరంలోకి ఎక్కువ క్యాలరీలు చేరతాయి.
- కంటి నిండా నిద్రలేకపోయినా సరే బరువు పెరిగే అవకాశాలు ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి.
- నిద్రలేమి వల్ల లెప్టిన్, ఘెర్లిన్ హార్మోన్లపై ప్రభావం పడుతుంది.
- ఒత్తిడి వల్ల కార్టిసాల్ అనే హార్మోన్ విడుదలై ఆకలి పెరుగుతుంది.
- ఆకలి పెరగడం వల్ల అనారోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటారు.
- దానివల్ల శరీరంలోకి ఎక్కువ క్యాలరీలు చేరతాయి.
- నిద్రలేమి, ఒత్తిడి వల్ల మధుమేహం, ఊబకాయం వంటి అనేక రుగ్మతలు వస్తాయి.
- యోగర్ట్, లెంటిల్స్, క్వినోవా, చికెన్ బ్రెస్ట్, చేపలు, ఆల్మండ్స్‌లో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి.
- పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల తొందరగా ఆకలి వేయదు.
- మొక్కల నుంచి లభించే విస్కోస్ ఫైబర్ అనే పీచుపదార్థం బరువు తగ్గేందుకు సహకరిస్తుంది.
- బీన్స్, ఓట్స్ సెరల్స్, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్, ఆస్పరాగస్, నారింజ, అవిసె గింజల్లో విస్కోస్ ఉంటుంది.
- ఆహారాన్ని మితంగా తీసుకోవాలి.
- కంచం నిండుగా భోజనం చేస్తే బరువు కూడా అదే స్థాయిలో పెరుగుతారు.
- ఆకలి వేసినప్పుడు మధ్య మధ్యలో బాదం తదితర డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం మంచిది.
- టీవీ లేదా ల్యాప్‌టాప్‌లో సినిమాలు, వీడియోలు చూస్తూ తినడం వల్ల కూడా బరువు పెరుగుతారు.
- ఎందుకంటే.. వాటి ధ్యాసలో పడి అతిగా తినేస్తారు కాబట్టి ధ్యాసతో తినడం మంచిది.

మీకు తెలుసా?

కాఫీ సంగతులు

గర్భవతులు లేదా తల్లిపాలు ఇస్తున్న వారు కాఫీకి దూరంగా ఉండటం శ్రేయస్కరం. గర్భస్రావం, అకాల ప్రసవం, తక్కువ బరువుతో పిల్లల పుట్టడం వంటి ముప్పులను నివారించడానికి గర్భవతులు కాఫీ తాగకపోవడమే మంచిది. ఒకవేళ కాఫీ తాగాలి అనుకున్నా 200 మిల్లీ గ్రాముల కంటే ఎక్కువగా తీసుకోకూడదు. కెఫీన్ ఫలానా మోతాదులో తీసుకుంటే మంచిదని ఎవరు చెప్పలేరు కాబట్టి ప్రెగ్నెన్సీతో ఉన్నవారు కాఫీ తాగే ముందు ఒకసారి డాక్టర్‌ను కలవాలి. అలాగే పాలిచ్చే తల్లులు కాఫీ ఎక్కువసార్లు తాగడం వల్ల డీహైడ్రేషన్ కు గురి అయ్యే అవకాశం ఉంది. అందు వల్ల వీరు కూడా పాలిచ్చే రోజుల్లో కాఫీని మానేయటం ఉత్తమం. అదేవిధంగా మెటబాలిజమ్ స్లోగా ఉన్నవారుమెటబాలిజమ్ స్లోగా ఉన్నవారు కాఫీకి దూరంగా ఉండాలి. ఎందుకంటే కాఫీని అరిగించుకునే శక్తి వీరికి ఉండదు. కాఫీ తాగిన తర్వాత నిద్రపోలేకపోతే.. వారికి మెటబాలిజం స్లోగా ఉందని అర్థం. స్లో మెటబాలిజం ఉన్నవారు మధ్యాహ్నం 3 తర్వాత కాఫీ తాగకూడదు. అలానే ఎక్కువసార్లు తీసుకోకూడదు.



ఆకస్మిక మైకం.. తరచు తలనొప్పా?



ఈ రెండూ లోబీపీకి ప్రధానం సూచన కావొచ్చు. తక్కువ ఆక్సిజన్ స్థాయి కారణంగా ఒక్కోసారి అపస్మారక స్థితి ఏర్పడవచ్చు. మెడ మీద గట్టిగా పట్టుకున్నట్లు అనిపిస్తుంది. ఆ ప్రాంతంలో ఆగీ ఆగీ నొప్పి కూడా రావొచ్చు. అకస్మాత్తుగా ఊపిరి ఆడకపోవటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి పరిస్థితి కూడా కనిపిస్తుంది. ఇందులోని మరో లక్షణం ఏమిటంటే, శరీరం ఒక్కసారిగా చెమటలు పట్టడం, శరీరంలో వేడి జ్వరంలా పెరిగిపోవడం, అలసిపోయినట్లుగా కుప్పకూలిపోవడం సంభవిస్తుంది.



హృదయ స్పందన రేటు పెరుగుతుంది. సక్రమంగా గుండె కొట్టుకోకపోవడం వల్ల అలసట కనిపిస్తుంది. ఆహారం జీర్ణం కాక వికారంగా అనిపిస్తుంది. వాంతులు, వికారం, విపరీతమైన అలసట వల్ల ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. లోబీపీ ఉంటే మూత్ర విసర్జన కూడా తగ్గుతుంది.

లోబీపీ ఉంటే ఏం చేయాలి

లో బీపీ అకస్మాత్తుగా జరగదు. శరీరంలో ఏ సమస్య వచ్చినా బీపీ తగ్గుతుంది. ఇది డీహైడ్రేషన్ మరియు గుండె సంబంధిత సమస్యలను కూడా కలిగిస్తుంది. రక్తస్రావం అయ్యే అవకాశాన్ని కొట్టిపారేయలేము. శరీరంలోని ఏ భాగంలో అయినా మార్పులు సంభవిస్తే రక్తప్రసరణలో తేడా వచ్చి బీపీ పడిపోతుంది. మితిమీరిన ఆలోచనలు, ఒత్తిడితో కూడిన జీవితం బీపీలో హెచ్చుతగ్గులు ఉంటాయి. మధుమేహం వల్ల కూడా ఇది జరగవచ్చు. అలాంటప్పుడు తగిన చికిత్సను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని వైద్యనిపుణులు చెబుతున్నారు. రక్తపోటులో ఆకస్మిక తగ్గుదలకు సరైన చికిత్స అవసరం. ఆ సమయంలో స్వీయ చికిత్స కంటే ఆసుపత్రిని సందర్శించడం మంచిది. ఒక గంటలోపు ఆసుపత్రికి రావడం వల్ల ప్రమాదకర పరిణామాలను నివారించవచ్చు. అక్కడ లో బీపీకి కారణాన్ని గుర్తించి చికిత్స అందిస్తారు.

మనం పైన చెప్పుకున్నట్టుగా... లో బీపీ లక్షణాలు కనిపించగానే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించాలి. వారి సలహా మేరకు మీ జీవనశైలిని సరిచేసుకోవాలి. తగిన పోషకాహారం, తగినంత నిద్ర, తేలికపాటి వ్యాయామాలు తప్పనిసరిగా మీ దినచర్యలో చేర్చుకోవాలి.

అపోహ... వాస్తవం

పచ్చసొన పారేస్తున్నారా?



చాలామంది గుడ్డులోని తెల్లసొన మాత్రం తిని పచ్చసొన వదిలేస్తుంటారు. ఎందుకంటే పచ్చసొన మంచిది కాదేమోనని కొందరి అనుమానం. నిజానికి పచ్చసొన మీకు ఎటువంటి హానీ కలిగించదు. పైగా గుడ్డులోని తెల్లటి భాగాన్ని మాత్రమే తినడం వల్ల పచ్చసొనలో ఉండే ఎ, బి, ఇ, కె. విటమిన్లని పొందలేరు. పచ్చసొన తినకపోవడం వల్ల కలిగే నష్టాల గురించి తెలుసుకుందాం

పోషకాల లోపం

గుడ్డులోని పచ్చసొనలో కోలిన్ అనే పోషకం ఉంటుంది. ఇది చికెన్, చేపలు, బంగాళదుంపలు, బియ్యం వంటి వాటిలో కనిపిస్తుంది. పూర్తిగా ఉడికించిన గుడ్డులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అయితే పచ్చసొనలో ఐరన్, జింక్ ఉంటాయి. మీరు దీనిని తినకపోతే ఈ పోషకాలు కోల్పోతారు.

రోగనిరోధక శక్తి కోల్పోవడం:

గుడ్లలో ప్రొటీన్ సమృద్ధిగా లభిస్తుంది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, ఎసెన్షియల్ మినరల్స్, అమినో యాసిడ్స్, విటమిన్ డి, బి12 ఉంటాయి. అనేక అధ్యయనాల ప్రకారం గుడ్లు తినడం వల్ల శక్తి పెరుగుతుంది. ఇవి రోగనిరోధక శక్తిని బలపరుస్తాయి. కళ్లను సురక్షితంగా ఉంచడమే కాకుండా చర్మం, జుట్టుకి కూడా మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయి ఎక్కువగా ఉన్న చాలామంది వ్యక్తులు గుడ్డులోని పసుపు భాగాన్ని తినకుండా వదిలేస్తారు. ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో డైటరీ కొలెస్ట్రాల్ ఉంటుంది. దాదాపు ఒక గుడ్డులో 187 మి.గ్రా. కొలెస్ట్రాల్ ఉంటుంది. అయితే ఇది ఎప్పుడూ తీసుకునే మటన్, ఐస్ క్రీం వంటి ఆహార పదార్థాలతో పోలిస్తే తక్కువే. ఇలాంటి పరిస్థితులలో గుడ్డులోని పసుపుభాగం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇక్కడ ఒకటి తెలుసుకోవాలి.. ప్రకృతి మనకు గుడ్డులో తెల్లసొన, పచ్చసొన కలిపే ఇచ్చింది. అంటే కలిపే తినమని అర్థం. కాబట్టి అది మంచిది కాదేమోననే అనుమానంతో దానిని వేరు చేయాల్సిన అవసరం లేదు.


ప్రభాస్

సలార్ వాయిదా?

ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'సలార్' తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్'ని ఈ నెల 28న రిలీజ్ చేయనున్నట్లు గతంలో యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ సినిమా విడుదల వాయిదా పడిందనే టాక్ వినిపిస్తోంది. డిసెంబరు లేదా జనవరిలో విడుదల చేసే ఆలోచనలో ఉందట చిత్రం యూనిట్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న 'సలార్'లో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తండ్రీకొడుకులుగా ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ సినిమాలో జగపతిబాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటించారు.

అందుకే తెలుగువారంటే ఇష్టం

- సోనూ సూద్


ఎండీ ఆసిఫ్ జాని, సోనూ సూద్

''నేను హిందీ సినిమాలు వదిలేసి తెలుగు సినిమాలు చేస్తున్నప్పుడు చాలా మంది 'ఎందుకు తెలుగు సినిమాలే చేస్తున్నారు?' అని అడిగారు. నన్ను నటుణ్ణి చేసింది, క్రమశిక్షణ నేర్పింది తెలుగు సినిమా. అందుకే తెలుగువారన్నా, తెలుగు సినిమా అన్నా నాకు ఇష్టమని చెప్పాను'' అని నటుడు సోనూ సూద్ అన్నారు. నిమ్మల శ్రీరామ్, దేవరాజ్ పాలమూర్, అవినాష్ చౌదరి, ఐశర్య ఉల్లింగాల, పులి సీత, విజయ, శ్రీయాంక కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'తురుమ్ ఖాన్‌లు'. శివ కల్యాణ్ దర్శకత్వంలో ఎండీ ఆసిఫ్ జాని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో అతిథిగా పాల్గొన్న సోనూ సూద్ మాట్లాడుతూ– ''ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే మంచి కథ ఉందని తెలుస్తోంది. మంచి హిట్ అయి, వచ్చే ఏడాది పార్ట్ 2, పార్ట్ 3 కూడా తీయాలి'' అన్నారు. ''తుపాకులగూడెం అనే గ్రామంలో విష్ణు.. ఈశ్వర.. బ్రహ్మ అనే ముగ్గురు పాత్రల చుట్టూ ఈ కథ నడుస్తుంది'' అన్నారు శివ కల్యాణ్. ''మంచి కథతో రూపొందిన మా 'తురుమ్ ఖాన్‌లు' ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు ఎండీ ఆసిఫ్ జాని. శ్రీరామ్ నిమ్మల, అవినాష్ చౌదరి తదితరులు మాట్లాడారు.

కామెడీ.. థ్రిల్


పరుచూరి సుదర్శన్

పరుచూరి సుదర్శన్, శ్రీ జంటగా రవికిషోర్ బాబు చందిన దర్శకత్వంలో ఓ కామెడీ థ్రిల్లర్ ఫిల్మ్ తెరకెక్కుతోంది. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ సినిమాకు 'రూమర్స్ డిస్ట్రాయ్ లైఫ్స్' అనేది ఉపశీర్షిక. యస్. పాండు రంగారావు, కోయ చిన్నరెడ్డయ్య నిర్మిస్తున్న చిత్రం ఇది. శనివారం సుదర్శన్ బర్త్ డే. ఈ సందర్భంగా శుక్రవారం ఈ సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. యోగి, దొరబాబు, జబర్దస్త్ రాజమౌళి, జబర్దస్త్ బాబి, సునీతా మోహన్, రాజేశ్వరి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య.

పాపే ప్రాణం

కథను కీలక మలుపు తిప్పే 'కీ' రోల్స్ దాదాపు ప్రతి సినిమాలోనూ ఉంటాయి. ఈ కీ రోల్స్‌కి ఏజ్‌తో సంబంధం ఉండదు. చిన్నారులు కూడా కథలో పెద్ద మార్పుకు కారణం అవుతుంటారు. 'ఆర్ఆర్ఆర్', 'బింబిసార' వంటి సినిమాల్లో చిన్ని పాపలు కథకు ప్రాణంగా నిలిచారు. ఇలా 'పాపే ప్రాణం' అంటూ సాగే కథలతో రానున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.


సైంధవ్ పోస్టర్


చిరంజీవి

సంరక్షకుడు?

'పసివాడి ప్రాణం, జగదేకవీరుడు అతిలోక సుందరి, అంజి'... వంటి సినిమాల్లో చిన్నారులతో చిరంజీవి చేసిన అల్లరి సన్నివేశాలు, అదే సమయంలో వారి ప్రాణ రక్షకుడుగా చేసిన సాహసాలు ప్రేక్షకులను అలరించాయి. మళ్లీ వెండితెరపై ఓ పాపకు సంరక్షకుడిగా ఉండే పాత్రలో చిరంజీవి నటించనున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇటీవల విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్‌ను బట్టి ఇది సోషియో ఫ్యాంటసీ ఫిల్మ్ అనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ చిత్రంలో ఓ పాప కీలక పాత్రలో నటించనుందని, ఈ పాప సంరక్షకుడిగా చిరంజీవి చేసే సాహసాలు అబ్బురపరిచేలా ఉంటాయని టాక్. ఈ ఏడాది చివర్లో రెగ్యులర్ షూటింగ్ ఆరంభించి, వచ్చే ఏడాది ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో యూనిట్ ఉందని తెలిసింది. ఈ సంగతి ఇలా ఉంచితే... వశిష్ఠ దర్శకుడిగా పరిచయం అయిన 'బింబిసార' చిత్రంలో ఓ పాప సెంట్రల్ క్యారెక్టర్‌గా ఉన్న సంగతి తెలిసిందే.

హార్ట్ ఆఫ్ సైంధవ్

శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా.. ఇలా ముచ్చటగా ముగ్గురు హీరోయిన్లు ఉన్నా కూడా హీరో 'సైంధవ్' మనసులో తొలి స్థానం చిన్నారి సారాదే. సారా అంటే 'హార్ట్ ఆఫ్ సైంధవ్' అన్నమాట. వెంకటేశ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న ఈ సైంధవ్ సినిమాకు 'హిట్' ఫ్రాంచైజీ ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. సైంధవ్ హార్ట్ సారా అని చిత్ర యూనిట్ అంటోందంటే కథలో చిన్నారి సారా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంటుందని ఊహించవచ్చు. తమిళ నటుడు ఆర్య, హిందీ నటుడు నవాజుద్దీన్ సిద్దిఖీ కీలక పాత్రలు చేస్తున్న 'సైంధవ్' చిత్రం డిసెంబరు 22న విడుదల కానుంది.

హాయ్ నాన్న

తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో తెలుగులో రూపొందుతున్న మరో చిత్రం 'హాయ్ నాన్న'. ఈ ఎమోషనల్ మూవీలో నాని హీరోగా నటిస్తున్నారు. 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్ ఓ కీలక పాత్ర చేస్తున్నారు. శౌర్యువ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రకథ ఓ పాప పాత్ర చుట్టూ తిరుగుతుందని, ఈ క్రమంలో వచ్చే భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయని తెలుస్తోంది. 'హాయ్ నాన్న' డిసెంబరు 21న రిలీజ్ కానుంది.


'హాయ్ నాన్న' పోస్టర్

గరుడ సాహసాలు

'గరుడ' సినిమా పోస్టర్ చూశారుగా.. సత్యదేవ్ వీపుపై కూర్చున్న ఓ చిన్నారి ఎంత భయంగా చూస్తుందో కదా! పైగా అది అడవి ప్రాంతం. ఆ చిన్నారి భయాన్ని పోగొట్టి, తనను సురక్షితంగా గరుడ ఎలా రక్షించాడనేది వెండితెర పైనే చూడాలంటోంది యూనిట్. సత్యదేవ్ హీరోగా క్రాంతి బాల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'గరుడ'. సోషియో ఫ్యాంటసీ నేపథ్యంలో సాగే అడ్వంచరస్ మూవీగా ఈ చిత్రం ఉంటుందట. ఈ చిత్రం తొలి భాగం 'గరుడ: చాప్టర్ 1' త్వరలోనే రిలీజ్ కానుంది.


'గరుడ' పోస్టర్

ఇలా చిన్నారులు కీలకంగా నిలిచే చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

ఏక్ దమ్ స్టెప్పులు


రవితేజ, నూపుర్

ఏక్ దమ్ ఎనర్జీతో స్టెప్పులేశారు రవితేజ. స్టువర్టుపురం దొంగగా చెప్పుకునే టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. రవితేజ టైటిల్ రోల్ చేసిన ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించారు. వంశీ దర్శకత్వంలో తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 20న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'ఏక్ దమ్... ఏక్ దమ్' అంటూ జోష్‌గా సాగే పాట లిరికల్ వీడియోను ఈ నెల 5న విడుదల చేయనున్నట్లు వెల్లడించి, పోస్టర్‌ను విడుదల చేసింది యూనిట్. నూపుర్ సనన్‌ను రవితేజ ఆటపట్టించే సందర్భంలో ఈ పాట వస్తుందని తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, సహనిర్మాత: మయాంక్ సింఘానియా.


క్లైమాక్స్ బాగుంటే హిట్టే

- శివ నిర్వాణ


హేషమ్, రవిశంకర్, శివ నిర్వాణ, నవీన్

విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఖుషి'. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం యూనిట్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శివ నిర్వాణ మాట్లాడుతూ– ''శాస్త్రాలు, సిద్ధాంతాలు వేరు కావొచ్చు. కానీ ఎవరు ఏది నమ్మినా నమ్ముకున్నా మనం మనల్ని ప్రేమించే మనుషులతో కలిసి ఉండాలని 'ఖుషి'లో చెప్పాం. క్లైమాక్స్ బాగుందని ప్రశంసలు వస్తున్నందుకు హ్యాపీగా ఉంది. క్లైమాక్స్ బాగుంటే సినిమా హిట్టే.. ఫెయిల్ అయిన చరిత్ర లేదు'' అన్నారు. ''షో బై షో కలెక్షన్స్ పెరుగుతున్నాయని రిపోర్ట్స్ వస్తున్నాయి. 'ఖుషి' మంచి మూవీ కాబట్టి అవార్డులూ రావొచ్చు'' అన్నారు నవీన్. ''కథని నమ్మి 'ఖుషి'ని నిర్మించాం. మా నమ్మకానికి తగ్గట్టు ఫలితాలు సానుకూలంగా వస్తున్నాయి'' అన్నారు వై. రవిశంకర్. ఈ కార్యక్రమంలో చిత్ర సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్, సినిమాటోగ్రాఫర్ మురళి, మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశి పాల్గొన్నారు.

ప్రేమదేశంలో..


విరాట్, ప్రియాంక, యామిన్

''ఎంతో కష్టపడితే దర్శకుడిగా 'ప్రేమదేశపు యువరాణి'తో తొలి చాన్స్ వచ్చింది. సినిమా బ్లాక్‌బస్టర్ అయిందా లేదా అన్నది కాదు.. నిర్మాతకు డబ్బులొస్తే అదే పెద్ద సక్సెస్'' అని సాయి సునీల్ నిమ్మల అన్నారు. యామిన్ రాజ్, విరాట్ కార్తీక్, ప్రియాంక రేవ్రి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ప్రేమదేశపు యువరాణి'. సాయి సునీల్ నిమ్మల దర్శకత్వంలో ఆనంద్ వేమూరి, హరిప్రసాద్ సీహెచ్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి అతిథులుగా హాజరైన నటులు అరవింద్ కృష్ణ, శివారెడ్డి మాట్లాడుతూ– ''ఈ చిత్రం ట్రైలర్, పాటలు చాలా బాగున్నాయి. సినిమా హిట్టవ్వాలి'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ, కుటుంబ భావోద్వేగాలు, డ్రామా ఉన్నాయి'' అన్నారు యామిన్ రాజ్.

క్లుప్తంగా...

సూపరింటెండెంట్‌లుగా ప్రొఫెసర్‌లకు అవకాశం

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోని బోధనాస్పత్రుల సూపరింటెండెంట్‌లుగా ప్రొఫెసర్‌లకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నిబంధనలను సవరిస్తూ శుక్రవారం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటి వరకు ప్రొఫెసర్ నుంచి అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(ఏడీఎంఈ)గా పదోన్నతి పొందిన వారిని బోధనాస్పత్రులకు సూపరింటెండెంట్‌లుగా నియమిస్తూ వస్తున్నారు. తాజా నిర్ణయంతో ఏడీఎంఈల తోపాటు బోధనలో 10 ఏళ్ల అనుభవం ఉండి ప్రొఫెసర్‌గా ఐదేళ్లు పనిచేసిన వారికి సూపరింటెండెంట్‌గా అవకాశం కల్పిస్తారు. వైద్య కళాశాలలకు ప్రిన్సిపాల్‌గా ఏడీఎంఈల నిబంధన యథావిధిగా కొనసాగుతుంది.

ఏపీలో రూ.3,479 కోట్ల జీఎస్టీ వసూలు

- గతేడాదితో పోలిస్తే 10% వృద్ధి

సాక్షి, న్యూఢిల్లీ: ఆగస్టులో జీఎస్టీ వసూలు వివరాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసింది. ఏపీలో గతేడాదితో పోలిస్తే 10% వృద్ధితో రూ.3,479 కోట్ల జీఎస్టీ వసూలు అయినట్లు పేర్కొంది. అలాగే తెలంగాణలో రూ.4,393 కోట్ల జీఎస్టీ వసూలు అయినట్లు వెల్లడించింది.

సహిత రిసోర్స్ పర్సన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ(పాఠశాల విద్యాశాఖ) ద్వారా నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహిత విద్యా రిసోర్స్ పర్సన్స్ పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్షణ ఎస్పీడీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపా రు. తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పో స్టులు 396 ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగలవా రు ఈ నెల 4 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఓపెన్ కేట గిరి అభ్యర్థులకు 18–42 ఏళ్ల వయసుండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్లు, మాజీ సైని కోద్యోగులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపునిచ్చారు. జిల్లాల వారీగా పోస్టుల ఖాళీలు, విద్యార్హత వివరాలను apie.apcfss.in వెబ్‌సైట్‌లో ఉంచిన ట్టు తెలిపారు. రూ.100 ఫీజు చెల్లించి ఇదే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూ చించారు. సందేహాలుంటే కార్యాలయ పని దినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 వరకు 79933 29117 నంబర్‌లో సంప్రదించాలని వివరించారు.

కొత్త వైద్య కళాశాలల్లో
తరగతులు ప్రారంభం

నంద్యాలలో 150 మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభం

- విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలలో 116 మంది చేరిక
- మచిలీపట్నంలో 113 మంది, ఏలూరులో 112 మంది హాజరు
- రాజమహేంద్రవరంలో తొలి రోజు తరగతులకు హాజరైన 70 మంది


నంద్యాలలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల హాజరు


విజయనగరంలో ప్రారంభమైన తరగతులు

విజయనగరం ఫోర్ట్/కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/నంద్యాల టౌన్/కోనేరుసెంటర్/ఏలూరు టౌన్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ఐదు మెడికల్ కళాశాలల్లో శుక్రవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లాలోని గాజులరేగ వైద్య కళాశాలలో తొలిరోజు తరగతులను ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల ప్రారంభించారు. అమె మాట్లాడుతూ..మొదటి ఏడాది విద్యార్థులకు అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ విభాగాలకు సంబంధించి పాఠ్యాంశాలను బోధించనున్నట్లు తెలిపారు. ఈ కళాశాలలో అందుబాటులో ఉన్న 150 సీట్లలో ఇప్పటివరకు 116 మంది విద్యార్థులు చేరారని, మరో 34 సీట్లు భర్తీ కావాల్సి ఉందని చెప్పారు. అలాగే, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాలలో కూడా శుక్రవారం తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో నిర్మించిన వైద్య కళాశాలలో తొలిరోజు తరగతులకు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మీ హాజరయ్యారు. మొత్తం 150 మంది విద్యార్థులకు ఫేజ్ 1,2 లలో 120 మందికి కౌన్సిలింగ్ పూర్తి చేసి ప్రవేశాలు కల్పించారు. తొలిరోజు తరగతులకు 70 మంది హాజరయ్యారు. నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాదరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద కుమార్‌ల ఆధ్వర్యంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. 2023–24 మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులకు సంబంధించి అనాటమీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ విభాగాల్లో 222 మంది బోధన, బోధనేతర సిబ్బందితో, 150 మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభమయ్యాయి. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలోనూ శుక్రవారం తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి 150 సీట్లకుగానూ ఇప్పటివరకూ 113 మంది విద్యార్థులు చేరారు. కళాశాలకు 11 మంది ప్రొఫెసర్లు, 10 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు 17 మంది సీనియర్ రెసిడెంట్లు, ఇతర సిబ్బందిని నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి తెలిపారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు పొందిన 112 మంది విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఏపీ వైద్యవిద్య అదనపు డైరెక్టర్ డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు.


మచిలీపట్నం కళాశాలలో ప్రారంభమైన తరగతులు


ఏలూరులో ఓరియంటేషన్ క్లాస్‌లకు హాజరైన ప్రొఫెసర్లు


రాజమహేంద్రవరంలో బోధన ప్రారంభం

వైద్యవిద్య పీజీ ప్రవేశాల
వెబ్ ఆప్షన్ల నమోదుకు నోటిఫికేషన్

రేపు ఉదయం 10 గంటల వరకు గడువు

సాక్షి, అమరావతి: 2023–24 విద్యాసంవత్సరానికి రాష్ట్ర కోటా పీజీ వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం వెబ్ ఆప్షన్ల నమోదుకు శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీచేసింది. ఇన్ సర్వీస్, నాన్ సర్వీస్ అభ్యర్థులు https:// pgcq.ysruhs.com వెబ్‌సైట్‌లో ఆదివారం ఉదయం 10 గంటలలోపు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించింది. ఆప్షన్ల నమోదు సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే 7416563063, 7416253073, 9063400829 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వీసీ డాక్టర్ బాబ్జీ సూచించారు. పలు కళాశాలల్లో పీజీ సీట్ల పెంపుదలపై ఎన్ఎంసీ పేరిట ఫేక్/ఫోర్జరీ అనుమతి పత్రాలు వెలుగులోకి రావడంతో తొలిదశ కౌన్సెలింగ్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ఎన్ఎంసీ నుంచి స్పష్టత తీసుకుని రివైజ్డ్ సీట్ మ్యాట్రిక్స్‌ను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో విద్యార్థులు మళ్లీ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. తొలిదశలో కేటాయించిన సీట్లు రద్దుచేసిన విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని కోరారు.

జీఎస్ఎల్, మహారాజాల్లోను ఫేక్ అనుమతులు

శాంతీరామ్ వైద్యకళాశాలలో ఫేక్ అనుమతుల వ్యవహారం బయటపడటంతో అప్రమత్తమైన విశ్వవిద్యాలయం అధికారులు మిగిలిన కళాశాలల్లో సీట్లను పరిశీలించారు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లాలోని జీఎస్ఎల్, విజయనగరం జిల్లాలోని మహారాజా ప్రైవేట్ వైద్యకళాశాలల్లోని పీజీ సీట్లకు, ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో చూపిస్తున్న సీట్లకు మధ్య వ్యత్యాసం గుర్తించారు. దీంతో ఎన్ఎంసీకి ఈ వ్యవహారంపై లేఖ రాశారు. ఆయా కళాశాలల్లో పీజీ సీట్ల పెంపుదలకు తాము అనుమతులు ఇవ్వలేదని ఎన్ఎంసీ శుక్రవారం స్పష్టం చేసింది. సీట్లు పెంచుతూ వెలువడిన అనుమతులు ఫేక్/ఫోర్జరీవని తెలిపింది. మరోవైపు 2023–24 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా అన్ని రాష్ట్రాల డీఎంఈలు ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారాన్నే పరిగణలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. సాధారణ ప్రజలు సైతం ఇతర మాధ్యమాల్లో పొందుపరిచే సమాచారాన్ని నమ్మవద్దని సూచించింది.



ఈ నెల 17న సభ నిర్వహించుకోండి

ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో తలపెట్టిన బహిరంగ సభను ఈ నెల 17న నిర్వహించుకోవాలని ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘానికి హైకోర్టు స్పష్టం చేసింది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకే సభ నిర్వహించాలని పేర్కొంది. సభకు 500 మంది మాత్రమే హాజరుకావాలని ఆదేశించింది. సభకు హాజరయ్యే వారి ఆధార్ కార్డులను ముందుగానే పోలీసులకు అందచేయాలని నిర్వాహకులను ఆదేశించింది. ఈ సభలో రెచ్చగొట్టే, విద్వేషపూరిత ప్రసంగాలు చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. షరతులను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని పోలీసులకు చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో సెప్టెంబర్ 1న విజయవాడలో ర్యాలీ, బహిరంగసభ నిర్వహణకు ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం నిర్ణయించింది. వెయ్యిమందితో జింఖానా గ్రౌండ్స్‌లో బహిరంగసభకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సంఘం కార్యదర్శి హుస్సేన్ పోలీసులకు వినతిపత్రం ఇచ్చారు. బహిరంగసభ నిర్వహణకు పోలీసులు అనుమతిని నిరాకరించారు. దీంతో ప్రైవేటు స్థలంలో బహిరంగ సభకు సంఘం నిర్ణయించింది. ఇందుకు పోలీసుల అనుమతి కోరింది. పోలీసులు తమ నిర్ణయం చెప్ప లేదు. దీంతో సంఘం కార్యదర్శి హుస్సేన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి.. ర్యాలీకి అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. సభ నిర్వహణకు అనువైన తేదీని ఎంపిక చేసుకుని చెప్పాలని పిటిషనర్ న్యాయవాదిని ఆదేశిస్తూ విచారణను శుక్రవారానికి వాయిదా వేసిన విషయం తెలిసిందే. శుక్రవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా పిటిషనర్ న్యాయవాది ఏ తేదీని కూడా తెలియజేయలేదు. దీంతో న్యాయమూర్తే ఈ నెల 17న సభ నిర్వహించుకోవాలంటూ పలు షరతులు విధించారు. విద్యుత్ కార్మిక సంఘాలు తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి సైతం హైకోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఈ నెల 10న ధర్నా నిర్వహించుకోవాలని కార్మిక సంఘాలను ఆదేశించింది. ఈ ధర్నాలో 500 మందికి మించి పాల్గొనరాదని స్పష్టం చేసింది.

11 నుంచి వైద్యుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూ

- ఇంటర్వ్యూల తేదీల్లో మార్పులు
- 337 స్పెషలిస్ట్ వైద్య పోస్టుల భర్తీ


సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్యశాఖలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో 14 స్పెషాలిటీల్లో వైద్యపోస్టుల భర్తీకి ఈ నెల 5వ తేదీ నుంచి నిర్వహించాల్సిన వాక్-ఇంటర్వ్యూను వారం రోజులు వాయిదా వేశారు. 11వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయని ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది. ఈ మేరకు సవరించిన నోటిఫికేషన్‌ను శుక్రవారం జారీచేసింది. తాజా నోటిఫికేషన్‌లో ఏపీవీవీపీలో 300 పోస్టులకు అదనంగా, నేషనల్ హెల్త్ మిషన్‌లో 37 పోస్టులు వచ్చి చేరాయి. 11వ తేదీన జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెర్మటాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, 13వ తేదీన గైనకాలజీ, అనస్తీషియా, ఈఎన్టీ, పాథాలజీ, 15వ తేదీన పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఆప్తమాలజీ, రేడియాలజీ, చెస్ట్ డిసీజెస్ స్పెషాలిటీల వారీగా ఇంటర్వ్యూలు ఉంటాయి. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరవ్వాల్సి ఉంటుందని బోర్డు మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. రెగ్యులర్ (లిమిటెడ్, జనరల్)/కాంట్రాక్ట్ విధానాల్లో వైద్యుల నియామకం ఉంటుందని తెలిపారు. అదనపు వివరాల కోసం http://hmfw.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో గత నాలుగేళ్లలో 53 వేలకు పైగా పోస్టుల భర్తీ చేపట్టారు. మరోవైపు వైద్యశాఖలో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీచేసేలా అత్యవసర ఉత్తర్వులను జారీచేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మను దేవదాయ శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్. కరికల వలవన్, కమిషనర్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలు అందించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 523.30 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 851.70 అడుగుల వద్ద ఉంది.



పవిత్రమైనది నర్సింగ్ వృత్తి

చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ సైన్సెస్ ఆవరణలో శుక్రవారం 30వ రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. -IIలో▸

న్యూస్‌రీల్

దుర్గగుడి గోసంరక్షణ పథకానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల గోసంరక్షణ పథకానికి కాళహస్తికి చెందిన డి.ప్రణతి కృష్ణ కుటుంబం రూ. లక్ష విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా.. దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను ఆలయ ఈవో భ్రమరాంబ అందజేశారు.

డీసీహెచ్‌ఎస్‌గా శ్రావణ్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా ప్రభుత్వాస్పత్రుల కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ పి. శ్రావణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీసీహెచ్‌ఎస్‌గా గుడివాడ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఇందిరాదేవి ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు. ఈమె స్థానంలో పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ అనకాపల్లి ప్రభుత్వాస్పత్రి సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్‌ను డీసీహెచ్‌ఎస్‌గా నియమించారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ పి. రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

సమృద్ధిగా యూరియా నిల్వలు

కంకిపాడు(పెనమలూరు): జిల్లా అంతటా సమృద్ధిగా యూరియా నిల్వలు ఉన్నాయని కృష్ణా జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి తెలిపారు. గత నెల 30న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన యూరియా కొరత, ఈనాడులో ప్రచురితమైన 'యూరియా.. ఏదయా' కథనాన్ని తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతుభరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ప్రైవేటు డీలర్లకు 46,360 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు. రైతుభరోసా కేంద్రాల వద్ద 3,850 మెట్రిక్ టన్నులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో 3,280 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 16,840 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతుభరోసా కేంద్రాల ఇండెంట్ ప్రకారం రెండు, మూడు రోజుల్లో యూరియా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో జరిగే ఎరువుల అమ్మకాల్లో 50 శాతం అమ్మకాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాల ద్వారా జరుగుతుందన్నారు. ఎంఆర్‌పీ ధరల కంటే ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయాలని, తద్వారా సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటామని వివరించారు. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా ఎరువులు నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): గుంతకల్లు డివిజన్‌లో జరుగుతున్న ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా విజయవాడ మీదుగా నడిచే పలు రైళ్లను పూర్తిగా, కొన్నింటిని పాక్షికంగానూ రద్దు చేయడంతో పాటు మరికొన్నింటిని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి–హుబ్లీ (07657) రైలు ఈ నెల 4, 5, 9 తేదీలలో, హుబ్లి–తిరుపతి (07658) రైలు ఈ నెల 5, 6, 10 తేదీలలో పూర్తిగా రద్దు చేశారన్నారు. విశాఖపట్నం–కడప (17488) ఈ నెల 4, 5, 9 తేదీలలో, కడప–విశాఖపట్నం (17487) ఈ నెల 5, 6, 10 తేదీలలో తిరుపతి–కడప మధ్య పాక్షికంగా రద్దు చేసినట్లు చెప్పారు. అదే విధంగా మచిలీపట్నం–ధర్మవరం (17215) ఈ నెల 4, 5 తేదీలలో, ధర్మవరం–మచిలీపట్నం (17216) ఈ నెల 5, 10 తేదీలలో నంద్యాల, డోన్, గుత్తి మీదుగా దారి మళ్లించినట్లు ప్రకటించారు.

ప్రత్యేక రైలు పొడిగింపు..

సికింద్రాబాద్–రామనాథపుర (07695/07696) మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలును ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 6 నుంచి 29 వరకు పొడిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మాలో.. మాతో వైఎస్సార్

- ఉమ్మడి కృష్ణా జిల్లా అభివృద్ధికి మూలం ఆయనే
- కృష్ణా డెల్టాకు ప్రాణప్రదం
- రూ.4,576 కోట్ల ఆధునికీకరణ పనులకు దివిసీమలో శ్రీకారం
- రాష్ట్రంలోనే తొలి ఫిషరీస్ కాలేజీ ఏర్పాటు
- మునేరు డ్యాం, వేదాద్రి ఎత్తిపోతల ఫేజ్ -1, ఫేజ్-2లకు ఆద్యుడు

దేశ చరిత్రలోనే సంక్షేమానికి సరికొత్త నిర్వచనం ఇచ్చిన పాలకుడు.. ప్రజావసరాలే పాలనకు ప్రధానాంశాలు అని చాటి చెప్పిన ప్రజానాయకుడు.. దూరమై దగ్గరైన మహా మనీషి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన భౌతికంగా వీడిపోయి 14ఏళ్లు పూర్తవుతున్నా.. నాటి స్వర్ణయుగం నేటికీ పేద గుండెల్లో పదిలంగానే ఉంది. ఆయన మాట ఇప్పటికీ ప్రజా హృదయాల్లో మార్మోగుతూనే ఉంది. శ్రామికుడి నుంచి కర్షకుడి వరకూ.. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ.. సామాన్యుల నుంచి విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తల వరకూ అందరికీ ఆనాటి స్మృతులు ఇంకా వెన్నంటే ఉన్నాయి. శనివారం ఆ మహానేత వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం.



జనహృదిపై చెరగని రాజన్న సంతకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్)/అవనిగడ్డ: ఉమ్మడి కృష్ణా జిల్లాకు ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సేవలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. కృష్ణా డెల్టా ముంపు నివారణకు డెల్టా ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. రూ.4,570 కోట్లతో ఆధునికీకరణ పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చారు. కృష్ణా ఆయకట్టు చివరి భూములకు సైతం కాలువల ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు కృషి చేశారు. విజయవాడ, గుంటూరు నగరాల దాహార్తిని తీర్చేందుకు పులిచింతల ప్రాజెక్టును నిర్మించారు. బందరు పోర్టుకు అంకురార్పణ చేశారు. బందరు పోర్టు నిర్మించాలన్న ఆ ప్రాంత ప్రజల కల నేడు సాకారం కాబోతున్న వేళ అక్కడి ప్రజలు రాజన్నను తలచుకుంటున్నారు.

దివిసీమపై చెరగని ముద్ర..

- రూ.4,576 కోట్లతో చేపట్టిన డెల్టా ఆధునికీకరణ పనులకు అవనిగడ్డ మండలం పులిగడ్డవార్పు వద్ద 2008 జూన్ 6న వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ పనుల వల్ల జిల్లాలో రూ.2,180కోట్లు, నియోజకవర్గంలో రూ. 165 కోట్లు పనులు జరిగాయి.
- మత్స్య పారిశ్రామిక రంగంలో నిపుణులను తయారు చేయాలన్న సంకల్పంతో వైఎస్ దేశంలోనే తొలి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలను నాగాయలంక మండలం భావదేవరపల్లిలో ఏర్పాటు చేశారు. 2007 సెప్టెంబర్ 7వ తేదీన అవనిగడ్డ గాంధీక్షేత్రంలో ఈ కళాశాలను తాత్కాలికంగా ఏర్పాటు చేయగా, అనంతరం భావదేవరపల్లిలో 8.58 ఎకరాల విస్తీర్ణంలో రూ.2కోట్లతో నిర్మించిన నూతన భవనాల్లోకి ఈ కళాశాలను మార్చారు. ఈ కళాశాల నుంచి వందలాది మంది మత్స్య నిపుణులు తయారయ్యారు.
- కరకట్ట డబుల్ లైన్ అభివృద్ధి పనులకు రూ.138 కోట్లు మంజూరు చేయగా, 2006 మే 27న ఈ పనులకు వైఎస్ శంకుస్థాపన చేశారు. ఈ రహదారి వల్ల అవనిగడ్డ – విజయవాడ మధ్య 22 కి.మీ దూరం తగ్గింది.
- గుల్లలమోద నుంచి సాలెంపాలెం వరకూ 22కి.మీ కరకట్ట రహదారి అభివృద్ధి వైఎస్సార్ హయాంలోనే జరిగింది. 2006లో రూ.22 కోట్లతో సముద్రపు కరకట్టను ఆధునీకరించగా, 2008లో మరో రూ.20 కోట్లతో మరోసారి కరకట్టను అభివృద్ధి చేశారు.
- 1978లో వేసిన విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో దివిసీమలో తరచూ విద్యుత్‌కు అంతరాయం కలిగేది. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూ.64కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్లు, కొత్తలైన్లు ఏర్పాటు, విద్యుత్‌లైన్ల ఆధునీకరణ పనులు చేపట్టారు.



కృష్ణా గుంటూరు జిల్లాలకు సంజీవని వంటి పులిచింతల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్(ఫైల్)



వైఎస్సార్ హయాంలో నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించిన మునేరు డ్యాం



అవనిగడ్డలో వ్యవసాయ ప్రదర్శనను ప్రారంభిస్తున్న వైఎస్సార్ (ఫైల్)

ఎన్టీఆర్ జిల్లాలో..

విజయవాడ నగరంలో కాల్వ గట్లు , కొండ ప్రాంతాల్లో నివసించే పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ జక్కంపూడిలో వారికోసం కాలనీ నిర్మించారు. అధికారం చేపట్టిన తొలి ఏడాది నాటి ఉమ్మడి జిల్లా నేటి ఎన్టీఆర్ జిల్లాలో పల్లె బాట చేపట్టి జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల పరిధిలోని పోలంపల్లి, వేదాద్రి, చెరువు కొమ్ముపాలెం గ్రామాలలో పర్యటించారు. వేదాద్రి ఎత్తిపోతల పథకం ఫేజ్ -1ను ప్రారంభించి, ఫేజ్ -2 పనులకు శంకుస్థాపన చేశారు. జగ్గయ్యపేట నియోజవర్గం పరిధిలోని 25వేల ఎకరాలకు ఆయకట్టుకు సాగునీరందించే మునేరు డ్యాం అభివృద్ధి పనులకు రూ. 36 కోట్లు మంజూరు చేశారు. మునేరు ఆనకట్ట, రోడ్ కం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించారు. విజయవాడ నగరంలో బుడమేరు ముంపు నివారణకు చర్యలు చేపట్టారు. మహానేత హయాంలోనే మైలవరం నియోజవకర్గంలో చేపట్టిన పోలవరం కుడికాలువ నిర్మాణం పూర్తయ్యింది.

ఉన్నత స్థాయికి ఎదిగాను..



నేను బీసీ వర్గానికి చెందిన వాడిని. మాది సామాన్య కుటుంబం. బీసీ వర్గాల్లో ఉన్నత విద్య అందని ద్రాక్ష. కానీ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ అందించి పేదలందరికీ కార్పొరేట్ విద్య అందించారు. నేను 2008లో కేఎల్‌యూలో ఇంజినీరింగ్ సీటు సాధించా. రాజన్న ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ అందుకుని ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ఈ రోజు ఐటీ రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగా.

– గాజ సత్యప్రకాష్, జుజ్జూరు. ఐటీ నిపుణుడు

రొయ్యల నిపుణుడిని అయ్యా..



నేను 2008–10బ్యాచ్ విద్యార్థిగా భావదేవరపల్లి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఫిషరీస్ సైన్స్ పూర్తి చేశా. ఇపుడు ప్రైవేటు సంస్థల్లో చేపలు, రొయ్యల నిపుణుడిగా పనిచేస్తున్నా. ఇక్కడ చదివిన వారంతా మంచి ఉన్నతస్థితిలో ఉన్నారు. మాది మధ్యతరగతి కుటుంబం. నేను, నా కుటుంబం సమాజంలో ఉన్నత స్థానంలో గౌరవ మర్యాదలతో బతుకుతున్నామంటే మహానేత రాజశేఖరరెడ్డి చలవే.

– ముజిమిల్ రెహమాన్, ఆక్వా ఎక్స్‌పర్ట్

ఆయన పుణ్యమే



మాది నిరుపేద కుటుంబం. చిరువ్యాపారం చేసుకుంటూ జీవించేవాళ్లం. కుటుంబాన్ని పోషించే నాకు 2003లో అకస్మాత్తుగా గుండె నొప్పి వచ్చింది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పెట్టిన ఆరోగ్య శ్రీ పథకంలో ఉచితంగా సర్జరీ చేశారు. రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం అందుకున్నాను. నేను ఈ రోజు బతికి ఉన్నానంటే ఆయన పుణ్యమే. నా జీవితం మహానేత పెట్టిన భిక్ష.

– సయ్యద్ హసన్, చల్లపల్లి



దసరా ఉత్సవాలు.. తొమ్మిది రోజులు

- అక్టోబర్ 15 నుంచి ప్రారంభం
- 23వ తేదీన ఆది దంపతుల హంసవాహన సేవతో ముగింపు
- ప్రత్యక్ష, పరోక్ష పూజలకు అవకాశం
- వివరాలు ప్రకటించిన ఇంద్రకీలాద్రి దేవస్థానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ఈ ఏడాది తొమ్మిది రోజులపాటు కొనసాగనున్నాయి. అక్టోబర్ 15వ తేదీన దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 23వ తేదీ సాయంత్రం కృష్ణా నదిలో ఆది దంపతులకు నిర్వహించే హంసవాహన సేవతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. ఉత్సవాలలో అమ్మవారికి నిర్వహించే ప్రత్యేక ఆర్జిత సేవల వివరాలను దేవస్థానం శుక్రవారం విడుదల చేసింది. 15వ తేదీ తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, అలంకరణ, పూజల అనంతరం ఉదయం 9 గంటలకు దర్శనానికి అనుమతిస్తారు. 9 రోజులు అమ్మవారికి రోజుకో విశేషమైన అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఆర్జిత సేవలకు ప్రాధాన్యం..

దసరా ఉత్సవాలలో అమ్మవారి విశేష అలంకరణ ఎంత విశిష్టత ఉంటుందో అమ్మవారి ఆలయంలో జరిగే ఆర్జిత సేవలకు అంతే డిమాండ్ ఉంటుంది. ఉత్సవాలలో అమ్మవారికి నిర్వహించే ఖడ్గమాలార్చన, కుంకుమార్చన, చండీహోమం, శ్రీచక్రనవార్చన వంటి సేవల్లో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పాల్గొనే అవకాశం ఉంది. ప్రత్యక్ష పూజలకు నిర్ణీత రుసుం చెల్లించాల్సి ఉండగా, పరోక్ష పూజలకు గాను విడివిడిగానూ, మొత్తం 9 రోజులకు ఏకమొత్తంగానూ చెల్లించే అవకాశాన్ని దేవస్థానం కల్పిస్తోంది. ఈ ఏడాది దసరా ఉత్సవాలలో అమ్మవారికి ప్రత్యేక ఖడ్గమాలార్చనను ప్రత్యేక సేవగా నిర్వహించాలని దేవస్థానం నిర్ణయించింది. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలోని మహామండపం ఆరో అంతస్తులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అమ్మవారికి జరిగే ఆర్జిత సేవలివే..

దసరా ఉత్సవాలలో ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు ప్రత్యేక ఖడ్గమాలార్చన నిర్వహిస్తారు. మహా మండపం ఆరో అంతస్తులో అమ్మవారి ఉత్సవమూర్తి వద్ద ఈ ఖడ్గమాలార్చన జరుగుతుంది. దీని కోసం ఉభయ దాతలు రూ. 5,116 చెల్లించాల్సి ఉంటుంది. 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు 8 రోజుల పాటు ఈ సేవ భక్తులకు అందుబాటులో ఉంటుంది. ఈ సేవలో భక్తులు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పాల్గొనవచ్చు.

ప్రత్యేక కుంకుమార్చన టికెట్ రూ. 3 వేలు..

దసరా ఉత్సవాలలో అమ్మవారికి నిర్వహించే ప్రత్యేక కుంకుమార్చన టికెట్ ధరను దేవస్థానం రూ. 3 వేలుగా నిర్ణయించింది. ఉత్సవాలలో మొదటి రోజు మినహా మిగిలిన అన్ని రోజులు రెండు షిఫ్టులలో కుంకుమార్చన జరుగుతుంది. ప్రతి రోజు ఉదయం 7 గంటలకు మొదటి షిఫ్ట ప్రారంభం కానుండగా, రెండో షిఫ్ట ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుంది. ఇక మూలా నక్షత్రం రోజున ప్రత్యేక కుంకుమార్చన టికెట్ ధరను రూ.5 వేలుగా దేవస్థానం నిర్ణయించింది. ప్రత్యేక శ్రీచక్రనవార్చన 9 రోజుల పాటు నిర్వహిస్తున్నారు. 15వ తేదీ ఉదయం 10 గంటలకు సేవ ప్రారంభం కానుండగా, మిగిలిన రోజులలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జరుగుతుంది. దీనికి గాను రూ. 3 వేల టికెట్‌ను భక్తులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ సేవలో భక్తులు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పాల్గొనవచ్చు.

చండీహోమం టికెట్ రూ. 4 వేలు

దసరా ఉత్సవాలలో అమ్మవారికి విశేషంగా నిర్వహించే చండీహోమం మొదటి రోజున ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. ఇక మిగిలిన 8 రోజులు ప్రతి రోజు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. దీనికి దేవస్థానం టికెట్ ధరను రూ. 4 వేలుగా నిర్ణయించింది. ఈ సేవలో కూడా భక్తులు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పాల్గొనవచ్చు.

పరోక్ష పూజలు ఇలా..

దసరా ఉత్సవాలలో 9 రోజుల పాటు అన్ని పూజలను పరోక్షంగా జరిపించుకునేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక ఖడ్గమాలార్చనకు 8 రోజులకు, ప్రత్యేక కుంకుమార్చన, ప్రత్యేక శ్రీచక్రనవార్చన, ప్రత్యేక చండీహోమాలకు 9 రోజులకు ఒక్కో పూజకు గాను రూ. 20 వేలుగా నిర్ణయించారు. ఆయా పూజలలో పాల్గొనే భక్తులు దేవస్థాన టోల్ ఫ్రీ నంబర్(1800 425 9099)కు ఫోన్ చేసి మిగిలిన వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు.

కౌలుకునేలా భరోసా



రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో విజయవాడ డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు

పేద రైతులకు పెట్టుబడి సాయం జమ

- జిల్లాలో 9,929 మందికి రూ. 7.44 కోట్ల మేర లబ్ధి
- 65 మంది రైతులకు రూ. 3.32 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ
- వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ చెక్కు పంపిణీ చేసిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రైతులతో పాటు సొంత భూమి లేని కౌలు రైతులకు ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా భరోసా కల్పిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. సొంత భూములున్న రైతులతో పాటు వ్యవసాయ భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కౌలు రైతులు, అటవీ, దేవదాయ భూములు సాగుచేసుకుంటున్న రైతులకు వైఎస్సార్ రైతు భరోసా ద్వారా మొదటి విడతలో 9,929 మంది రైతులకు రూ.7.44 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. శుక్రవారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల ఖాతాలలో జమ చేసే కార్యక్రమాన్ని వర్చువల్‌గా నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ఢిల్లీరావు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులతో కలిసి వీక్షించారు. అనంతరం జిల్లాకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

రైతు ప్రయోజనాలే ప్రాధాన్యం..

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని 2019 అక్టోబర్ 15 నుంచి ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. పంట సాగు చేసే ప్రతి రైతు కుటుంబానికి రూ. 13,500 ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఐదో ఏడాది మొదటి విడతలో భాగంగా 9,929 మంది కౌలు రైతులకు రూ.7.44 కోట్ల ఆర్థిక సహాయంతో పాటు జూలై, ఆగస్టు నెలలో కురిసిన అధిక వర్షాలలో పంట నష్టపోయిన 65 మంది రైతులకు రూ 3.32 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ ఖాతాలలో జమ చేశారన్నారు.

ఎప్పటి పరిహారం అప్పుడే..

రైతులకు ఆర్థిక చేయూత అందించాలనే ధృడ సంకల్పంతో అనేక కష్టనష్టాలను అధిగమించి క్రమం తప్పకుండా సాయం అందిస్తోందన్నారు. కౌలు రైతులకు రైతు భరోసా ద్వారా ఆర్థికంగా చేయూతనివ్వాలని ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తోందన్నారు. ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారం అందిస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని వివిధ మండలాలలో నువ్వులు, పెసర, మినుము పంటలు నష్టపోయిన 65 మంది రైతులకు రూ.3. 32 లక్షల రాయితీని ఖాతాలలో జమ చేశామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజా రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు టి. శ్రీకాంత్, మనోజ్ కొఠారి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ జమలపూర్ణమ్మ, గీతాంజలిదేవి, లిడ్ క్యాప్ డైరెక్టర్ ఝాన్సీరాణి, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ విజితా సంపత్, వ్యవసాయ శాఖ జేడీ ఎస్. నాగమణిమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె. బాలాజీ కుమార్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

తలుపు తట్టిన కానుక



ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ శుక్రవారం తెల్లవారుజామున ప్రారంభమైంది. గ్రామ, వార్డు సచివాలయాల వలంటీర్లు, సిబ్బంది గడప గడపకు వెళ్లి లబ్ధిదారులకు నగదు అందజేశారు. తొలిరోజు 78.23 శాతం పంపిణీ పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 2,30,662 మంది పెన్షనర్లకు గాను 1,80,440 మంది పెన్షన్ కానుక అందుకున్నారు. జిల్లాలో అత్యధికంగా జి. కొండూరు మండలంలో 89.98 శాతం, ఇబ్రహీంపట్నంలో 85.4శాతం, విజయవాడ రూరల్ మండలంలో 84.37 శాతం, నందిగామ అర్బన్‌లో 84 శాతం, విజయవాడ అర్బన్‌లో 82.96 శాతం పంపిణీ పూర్తయ్యింది. విజయవాడ కృష్ణలంక ప్రాంతంలో కొల్లి నాగరాజుకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ మహాలక్ష్మిని చిత్రంలో చూడొచ్చు.

– గాంధీనగర్(విజయవాడసెంట్రల్)

ప్రివెంటివ్ విజిలెన్స్‌పై ప్రచారం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అవినీతికి వ్యతిరేకంగా, పారదర్శకతతో కూడిన పటిష్టమైన వ్యవస్థను స్థాపించేందుకు విజయవాడ రైల్వే డివిజన్‌లో ప్రివెంటివ్ విజిలెన్స్‌పై ప్రచారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ ఆవిష్కరించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ 3 నెలల పాటు అవగాహన ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. సీనియర్ డీపీఓ బాలమురళీధర్, పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఎమ్ నరేంద్ర ఏ పాటిల్

క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో జస్టిస్ సోమయాజులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జస్టిస్ సోమయాజులు దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

పాలశాతం 13 వస్తే.. లీటరుకు రూ.104

జిల్లా కో ఆపరేటివ్ అధికారి శైలజ

జి.కొండూరు: పాడి రైతులకు మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న పాలవెల్లువలో భాగంగా అమూల్ డెయిరీకి పాలు పోసే పాలఉత్పత్తిదారులకు వెన్నశాతం 13 వస్తే లీటరుకు అధికంగా రూ.104 చెల్లిస్తున్నట్లు జిల్లా కో ఆపరేటివ్ అధికారి శైలజ అన్నారు. మండల పరిధి హెచ్ ముత్యాలంపాడు గ్రామంలో సర్పంచ్ కాజా సంధ్యారాణి అధ్యక్షతన నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న పాలవెల్లువపై అవగాహన, శిక్షణ, లోన్‌మేళా నిర్వహించారు. హెచ్ ముత్యాలంపాడు, కందులపాడు, ఆత్కూరు, వెలగలేరు గ్రామాలకు చెందిన పాల ఉత్పత్తిదారులు హాజరయ్యారు. కేడీసీసీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వాసవి మాట్లాడుతూ అమూల్ డెయిరీలో పాలుపోస్తున్న మహిళలకు పశువులను కొనుగోలు చేసేందుకు తమ బ్యాంకు నుంచి రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. డెయిరీలో క్రమం తప్పకుండా మూడు నెలలు పాలుపోసిన మహిళలకు గేదెలు కొనుగోలు చేసేందుకు రూ.91,170, ఆవులకు రూ.74,470 చొప్పున రుణాలను అందిస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ సలహా సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కాజా బ్రహ్మయ్య మాట్లాడుతూ హెచ్ ముత్యాలంపాడు నుంచి జిల్లాలోనే అత్యధికంగా రోజుకు 160 లీటర్ల పాలను అమూల్ డెయిరీకి పోస్తున్నట్లు చెప్పారు. రైతులకు త్వరితగతిన రుణాలను అందజేసి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, నందిగామ డివిజన్ పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు కాటూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ అనూరాధ పాల్గొన్నారు.

అడవుల ఆక్రమణదారులపై వారంలో క్రిమినల్ కేసులు నమోదు

- అటవీ భూములతో పాటు వన్యప్రాణులను సంరక్షించండి
- కృష్ణా కలెక్టర్ రాజాబాబు



అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): అడవుల ఆక్రమణదారులపై వారం రోజుల్లో క్రిమినల్ కేసులను నమోదు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం జిల్లా స్థాయి అటవీ, వన్య ప్రాణి సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అటవీ భూములతో పాటు వన్యప్రాణులనూ సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత జిల్లాలో అటవీ విస్తీర్ణం 28,008.84 హెక్టార్లు ఉందని చెప్పారు. జాతీయ అటవీ విధానం 1988 ప్రకారం 33 శాతం విస్తీర్ణం ఉండాల్సి ఉండగా 7.42 శాతం అటవీభూమి ఉందన్నారు. 33 శాతం అటవీ భూమిని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీనిలో భాగంగా ఎంతటి వారినైనా సరే విడిచిపెట్టవద్దని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. మెట్లపల్లి బీట్ పరిధిలోని సురవరం, పోతురాజుగట్టు, నూతులగట్టు, మెట్లపల్లి, మాలగట్టు, కాట్రేనిపాడు అటవీ భూభాగంలోని 310.39 హెక్టార్లలో ఆక్రమణలు జరిగినట్లు గుర్తించామన్నారు. కానూరు రిజర్వు ఫారెస్ట్‌లో 635.77 హెక్టార్ల అటవీ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం ఆలీవ్ రిడ్లీ సముద్ర తాబేళ్లు షెడ్యూలు–1 జాతి కిందకు వస్తాయని తెలిపారు. జాలర్ల మరబోట్లలో ఫ్యాన్ చక్రం తాకడంతో వాటి మరణాల శాతం ఎక్కువగా ఉన్నాయన్నారు. మరణాలను తగ్గించడానికి మత్స్యశాఖ మరబోట్లకు లైసెన్సులు, అనుమతులు ఇవ్వడానికి ముందు.. తప్పనిసరిగా ప్రత్యేకమైన పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపి షరతులతో కూడిన అనుమతులు ఇవ్వాలన్నారు. దీనిపై మత్స్యకారులకు అవగాహన కల్పించాలని సూచించారు. మచిలీపట్నంలో నగరవనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. దీనికి బీచ్ ప్రాంతంలో 20 ఎకరాలు గుర్తించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి రెవెన్యూ, అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. హంసలదీవి, మోపిదేవి, వాడరేవు, హార్బర్ తదితర ప్రాంతాల్లో పర్యాటక సర్క్యూట్‌ను ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలన్నారు. డీఎఫ్‌వో రాజశేఖర్ మాట్లాడుతూ అటవీశాఖ గెజిట్ రికార్డుల ప్రకారం హార్బర్‌కు 225 ఎకరాలు ఇచ్చినట్లు ఉందని, రెవెన్యూ రికార్డుల ప్రకారం 406 ఎకరాలు ఇచ్చినట్లు చూపిస్తున్నారన్నారు. దీనిపై రెవెన్యూ, సర్వే, అటవీశాఖల అధికారులు ఉమ్మడి సర్వే చేయాల్సి ఉందని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సర్వేకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు జరపడానికి ప్రతిపాదనలను మంగళగిరి అటవీశాఖ ప్రధాన కార్యాలయానికి పంపాలని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ శ్రీహరిరావు, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవో ఐ.కిషోర్, సర్వేశాఖ ఏడీ రంగారావు, తహసీల్దార్ శ్రీవిద్య, ఎఫ్ఆర్‌వోలు సీహెచ్ సుజాత, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి వెంకటేశ్వరప్రసాద్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులు హెల్త్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ అధికారి వెంకటేశ్వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీంను 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో కొత్తగా అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులు హెల్త్ స్కీం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్ట్ ఆరోగ్య బీమా జర్నలిస్టుకు, భార్య లేక భర్త, పిల్లలు, జర్నలిస్ట్‌పై ఆధారపడిన తల్లిదండ్రులకు వర్తిస్తుందని వివరించారు. ఈ హెల్త్ స్కీంకు రూ. 2,500 ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం రూ. 1250 చెల్లిస్తుందని, జర్నలిస్ట్ వాటాగా మిగిలిన రూ. 1250 కట్టాల్సి ఉంటుందని తెలిపారు. జర్నలిస్ట్ వాటాగా చెల్లించాల్సిన ప్రీమియాన్ని డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీ. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా హెడ్ ఆఫ్ ఎకౌంట్ 8342–00–120–01–03–001–001, డీడీవో కోడ్ 2220–60–001–003 పద్దుకు చెల్లించాలన్నారు. గతంలో హెల్త్‌కార్డులు ఉండి రెన్యువల్ చేసుకునే జర్నలిస్టులు ఒరిజినల్ చలానాతో పాటు గతంలో జారీ చేసిన హెల్త్‌కార్డు, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డు, ఆధార్, రేషన్‌కార్డు నకళ్లను జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని వివరించారు. కొత్తగా హెల్త్ స్కీంలో చేరాలనుకునే వారు ఒరిజినల్ చలానాతో పాటు నిర్దేశించిన దరఖాస్తులో వివరాలు పూర్తి చేసి జర్నలిస్ట్, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆధార్, ఫోటో, రేషన్‌కార్డు, కొత్తగా మంజూరైన అక్రిడేషన్ కార్డులతో హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూజేహెచ్ఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా శ్రీనివాసరావు



గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు – 2023కు పట్టణంలోని ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజిక్స్)గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు ఎంపికయ్యారు. 2000లో స్థానిక 7వ వార్డులోని మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా చేరిన ఆయన 2004లో స్కూల్ అసిస్టెంట్(ఫిజిక్స్)గా పదోన్నతి పొందారు. 2022లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన ఆయన ఆప్కాక్ జిల్లా కో–ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ ఈ ఏడాది ఆగస్టు 15న కలెక్టర్, ఇన్‌చార్జ్ మంత్రి రోజా చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందిన శ్రీనివాసరావును పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కులం పేరుతో దూషించిన కేసులో జైలు, జరిమానా

చిలకలపూడి(మచిలీపట్నం): దళిత మహిళను కులం పేరుతో దూషించి బెదిరించిన ముగ్గురు నిందితులు ఒక్కొక్కరికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 2 వేలు జరిమానా విధిస్తూ పదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ. నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. గుంటూరుకు చెందిన చిన్నం మేరీవసంతకుమారి మచిలీపట్నంలోని సర్కారుతోటలో నివసిస్తున్న తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగోకపోవటంతో వారిని గుంటూరులోని ఆమె ఇంటికి తీసుకెళ్లాలనుకున్నారు. 2017 సెప్టెంబర్ 2న ఆటోలో సామగ్రి ఎక్కిస్తున్నారు. ఆ సమయంలో తోట శ్రీనివాసరావు, తోట వెంకట సుబ్బారావు (వాసు), చలమలశెట్టి అజయ్‌కుమార్ (అజ్జి).. వసంతకుమారిని కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించారు. ఘటనపై ఆమె చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసుకు సంబంధించి ఏపీపీ కమ్మగంటి చంద్రశేఖరరావు తొమ్మిది మంది సాక్ష్యులను ప్రవేశపెట్టగా నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

గంజాయి రవాణా కేసులో తొమ్మిది మంది అరెస్ట్

5 కేజీల గంజాయి స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గంజాయిని రవాణా చేస్తున్న తొమ్మిది మంది యువకులను కొత్తపేట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం పీఎస్ పరిధిలో కొంత మంది యువకులు ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్, కొత్తపేట పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అనుమానితులపై నిఘా పెట్టారు. కొంతమంది యువకులు గురువారం గంజాయి తీసుకుని వించిపేట నైజాంగేటు ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ఆ యువకులు ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తెచ్చి స్థానికంగా ఉన్న మరో ముగ్గురికి అందిస్తున్నట్లు తేలింది. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వించిపేట నైజాంగేటు ప్రాంతానికి చెందిన దేసమల రవితేజ, రుద్రపాటి నితిన్ జోషి, కందుల సృజన్‌కుమార్, నిమ్మగడ్డ రాహుల్, వించిపేట అబ్దుల్ రజాక్ వీధికి చెందిన మువ్వ సాయికుమార్, కేఎల్‌రావునగర్ చిన్న చర్చి ప్రాంతానికి చెందిన చల్లా నరసింహారావు, నాగమ్మ సత్రం ప్రాంతానికి చెందిన చల్లా శ్రీను, కొత్తపేట బడే సాహెబ్ వీధికి చెందిన కలిసేటి సాయికుమార్, కొత్తపేట బ్రాహ్మణ వీధికి చెందిన పిళ్లా గౌతమ్‌గా గుర్తించారు. వీరిలో కొంత మంది ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి కొత్తపేటలో ఉండే వారికి విక్రయిస్తున్నారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను సీఎంఎం కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

హాజరైన దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ



పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఇంద్రకీలాద్రిపై గత నెల 30వ తేదీ నుంచి పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. శుక్రవారం ఉదయం ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. పూర్ణాహుతి కార్యక్రమానికి దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ, చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ హాజరయ్యారు. ఉదయం 8 గంటలకు మండపారాధన, కుష్మాండ బలి వంటి కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు నిర్వహించగా, వేద ఆశీర్వచనం జరిగింది. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ సభ్యుడిగా ఖాజా నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న ఖాజా, ప్రజాప్రతినిధులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ వక్ఫ్‌బోర్డ్ ముతవలి కోటాలో జరుగనున్న ఎన్నికల్లో బోర్డ్ సభ్యుడిగా విజయవాడ భవానీపురానికి చెందిన షేక్ ఖాజా నామినేషన్ దాఖలు చేశారు. విజయవాడ రూరల్ మండలం నల్లకుంట సెంటర్‌లోని హజరత్ మజీలీ బాబా దర్గా ముతవలిగా వ్యవహరిస్తున్న ఖాజా ముతవలి కోటాలో నామినేషన్ వేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని లక్కీ ఉస్మాన్ మస్జిద్‌లో శుక్రవారం జుమా నమాజ్ అనంతరం ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షులు షేక్ గౌస్ మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌తో కలిసి మైనార్టీ కమిషనర్ మస్తాన్ వలీ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా ముతవల్లీలు, మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు, పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పడేశాడు.. బాధ్యతతో తీశాడు..

- సింగ్‌నగర్‌లోని డ్రెయిన్‌లో డ్రింక్ బాటిల్ పడేసిన విద్యార్థి
- ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలను వివరించిన కలెక్టర్ ఢిల్లీరావు



కాలువలో నుంచి డ్రింక్ సీసాను బయటకు తీస్తున్న విద్యార్థి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కూల్‌డ్రింక్ తాగేసి.. ఆ డ్రింక్ బాటిల్‌ను నిర్లక్ష్యంగా కాలువలో పడేశాడు.. అదే సమయంలో అక్కడకు వచ్చిన కలెక్టర్ ఆ దృశ్యాన్ని చూసి ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలను ఆ విద్యార్థికి వివరించాడు. తన తప్పు తెలుసుకుని బాధ్యతతో కాలువలో నుంచి ఆ బాటిల్‌ను తీసి పక్కన వేశాడు ఆ విద్యార్థి. ఇదంతా సింగ్‌నగర్‌లో జరిగింది. ఓటర్ల జాబితా పరిశీలన పనులను తనిఖీ చేసేందుకు శుక్రవారం సింగ్‌నగర్‌కు కలెక్టర్ ఢిల్లీరావు విచ్చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి స్థానికులతో మాట్లాడుతున్న ఆయనకు అక్కడే ఓ విద్యార్థి కనిపించాడు. వీడియో గేమ్ ఆడటానికి సిద్ధమైన అతను బయటకు వచ్చి కూల్‌డ్రింక్ తాగి, ఆ బాటిల్‌ను అక్కడే కాలువలో విసిరేశాడు. దీన్ని గమనించిన ఆయన ఆ విద్యార్థిని పిలిచి ఏం చదువుతున్నావ్ అంటూ ఆరా తీశారు. ప్లాస్టిక్ సీసాలను కాలువల్లో వేస్తే మురుగు పారకుండా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతాయని, వీటి ద్వారా దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందంటూ తనదైన రీతిలో విద్యార్థికి వివరించారు. ఆ విద్యార్థి తప్పు తెలుసుకొని వెంటనే కాలువలో తాను పడేసిన ప్లాస్టిక్ డ్రింక్ సీసాను బయటకు తీసి పక్కనున్న చెత్త డంపింగ్ బాక్సులో వేశాడు. వీడియో గేమ్స్‌కు అలవాటు పడటం, కూల్‌డ్రింక్‌లు తాగడంతో కలిగే నష్టాలను కూడా విద్యార్థికి అర్థమయ్యేలా వివరించి, బాగా చదువుకోవాలని సూచించారు. ఘటన చూసిన అక్కడివారంతా శెభాష్ కలెక్టర్ సార్ అంటూ ప్రశంసించారు.

పవిత్రమైనది నర్సింగ్ వృత్తి



సదస్సును ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జీ, ప్రతినిధులు

- వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జీ
- ఎస్ఎన్ఏ, టీఎన్ఏఐ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సు

గన్నవరం రూరల్: నర్సింగ్ వృత్తి పవిత్రమైనదని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి అన్నారు. గన్నవరం మండలం చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ స్కూల్ అండ్ కళాశాల, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ సైన్సెస్ ఆవరణలో శుక్రవారం ది ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ బ్రాంచ్ ఆధ్వర్యంలో 30వ రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. రాష్ట్రంలోని 60 నర్సింగ్ కళాశాలలు, స్కూళ్లకు చెందిన రెండు వేల మంది నర్సింగ్ విద్యార్థినీ విద్యార్థులు, టీచింగ్ స్టాఫ్, ట్రైనింగ్ నర్సెస్ అసోసియేషన్ సభ్యులు, స్టూడెంట్స్ నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డాక్టర్ బాబ్జీ మాట్లాడుతూ భవిష్యత్తులో నర్సింగ్ వృత్తి ప్రాధాన్యం విశేషంగా పెరగనుందని చెప్పారు. నర్సింగ్ సాధికారత, నైపుణ్యాలు, సవాళ్ల అంశంపై జరుగుతున్న సదస్సులో నేటి విద్యార్థులు నాణ్యత ప్రమాణాలపై చర్చించడం.. సమాజానికి అందించే ఉన్నతమైన సేవలకు ఊతమిస్తుందని ఆకాంక్షించారు. నర్సింగ్ సేవలో ప్రయోగాలు పెరగాలని చెప్పారు. రోగిని 24 గంటలూ కంటికి రెప్పలా కాపాడేది నర్సులు మాత్రమేనని చెప్పారు. ట్రైనింగ్ నర్సెస్ అసోసియేషన్ ఇండియా ఏపీ శాఖ అధ్యక్షురాలు ప్రొఫెసర్ సీఆర్ షంషీర్ బేగం మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిలో నైపుణ్యాల పెంపునకు విశేష కృషి జరుగుతోందన్నారు. ఈ పరిణామంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి గ్రామీణ ప్రాంత ప్రజలకు బేసిక్ కార్డియాక్ లైఫ్ సపోర్టు సేవలను అందించడానికి సంఘం కృషి చేస్తుందన్నారు. నర్సింగ్ పూర్తి చేసుకునే విద్యార్థులకు నర్సింగ్ కౌన్సిల్ బీసీఎల్ఎస్ సర్టిఫికెట్లను అందిస్తామన్నారు. ఐఆర్‌సీఎఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు, హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు, టీఎన్ఏఐ స్టేట్ సెక్రటరీ ప్రొఫెసర్ కె.సుశీల, సౌత్ రీజియన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జయినీ కెంప్, ఎస్ఎన్ఏ స్టేట్ అడ్వయిజర్ డాక్టర్ ఎం.సత్యవతి, డాక్టర్ సి.శోభనాద్రి నర్సింగ్ కళాశాల అండ్ స్కూల్ కన్వీనర్ వి.శశికళ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.వందన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వినూత్న ప్రయోగాలతో విద్యార్థుల ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

యనమలకుదురుకు చేరిన జయసూర్య మృతదేహం



శోకసంద్రంలో తల్లిదండ్రులు



జయసూర్య (ఫైల్)

పెనమలూరు: ఫిలిప్పీన్స్‌లో మెడిసిన్ చదువుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యనమలకుదురుకు చెందిన అయోధ్య జయసూర్య (23) మృతదేహం ఎట్టకేలకు శుక్రవారం యనమలకుదురుకు చేరుకుంది. గత నెల 20వ తేదీన ఫిలిప్పీన్స్‌లో బైక్‌పై ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన జయసూర్య మృతదేహం యనమలకుదురుకు తీసుకురావడానికి సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తాయి. దీంతో మృతుడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ప్రభుత్వ అధికారుల కృషితో జయసూర్య మృతదేహం కార్గో విమానంలో హైదరాబాద్‌కు వచ్చింది. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో యనమలకుదురుకు మృతదేహాన్ని తీసుకు వచ్చారు. నాలుగు నెలల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇంటికి రావల్సిన జయసూర్య విగతజీవిగా ఇంటికి రావటంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. వైఎస్సార్ సీపీ నేతలు, గ్రామస్తులు జయసూర్య మృతదేహానికి నివాళులర్పించారు. శనివారం యనమలకుదురులో జయసూర్య అంత్యక్రియలు జరగనున్నాయి.

క్లుప్తంగా

వీఎంసీ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ మేళా

పటమట(విజయవాడతూర్పు):నగరంలోని న్యూ రాజేశ్వరిపేట, వాంబే కాలనీలో గతంలో కేటాయించిన ఇళ్ల లబ్ధిదారులకు, కొనుగోలు చేసిన వారికి వీఎంసీ రిజిస్ట్రేషన్ మేళా నిర్వహిస్తుందని కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇళ్లను ఎలాట్ పొందిన వారు, ఎలాట్ పొందిన 10 సంవత్సరాల తర్వాత కొనుగోలు చేసిన నాన్‌ఎలాట్ దారులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇందుకు గజం రూ. 100 చొప్పున 40 గజాల స్థలానికి రూ. 4వేలు, రిజిస్ట్రేషన్ చార్జీల నిమిత్తం రూ. 860 చొప్పున చెల్లించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు ఒరిజినల్ ఎలాట్‌మెంట్ పట్టా, నాన్‌ఎలాట్‌మెంట్ దారులైతే వారి పేరుత ఒరిజినల్ విక్రయ డాక్యుమెంట్ (లింక్‌తో సహా), నోటరీ అఫడవిట్, ప్రస్తుతం చెల్లిస్తున్న నీటి, ఇంటి పన్నుల రసీదులు, ఆధార్‌కార్డు నకలు, ఇద్దరి సాక్షుల ఆధార్‌కార్డు నకలు తీసుకుని న్యూ రాజరాజేశ్వరి పేటలోని సచివాలయం నం 233, వాంబేబేకాలనీలోని డి బ్లాక్ కమ్యునిటీ హాల్లో జరిగే మేళాలో సంప్రదించాలని కోరారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి వారం రోజులపాటు నిర్వహించే మేళా వినియోగించుకోవాలని కోరారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని ప్రముఖ మిమిక్రీ కళాకారుడు సిల్వెస్టర్ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో సాంస్కృతిక సమేళన కార్యక్రమం స్పందన-2023 శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిల్వెస్టర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని చెప్పారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు తెచ్చుకోవాలని కోరారు. విద్యతో పాటు సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కళలు, క్రీడా రంగాల్లో అభ్యున్నతి సాధించాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సింగింగ్, గ్రూప్ డాన్స్, చిత్రలేఖనం వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ రాజు, అధ్యాపకులు సహాయ భాస్కరన్, శ్రీకుమార్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు

కృష్ణలంక(విజయవాడతూర్పు):కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ ఆవరణలోని కమ్యూనిటీ హాల్లో శుక్రవారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మేయర్ భాగ్యలక్ష్మీ, దేవినేని అవినాష్ పాల్గొని 16, 17, 18, 19, 20, 21, 22 డివిజన్లకు చెందిన 180 మందికి నూతనంగా మంజూరైన పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అర్హత కలిగిన వారందరికీ ఎప్పటికప్పుడు కొత్తగా పింఛన్లు మంజూరు చేస్తున్నారని చెప్పారు. వలంటీర్ల ద్వారా ఒకటో తేదీన ఇంటి ముంగిటకే అందజేస్తున్నామన్నారు. 16వ డివిజన్‌లో 33 మందికి, 17వ డివిజన్‌లో 34 మందికి, 18వ డివిజన్‌లో 22 మందికి, 19వ డివిజన్‌లో 10 మందికి, 20వ డివిజన్‌లో 27 మందికి, 21వ డివజిన్‌లో 26 మందికి, 22వ డివిజన్‌లో 28 మందికి నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయని వివరించారు. అర్హులై ఉండి సాంకేతిక సమస్యల వలన ఇంకా పింఛను రాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 17, 18, 19, 21, 22 డివిజన్ల కార్పొరేటర్లు తంగిరాల రామిరెడ్డి, వెంకట సత్యనారాయణ, రహెనా నాహిద్, పుప్పాల కుమారి, తాటిపర్తి కొండారెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, అవినాష్ తదితరులు

గుణదల (విజయవాడ తూర్పు):అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. ఈ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. 2వ డివిజన్ పరిధి మాచవరంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో నూతన పింఛన్ల లబ్ధిదారులకు నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని తెలిపారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆయన సఫలమయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందుకుంటున్నారని వివరించారు. కొత్తగా 184 పంచన్లు మంజూరయ్యాయని తెలిపారు. అనంతరం 2,3,4,5,6,7,8 డివిజన్‌లకు సంబంధించిన పింఛన్లు పంపిణీ చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, అంబడి పూడి నిర్మలాకుమారి, కలపాల అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేత

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి అన్నారు. రాణిగారితోట, 17వ డివిజన్‌లోని వార్డు సచివాలయాల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన పింఛన్లను సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో అర్హులైన 34 మందికి నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. కేవలం అర్హత ఉంటే చాలు పింఛను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్‌లో నాణ్యమైన ఆహారం

ఆటోనగర్(విజయవాడతూర్పు):ఆహా క్యాంటీన్‌లో పేదలకు అతి తక్కువ ధరకు నాణ్యమైన ఆహారం అందుతుందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఏపీఐఐసీ కాలనీలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను మేయర్ భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఇంటి తరహా ఆహార పదార్థాలు తక్కువ ధరకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నగరంలో రద్దీగా ఉండే పలు చోట్ల వీటిని మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా గ్రూపు సభ్యులు సొంతగా తయారు చేసుకొచ్చిన వంటలు పెడుతున్నారని పేర్కొన్నారు. ఇది మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని చెప్పారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం వెజిటెబుల్ బిర్యానీ, దద్దోజనం, పులిహోర, సాంబార్ అన్నం, వంటి పదార్థాలు స్వయం సహాయక సంఘ సభ్యులు ఇంటి నుంచి తయారు చేసుకొని ఆయా సెంటర్ల వద్ద ఆహార క్యాంటీన్‌లో అమ్ముతారన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు పి. పవన్‌కుమార్, జమ్ముల ప్రసాద్, పి.చంద్, హరీష్, ప్రాజెక్ట్ ఆఫీసర్ మరియు అడిషినల్ కమిషనర్ కె.శకుంతల, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆహా క్యాంటీన్ ప్రారంభిస్తున్న నగర మేయర్ భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్

చెస్‌లో హేమంత్‌కుమార్‌కు ఫిడే రేటింగ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్‌లో తమ విద్యార్థి హేమంత్‌కుమార్ రేటింగ్ సాధించడం అభినందనీయమని శ్రీ గౌతమ్ హైస్కూల్ కరస్పాండెంట్ నల్లాని సూర్యారావు తెలిపారు. గత నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించిన టోర్నమెంట్‌లో రేటింగ్ సాధించిన విద్యార్థికి శుక్రవారం స్కూల్ ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ టోర్నమెంట్‌లో 9 రౌండ్లలో 5.5 పాయింట్లు సాధించడంతో పాటు 1600 గాను 1214 రేటింగ్ సాధించి నగదు పురస్కారం అందుకుందన్నారు. విద్యార్థులను కేవలం చదువులోనే కాకుండా ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌లోనూ శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నామని కోచ్ రామకృష్ణ పేర్కొన్నారు.

పూడిక తీత పనులు వేగవంతం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గాఘాట్‌లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. దుర్గాఘాట్‌లో పూడిక తీత పనులను శుక్రవారం పరిశీలించారు. పూడిక తీత పనులను వేగవంతంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించడం జరిగిందని, వారం, పది రోజులలో పూడిక తీత పనులు పూర్తవుతాయన్నారు.

నేడు ప్రత్యేక ప్రసంగం

మొగల్రాజపురం:సీ.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న డిప్లొమో కోర్సు ఇన్ జర్నలిజంలో భాగంగా శనివారం ప్రత్యేక ప్రసంగం నిర్వహిస్తున్నామని మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ జి.శ్రీరామ్‌కుమార్ హాజరై రిజిస్ట్రేషన్లు-విధి విధానాలు అనే అంశంపై మాట్లాడతారని పేర్కొన్నారు. డిప్లొమో కోర్సు చేస్తున్న వారితో పాటుగా ఆసక్తి ఉన్న వర్కింగ్ జర్నలిస్టులు జూమ్ ఐడీ-815 9892 6979, పాస్‌వర్డ్-12345 ద్వారా హాజరై ఈ ప్రసంగాన్ని వినవచ్చన్నారు.

కృత్రిమ మేధస్సుతో సులభంగా సేవలు

మొగల్రాజపురం:ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను అన్ని రంగాల్లో ఉపయోగించుకుని సులభంగా కచ్చితమైన సేవలను పొందవచ్చునని చెన్నైలోని ఐసీటీ అకాడమీకి చెందిన సాంకేతిక విద్య శిక్షకురాలు ఈ.వల్లి చెప్పారు. సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని కళాశాల ఆవరణలో మైక్రోసాఫ్ట్ సంస్థ రూపొందించిన అజూరీ ఏఐ పై సదస్సు శుక్రవారం నిర్వహించారు.

వెహికల్ డిపో, గాంధీహిల్ పరిశీలన

పటమట(విజయవాడతూర్పు):వీఎంసీ వెహికల్ డిపోలో వాహనాల నిర్వహణ సక్రమంగా ఉండాలని కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం హనుమాన్ పేటలోని వెహికల్ డిపో ఆధునికీకరణ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా డిపోలో విధులు నిర్వహించే సిబ్బంది వివరాలు, మూవ్‌మెంట్ రిజిస్టర్ ఇతర వివరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. డిపోలో వాహనాలను సర్వీసింగ్ చేసే ప్రాంతం అపరిశుభ్రంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేస్తూ పరిసరాలన్నీ శుభ్రంగా ఉండాలని, సర్వీస్ పాయింట్ వద్ద డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకుని వచ్చే వ్యర్థాలను అందులో వేయాలని సూచించారు. డిపో పక్కన ఉన్న రైవస్ కాలవను పరిశీలించి గ్యాంగ్ వర్కర్ లను ఏర్పాటు చేసి కాలువ ఒడ్డున పేరుకుపోయే చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో తొలగించాలని సూచించారు. పలు అంతర్గత రోడ్లలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ తీరు, డ్రెయిన్లలో మురుగునీటి పారుదల విధానాన్ని పరిశీలించి వీధులు, డ్రెయిన్‌లు నిరంతరం శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. గాంధీహిల్‌ను పర్యాటక ప్రదేశంగా రూపొందించడంపై అధికారులకు పలు సూచనలు చేశారు. విజయవాడ నగరానికే తలమానికంగా అభివృద్ధి చేస్తున్న గాంధీ హిల్ అన్ని వయస్సుల వారిని ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని కోరారు. ఆహ్లాదంకు గ్రీనరీని అభివృద్ధి చేయాలని చెప్పారు. హిల్ కాంపౌండ్ వాల్, కొండ పైకి వెళ్లె దారిలో వాల్‌కు మరమ్మతులు చేయటంతోపాటు మెట్ల మార్గానికి ఇరువైపులా చెట్ల కొమ్మలకు ట్రిమ్మింగ్ చేయాలని స్పష్టం చేశారు. పర్యటనలో (డెప్యూటీ సిటీ ప్లానర్) జుబిన్ శిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సత్యనారాయణ, వెహికల్ డిపో ఇన్‌చార్జి యోగేంద్ర, ఎస్టేట్స్ ఆర్ఐ సత్యనారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.



వెహికల్ డిపోలో రికార్డులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఇన్సూరెన్స్ రంగంలో అగ్రగామిగా ఎల్ఐసీ

లబ్బీపేట(విజయవాడతూర్పు):దేశంలో 40 కోట్ల మంది పాలసీదారులకు మెరుగైన సేవలు అందిస్తూ ఎల్ఐసీ అగ్రగామి సంస్థగా వెలుగొందుతుందని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగు కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ అన్నారు. భారతీయ జీవిత బీమా సంస్థ 67వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని బెంజిసర్కిల్ సమీపంలోని బ్రాంచి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వేడుకలను రత్నప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ ప్రగతి పథంలో పయనించడంలో ఉద్యోగులు, ఏజెంట్లు, డెవలప్‌మెంట్ అధికారులు, ఇతర అధికారుల పాత్ర అభినందనీయం అన్నారు. ప్రజలకు బీమా రక్షణ, దేశ మౌలిక రంగ అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు. ఆ శాఖ ఎస్‌బీఎం సి.రామకృష్ణ మాట్లాడుతూ సేవలు మరింత చేరువయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు, పాలసీదారులు పాల్గొన్నారు.



ఎల్ఐసీ 67వ వార్షికోత్సవంలో రత్నప్రసాద్, ఎస్‌బీఎం రామకృష్ణ తదితరులు

సాక్షి బిజినెస్
శనివారం
2-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	556	65,387
నిఫ్టీ ▲	182	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,010	▽	25
డోజోన్స్	34,782	▲	60
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▽	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,489	▲	4
బంగారం (99.5 స్వచ్ఛత)	59,251	▲	4
వెండి (కిలో)	74,838	▽	193

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎపుకం	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	ఎపుకం	103.01	106.40
€	యూరో	ఎపుకం	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఎపుకం	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎపుకం	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	ఎపుకం	60.21	62.17
SAR	సౌదీ రియాల్	ఖావమకగ	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	ఖావమకగ	21.62	23.42
¥	చైనా యువాన్	ఖావమకగ	10.28	12.35

జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం అప్

ఆగస్టులో రూ.1,59,069 కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2023 ఆగస్టులో గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 11 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,59,069 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.28,328 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.35,794 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.83,251 కోట్లు.
- సెస్ రూ.11,696 కోట్లు.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి.

గ్రీస్‌లో జీఎంఆర్ మరిన్ని పెట్టుబడులు



ముంబై: గ్రీస్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్న దేశీ దిగ్గజం జీఎంఆర్ గ్రూప్.. ఆ దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టే యోచనలో ఉంది. కెలమాటా ఎయిర్‌పోర్ట్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం జీఈకే టెర్నా సంస్థతో కలిసి గ్రీస్‌లోని క్రెటె ప్రాంతంలో హెరాక్లియోన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. హెరాక్లియోన్ విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇంధన, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపార విభాగం చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తెలిపారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా గ్రీస్ ప్రధాన మంత్రి నిర్వహించిన విందులో శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భారత్, గ్రీస్ మధ్య కనెక్టివిటీ మెరుగుపడితే ఇరు దేశాల స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి, వ్యాపార అవకాశాల కల్పనకు తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు.

93 శాతం 2,000 నోట్లు వెనక్కు వచ్చేశాయ్: ఆర్‌బీఐ



ముంబై: ఉపసంహరణ నిర్ణయం వెలువడిన మే 19వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 93 శాతం తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటన ఒకటి పేర్కొంది. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం, ఆగస్టు 31వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్ల విలువ రూ.0.24 లక్షల కోట్లకు పడిపోయింది. బ్యాంకులకు తిరిగి వచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలో జరగ్గా, 13 శాతం బ్యాంకుల్లో ఇతర కరెన్సీలోకి మార్పిడి ద్వారా వెనక్కువచ్చాయి. అధిక విలువ నోట్లు కలిగి ఉన్న ప్రజలు 2023 సెప్టెంబరు 30 నాటికి ఆ నోట్లను డిపాజిట్ చేయాలని లేదా నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. 2016 నవంబర్లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018-19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ట చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8% మాత్రమే. వ్యవస్థలో 2,000 నోట్ల వినియోగం ఇంధనం, బంగారు ఆభరణాలు, కిరాణా కొనుగోళ్లకు అధికంగా వినియోగిస్తున్నట్లు ఇప్పటికే పలు సర్వేలు వెల్లడించాయి.

ఎయిర్ ఇండియా-విస్తారా విలీనానికి గ్రీన్ సిగ్నల్

కాంపిటీషన్ కమిషన్ ఆమోదముద్ర



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా-విస్తారా విలీనబాటలో కీలక అడుగు పడింది. కొన్ని షరతులకు లోబడి ఎయిర్ ఇండియా-విస్తారా ప్రతిపాదిత విలీనాన్ని కాంపిటీషన్ కమిషన్ శుక్రవారం ఆమోదించింది. తన విమానయాన వ్యాపారాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి సంబంధించి టాటా గ్రూప్‌కు ఇది ఒక ప్రధాన ముందడుగు. ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' పై చేసిన ఒక పోస్టింగ్‌లో విలీనానికి ఆమోదముద్ర వేసినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలిపింది. ''ఎయిరిండియాలో టాటా ఎస్ఐఏ ఎయిర్‌లైన్స్ విలీనానికి సీసీఐ ఆమోదం తెలిపింది. పార్టీలు అందించే స్వచ్ఛంద కట్టుబాట్లకు, విధి విధానాలకు లోబడి ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్దిష్ట వాటాలను కొనుగోలు చేస్తుంది' అని సీసీఐ పేర్కొంది. విస్తారా, ఎయిర్ ఇండియా టాటా గ్రూప్‌లో భాగంగా ఉన్న రెండు వేర్వేరు విమానయాన సంస్థలు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు విస్తారాలో 49% వాటా ఉంటే, టాటా సన్స్ వాటా 51%గా ఉంది. ఎయిరిండియాలో 25.1% వాటాను సింగపూర్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు చేయనున్న ఒప్పందం ప్రకారం విస్తారాను ఎయిర్ ఇండియాతో విలీనం చేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో టాటా గ్రూప్ ప్రకటించింది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో వార్‌బర్గ్ పింకస్ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ 4.2 శాతం వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. వీటి విలువ రూ. 2,480 కోట్లు. బీఎస్‌ఈ డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ 27.86 కోట్ల షేర్లను (4.2 శాతం) వాటాలను షేరు ఒక్కింటికి రూ. 89 రేటుతో విక్రయించింది. జూన్ ఆఖరు నాటి గణాంకాల ప్రకారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అనుబంధ సంస్థల ద్వారా వార్‌బర్గ్ పింకస్‌కు 8.5 శాతం వాటాలు ఉన్నాయి.

ఆగస్టులో ఆల్‌టైమ్ 'రయ్'!




న్యూఢిల్లీ: దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు ఆగస్టులో ఆల్‌టైం గరిష్టానికి చేరుకున్నాయి. ఎస్‌యూవీ(స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్)లకు డిమాండ్ కొనసాగడం, పండుగ సీజన్ మొదలవడంతో గిరాకీ పుంజుకుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మారుతీ సుజుకీ రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపింది. మొత్తం 1,89,082 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే నెల అమ్మకాలు 1,65,173 యూనిట్లతో పోలిస్తే 14% అధికం. హ్యుందాయ్, ఎంఅండ్ఎం, టయోటా కిర్లోస్కర్ కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించాయి. టాటా మోటార్స్, హోండా కార్స్ విక్రయాల్లో స్వల్ప క్షీణత నమోదైంది. ద్విచక్ర వాహన విభాగంలో బజాజ్ ఆటో విక్రయాలు 15% తగ్గాయి. హీరో మోటోకార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 6%, 4% పెరిగాయి. వాణిజ్య వాహనాలు, ట్రాక్టర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి.

ఆగస్ట్ వాహన అమ్మకాల తీరు..	2023	2022	వృద్ధి(%)
మారుతీ	1,89,082	1,65,173	(+)14
హ్యుందాయ్	71,435	62,210	(+)15
టాటా మోటార్స్	78,010	78,843	(-)1
ఎండ్ అండ్ ఎం	70,350	59,049	(+)19
హోండా కార్స్	7,880	7,769	(+)1
ఎంజీ మోటార్స్	4,185	3,823	(+)9
టయోటా	22,910	14,959	(+)53
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,41,648	4,01,595	(-)15
హీరో మోటో	4,88,717	4,62,608	(+)6
టీవీఎస్	3,45,848	3,33,787	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,583	70,112	(+)11
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,476	5,003	(+)29
అశోక్ లేలాండ్	15,576	14,121	(+)10
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,198	5,308	(+)2
మహీంద్రా	21,676	21,520	(+)1

కోవర్టు లాబీయింగ్ చేశాయి

- పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకున్నాయి
- అనిల్ అగర్వాల్ సంస్థలను టార్గెట్ చేసిన ఓసీసీఆర్‌పీ
- వేదాంత, కెయిర్న్‌పై ఆరోపణలు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ప్రమోటర్లపై ఆరోపణలు గుప్పించిన ఓసీసీఆర్‌పీ తాజాగా పారిశ్రామిక దిగ్గజం అనిల్ అగర్వాల్‌కి చెందిన కంపెనీలు వేదాంత, కెయిర్న్ ఇండియాను టార్గెట్ చేసింది. పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకునేందుకు వేదాంత కోవర్టు లాబీయింగ్ నడిపినట్లు కొత్తగా మరో నివేదికలో ఆరోపించింది. ప్రభుత్వం కూడా ప్రజలను సంప్రదించకుండా నిబంధనల మార్పులను ఆమోదించి, 'అక్రమ పద్ధతుల్లో' అమలు చేసినట్లు పేర్కొంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) విడుదల చేసిన నివేదికలోని కొన్ని ప్రధానాంశాలు..

- కొత్తగా పర్యావరణ అనుమతుల అవసరం లేకుండా దేశీయంగా ఉత్పత్తిని 50% వరకు పెంచుకునేందుకు మైనింగ్ కంపెనీలకు అనుమతినిస్తే ఆర్థిక వ్యవస్థ రికవరీ మరింత వేగవంతం కాగలదని 2021 జనవరిలో వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌కు లేఖ రాశారు.
- ''2022 తొలినాళ్లలో పలు దఫాల సమావేశాల అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలను సడలించింది. ప్రజాభిప్రాయాల సేకరణ నిర్వహించాల్సిన అవసరం లేకుండా మైనింగ్ కంపెనీలు 50 శాతం వరకు ఉత్పత్తిని పెంచుకునేందుకు అనుమతించింది'' అని ఓసీసీఆర్‌పీ తెలిపింది.
- వేదాంత తరహాలోనే దాని అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ కూడా వ్యవహరించింది. చమురు అన్వేషణ ప్రాజెక్టుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనను ఎత్తివేసేందుకు లాబీయింగ్ చేసింది.
- అధికార బీజేపీకి వేదాంత గణనీయంగా విరాళాలు కూడా ఇచ్చినట్లు (2016-2020 మధ్య కాలంలో రూ.43.5 కోట్లు) ఆధారాలు ఉన్నాయని ఓసీసీఆర్‌పీ తెలిపింది.

వేదాంత స్పందన ఇదీ..

ఓసీసీఆర్‌పీ ఆరోపణలను నిర్దుష్టంగా ఖండించకుండా వేదాంత స్పందించింది. 'దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి అనుకూలమైన విధానాల్లో దేశీయంగా ఉత్పత్తిని పెంచాలనేది మా లక్ష్యం. దానికి అనుగుణంగా దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, సహజ వనరుల విషయంలో భారత్ స్వావలంబన సాధించడంలో తోడ్పాటు అందించే ఉద్దేశంతో ప్రభుత్వ పరిశీలన కోసం పలు విజ్ఞప్తులు చేశాము' అని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

రెండు నెలల్లో అతిపెద్ద లాభం

- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 19,400 స్థాయి పైకి నిఫ్టీ



ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒక శాతం మేర ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 556 పాయింట్లు పెరిగి 65,387 వద్ద నిలిచింది. నిఫ్టీ 182 పాయింట్లు బలపడి 19,435 వద్ద స్థిరపడింది. వెరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద లాభాన్ని గడించాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 642 పాయింట్లు దూసుకెళ్లి 65,473 వద్ద, నిఫ్టీ 205 పాయింట్లు ఎగసి 19,459 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.488 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,295 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 500 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. కాగా, సెన్సెక్స్ భారీ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.312.33 లక్షల కోట్లు ఎగబాకింది.

సాక్షి స్పోర్ట్స్

అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న తొలి 'ట్రాన్స్‌జెండర్'గా డానిల్ మెక్‌గహే

అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి 'ట్రాన్స్‌జెండర్' బరిలోకి దిగనుంది. లింగ మార్పిడి చేసుకున్న కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే ఇప్పుడు మహిళల జట్టు తరఫున క్రికెట్ ఆడుతుంది. అమెరికన్ క్వాలిఫయర్ టోర్నీలో పాల్గొనే కెనడా టి20 జట్టులో ఆమెకు చోటు లభించింది. ఆస్ట్రేలియాలో పుట్టిన ఆమె కెనడాకు వలస వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్‌లు అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఐసీసీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను ఆమె ఇటీవలే అందుకుంది. 'ట్రాన్స్‌జెండర్‌ను మహిళగా గుర్తించాలంటే వరుసగా 12 నెలల పాటు టెస్టోస్టిరాన్ లెవల్ 5 నానోమోల్/లీటర్‌కంటే తక్కువగా ఉండాలి' అనేది ఐసీసీ నిబంధన.



నీరజ్‌కు రెండో స్థానం

జ్యూరిచ్ డైమండ్ లీగ్ మీట్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): భారత స్టార్ అథ్లెట్, వరల్డ్ చాంపియన్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్‌లో కాస్త తడబడ్డాడు. ఈ సీజన్ లీగ్ నాలుగో మీట్ బరిలోకి దిగిన నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. జ్యూరిచ్‌లో జరిగిన ఈ పోటీల్లో నీరజ్ 85.71 మీటర్ల దూరం జావెలిన్ విసిరాడు. ఈ ఈవెంట్‌లో జాకబ్ వాల్డెచ్ (చెక్ రిపబ్లిక్ - 85.86 మీటర్లు) అగ్రస్థానం సాధించగా... జూలియన్ వెబర్ (జర్మనీ - 85.04 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాడు. నీరజ్ విసిరిన ఆరు త్రో లలో 80.79 మీ., 85.22 మీ., 85.71 మీ. దూరాలు నమోదు చేయగా మరో మూడు త్రో లు 'ఫౌల్' అయ్యాయి. అయితే మూడు మీట్‌లలో కలిపి 23 పాయింట్లు సాధించడం ద్వారా మూడో స్థానంతో డైమండ్ లీగ్ ఫైనల్ చాంపియన్‌షిప్‌కు నీరజ్ అర్హత సాధించాడు. గత ఏడాది డైమండ్ లీగ్ చాంపియన్ అయిన నీరజ్...ఈ సీజన్‌లో దోహా, లాసానేలలో అగ్రస్థానం సాధించాడు. గాయం కారణంగా అతను మొనాకో మీట్‌లో పాల్గొనలేకపోయాడు. సెప్టెంబర్ 17నుంచి యూగీన్ (అమెరికా)లో ఫైనల్స్ జరుగుతుంది. ఇతర ఫలితాల్లో లాంగ్‌జంప్‌లో మురళీ శంకర్ ఐదో స్థానంలో నిలిచాడు. అతనూ ఫైనల్స్‌కు అర్హత సాధించడంలో సఫలమయ్యాడు.



జ్యూరిచ్‌లో తన ప్రదర్శన పట్ల నీరజ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ తర్వాత తాను బాగా అలసిపోయానని, కాస్త భుజం నొప్పి కూడా ఇబ్బంది పెట్టిందని నీరజ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్స్ సమయానికి తాను 100 శాతం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నిలబెట్టుకోవడం కూడా తన లక్ష్యమని నీరజ్ వెల్లడించాడు.

నేడే 'ఆసియా' అసలు సమరం

భారత్, పాక్ ఢీకి సిద్ధం

- ఫేవరెట్‌గా రోహిత్ సేన
- నంబర్‌వన్ హోదాతో బాబర్ బృందం
- మ్యాచ్‌కు వానగండం
- మ.గం. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఆసియా కప్ ట్రోఫీతో గత ఏడాది (2022) భారత, పాకిస్తాన్ కెప్టెన్లు రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్ (ఫైల్)

పల్లెకెలె: వన్డే ప్రపంచకప్‌కు ఇంకొన్ని రోజులే ఉంది. మెగా ఈవెంట్‌కు ముందు క్రికెట్ ప్రపంచం ఒళ్లంతా కళ్లు చేసుకునే కీలక మ్యాచ్ నేడు జరుగనుంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్లు సై అంటే సై అనే పోరుకు ఆసియా కప్ వన్డే టోర్నీ వేదికైంది. నంబర్‌వన్ పాక్, ఆసియా కప్ ఫేవరెట్ భారత్ మధ్య జరగబోయే ఈ పోరు టోర్నీకే హైలైట్‌గా నిలవడం ఈపాటికే ఖాయమైంది. కేవలం వన్డే ఫార్మాట్‌నే చూసుకుంటే గత వన్డే ప్రపంచకప్ తర్వాత ఇరు జట్లు తలపడే 50 ఓవర్ల పోటీ ఇదే! గతేడాది జరిగిన టి20 వరల్డ్‌కప్‌లో విరాట్ అద్భుత ప్రదర్శన తర్వాత ఇరు జట్లు ఇప్పుడు తలపడుతున్నాయి. మెల్‌బోర్న్ తరహాలో లంక గడ్డపై కూడా మరో హోరాహోరీ ఖాయం.

కొత్త ఉత్సాహంతో రోహిత్ బృందం

గత కొన్నాళ్లుగా స్వదేశంలో జరిగే ప్రపంచకప్ కోసం భారత్ చాలా ప్రయోగాలు చేసింది. రాహుల్, అయ్యర్, బుమ్రావంటి కీలక ఆటగాళ్ల గాయాల నేపథ్యంలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ తగిన జాగ్రత్తలు తీసుకొని సీనియర్లు రోహిత్, కోహ్లిలకు బాగా విశ్రాంతినిస్తూ కాపాడుకుంటూ వచ్చింది. ఇక సమయం, సందర్భం రావడంతో టీమిండియా తురుపుముక్కలు బరిలోకి దిగుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కచ్చితంగా 'ప్రి ప్రపంచకప్' పోటీనే! ఇందులో ఏ సందేహం లేదు. దాదాపు వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగే జట్టును ఖాయం చేసేందుకు ఈ ఆసియా టోర్నీని జట్టు వాడుకుంటోంది. రోహిత్, కోహ్లిల ఫిట్‌నెస్, జట్టులోకి అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ జడేజా పునరాగమనం, మరో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, బౌలింగ్ దళపతి బుమ్రా, 'హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత్ పూర్తి స్థాయి ప్రపంచకప్ సైన్యంతో రంగంలోకి దిగుతోంది. దీన్నిబట్టి చూస్తే పాక్ పనిపట్టేందుకు, ఆసియా కప్‌లో ఓడించేందుకు రోహిత్ సేనకు ఏమంత కష్టం కానేకాదు.

పుంజుకున్న బలంతో పాక్

కొంత కాలంగా ఇంటాబయటా నిలకడైన విజయాలు, గట్టి ప్రత్యర్థులను ఓడించిన తీరుతో బాబర్ ఆజమ్ సేన మునుపటి కంటే పుంజుకుంది. బ్యాటింగ్‌లో ఫఖర్-ఇమామ్ ఓపెనింగ్ జోడీ నుంచి ఏడో నంబర్ షాదాబ్ ఖాన్ వరకు బ్యాటింగ్ చేసే సత్తా పాకిస్తాన్ పటిష్టంగా నిలుపుతోంది. బౌలింగ్‌లో పేస్ త్రయం షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్ ఆరంభంలో వికెట్లు పడగొట్టడంతో సఫలమవుతున్నారు. స్పిన్‌లో షాదాబ్, నవాజ్ సత్తా చాటుతుండటంతో పాకిస్తాన్ భారత్‌కు దీటుగా ఉంది. నంబర్‌వన్ హోదా అదనపు స్థైర్యాన్ని తెచ్చిపెట్టగా... రెట్టించిన ఉత్సాహంతో ప్రత్యర్థిని ఢీకొనేందుకు రెడీగా ఉంది.

గత ఐదు వన్డేల్లో...

భారత్, పాక్‌లు తలపడిన గత ఐదు వన్డేల్లో టీమిండియాదే 4-1తో పైచేయిగా ఉంది. 2017 చాంపియన్స్ ట్రోఫీలో లీగ్ దశలో గెలిచి తుదిపోరులో భారత్ ఓడింది. 2018 ఆసియాకప్‌లో రెండుసార్లు టీమిండియా గెలిచింది. చివరిసారిగా గత వన్డే ప్రపంచకప్(2019)లోనూ భారత్‌దే గెలుపు.

పిచ్-వాతావరణం

ఇది కొత్త పిచ్. పక్కాగా దీనికే అనుకూలమని చెప్పలేం. లంక, బంగ్లా మధ్య జరిగినట్లే సీమర్లు, స్పిన్నర్లకు చక్కని చాన్స్! అయితే మ్యాచ్‌కు వాన ముప్పు పొంచివుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన కురిసే అవకాశముండటంతో మ్యాచ్ మొదలయ్యేందుకు ఆలస్యం కావొచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), శుబ్‌మన్, కోహ్లి, అయ్యర్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, జడేజా, శార్దుల్ /షమీ, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.
పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హక్, రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్, షాదాబ్‌ఖాన్, నవాజ్, షాహిన్ షా అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్.



మైదానంలో విరాట్ కోహ్లి, రవూఫ్ ముచ్చట్లు

'విషీ'ని దాటిన గుకేశ్

- 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున నంబర్‌వన్
- 37 ఏళ్ల తర్వాత అగ్రస్థానం కోల్పోయిన ఆనంద్



చెన్నై: 1986 జులై 1... చదరంగ మేధావి విశ్వనాథన్ ఆనంద్ భారత నంబర్‌వన్ ఆటగాడిగా మొదటిసారి గుర్తింపు తెచ్చుకున్న రోజు. నాటినుంచి ఇప్పటి వరకు అతనిదే అగ్ర స్థానం. అతని తర్వాత భారత్‌నుంచి పెద్ద సంఖ్యలో కుర్రాళ్లు సత్తా చాటుతూ వచ్చినా... వారితో పోటీ పడుతూ సత్తా చాటిన ఆనంద్ 37 సంవత్సరాలుగా 'టాప్'లోనే నిలిచాడు. ఒక తరం పాటు ఆటను శాసించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఆనంద్ ఇప్పుడు తొలిసారి తన భారత నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. 17 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శుక్రవారం అధికారికంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రకటించింది. ఇందులో గుకేశ్ 8వ ర్యాంక్‌లో నిలవగా... విశ్వనాథన్ ఆనంద్ 9వ ర్యాంక్‌లో ఉన్నాడు. గుకేశ్ రేటింగ్ 2758 కాగా, ఆనంద్ రేటింగ్ 2754గా ఉంది. ఇటీవల జరిగిన వరల్డ్ కప్ సమయంలోనే 'లైవ్ రేటింగ్'లో ఆనంద్‌ను గుకేశ్ అధిగమించాడు. అయితే ఇప్పుడు 'ఫిడే' ర్యాంకింగ్ ద్వారా అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. టాప్-30 ర్యాంకింగ్స్‌లో వీరిద్దరితో పాటు భారత్ నుంచి ఆర్. ప్రజ్ఞానంద (19), విదిత్ గుజరాతీ (27), అర్జున్ ఎరిగైశి (29) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 31వ స్థానంలో కొనసాగుతున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల గ్రాండ్‌మాస్టర్‌గా మారిన గుకేశ్ అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

అల్‌కరాజ్, మెద్వెదెవ్ ముందంజ

- ఓటమితో జాన్ ఇస్నర్ రిటైర్
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



కుమారుడితో ఇస్నర్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)కు రెండో రౌండ్‌లో సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6-3, 6-1, 7-6 (7/4)తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)ను ఓడించి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) రెండో రౌండ్‌లో 6-2, 6-2, 6-7 (6/8), 6-2తో క్రిస్టోఫర్ కానెల్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత ఆండీ ముర్రే (బ్రిటన్) ఆట మాత్రం రెండో రౌండ్‌లోనే ముగిసింది. గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 6-4, 6-1తో ముర్రేను ఇంటి ముఖం పట్టించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (రష్యా) 6-3, 6-2తో జోడీ బురేజ్ (యూకే)ను...9వ సీడ్ వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6-2, 6-2తో ట్రెవిజాన్ (ఇటలీ)ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

టెన్నిస్ సర్క్యూట్‌లో సుదీర్ఘ మ్యాచ్‌లకు చిరునామాగా నిలిచిన జాన్ ఇస్నర్ (అమెరికా) రెండో రౌండ్‌లో మరో సుదీర్ఘ సమరంలో ఓడి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 3 గంటల 57 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అమెరికాకే చెందిన మైకేల్ మో 3-6, 4-6, 7-6 (7/3), 6-4, 7-6 (10/7) స్కోరుతో ఇస్నర్‌ను ఓడించాడు. టెన్నిస్ చరిత్రలో సుదీర్ఘ మ్యాచ్ (11 గంటల 5 నిమిషాల పాటు - నికోలస్ మహుత్‌తో) ఆడిన రికార్డులో ఇస్నర్ భాగం కాగా...అత్యధిక ఏస్‌లు (14,470) కొట్టిన ఘనత కూడా అతని సొంతం. **పురుషుల డబుల్స్‌లో ఇద్దరు భారత ఆటగాళ్ల పోరు తొలి రౌండ్‌లోనే ముగిసింది. యూకీ బాంబ్రీ (భారత్) - డెమోలినర్ (బ్రెజిల్) జోడి 3-6, 5-7తో హ్యూగో నిస్ (మొనాకో) - జిలిన్‌స్కీ (పోలాండ్) చేతిలో... సాకేత్ మైనేని (భారత్) - కరట్‌సెవ్ (రష్యా) ద్వయం 7-6 (7/4), 3-6, 2-6తో లాస్లో జెరె (సెర్బియా) - హ్యూస్టర్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడారు.**